


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-1-2026 మంగళవారం సంపుటి: 31 సంచిక: 336 పేజీలు: 8+16 వెల: 6.50



పిఒకెను భారత్‌లో కలిపేయాల్సిందే: బ్రిటన్ ఎంపి 5

అమెరికాలో పాలకొల్లు సాఫ్ట్‌వేర్ దంపతుల మృతి 7


## సహకరించకపోతే టారిఫ్‌ల మోత

5

భారత్‌కు మరోసారి ట్రంప్ హెచ్చరిక

రష్యా చమురు కొనుగోలు నిలిపివేయాల్సిందే

వాణిజ్య చర్చలతో ముడిపెట్టిన అమెరికా అధ్యక్షుడు



5

## అమెరికా డిమాండ్లు నెరవేర్చాల్సిందే!

లేదంటే మళ్లీ దాడులు: హెచ్చరించిన ట్రంప్

అమెరికా సహకారం మాకు కావాలి

వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ



2

## జెడివాన్స్ ఇంటిపై దాడి

కిటికీ అద్దాలు ధ్వంసం

అనుమానితుడు అరెస్టు

ఇంట్లోలేని అమెరికా ఉపాధ్యక్షుడు

ఒహియోలోని సిన్సినాటిలో ఘటన



డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి

## చట్టబద్ధత

తెలంగాణ వర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026కు శాసన సభ ఆమోదం

రాష్ట్ర జిఎస్‌టి సవరణ బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి జూపల్లి కృష్ణారావు

మద్యం తయారీలో వినియోగించే ఇఎన్‌ఎపై జిఎస్‌టి మినహాయింపు

కేంద్ర చట్టాలకు అనుగుణంగా రాష్ట్రచట్టంలో మార్పులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 5:** తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి చట్టబద్ధత లభించనుంది. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి చట్టబద్ధత కల్పించడం కోసం తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు2026కు శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది. సోమవారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాలు ముగియగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున సభలో యూనివరినసటీ చట్టసవరణ బిల్లును వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రవేశ పెట్టారు. గతేడాది డిసెంబర్‌లో యూనివర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూనివర్సిటీని ప్రారంభిన విషయం తెలిసిందే. ఖనిజ సంపదకు నెలవైన కొత్తగూడెం ప్రాంతాన్ని విద్యా హబ్‌గా మార్చే లక్ష్యంతో, ముఖ్యమంత్రి రేవంత్ గతేడాది డిసెంబర్‌లో ప్రారంభించిన "డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" కి శాశ్వత ప్రాతిపదికన చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ మేరకు 'తెలంగాణ యూనివర్సిటీల >>2

మధ్యవర్తిత్వంతో

# పరిష్కరించుకోండి



సమగ్ర విచారణ కోసం సివిల్ సూట్ ఫైల్ చేయండి

పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

12వ తేదీకి విచారణ వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి5:** పోలవరం- నల్లమల సాగర్ ప్రాజెక్ట్ విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్ట్‌పై మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించండీ అంటూ ఏపీ,తెలంగాణ రాష్ట్రాలకు సూచించారు. అనంతరం కేసు తదపరి విచారణను వచ్చే సోమవారానికి(12వ తేదీకి) వాయిదా వేశారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుపై స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. ఈ ప్రాజెక్టుతో గోదావరిలో తమ వాటా తగ్గుతుందని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్‌కు సంబంధించి మూడు పరిష్కారాలను సుప్రీంకోర్టుకు సూచించింది. 1.సమగ్ర విచారణ కోసం సివిల్ సూట్ ఫైల్ చేయండీ, 2.కేంద్ర ప్రభుత్వ కమిటీకి తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనలను పరిశీలించి,అవసరమైతే ప్రాజెక్టును ఆపే నిర్ణయాధికారాన్ని ఇస్తాం. 3.మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకున అవకాశం ఇస్తున్నాం. ఇదిలా ఉండగా,అంతకు ముందు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం >>2

## నల్లమలసాగర్‌ను అడ్డుకుంటాం



ఎపి ప్రతిపాదనలు జల నిబంధనలను ఉల్లంఘించడమే

హరీష్ రావు చూపించిన లేఖను సిడబ్ల్యుసి ఆమోదించలేదు

వాదనలకు స్వయంగా హాజరవుతా

మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్

7

## కృష్ణా, గోదావరి అనుసంధానం



విద్వేషాలు వద్దు

సమైక్యంగా ముందుకెళ్దాం!

జల వివాదాల శాశ్వత పరిష్కారం నా లక్ష్యం

కాళేశ్వరానికి నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు

2

3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు



మేడారం జాతర ఆహ్వాన పత్రికను సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అందజేస్తున్న మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఆలయ పూజారులు

28 నుంచి 31 వరకు మహాజాతర

మేడారం జాతరకు

## మెగా ఏర్పాట్లు

18న మేడారానికి సిఎం రేవంత్,

19న గద్దెల పునరుద్ధరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి5:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 18న మేడారం వెళ్లనున్నారు. జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మహా జాతరకు ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవార్ల గద్దెల పునరుద్ధరణతో పాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. వేలాది మంది భక్తులు నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ నెల 19న మేడారం గద్దెల పునరుద్ధరణ జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పునరుద్ధరణ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సహా మంత్రులు హాజరు కానున్నారు కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, స్పీకర్, ఇతర మంత్రులకు మేడారం మహా జాతరకు ఆహ్వానం అందింది. అసెంబ్లీలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ ఆహ్వాన పత్రికలను అందించారు. మేడారం అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.230 కోట్లు కేటాయించింది. మేడారంలో ఇప్పటికే భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి సుమారు 2 లక్షల మంది భక్తులు తరలి వచ్చారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, జంపన్న, నాగులమ్మకు ముడుపులు కట్టి తమ భక్తిని చాటుకున్నారు. గద్దెల వద్ద పసుపు, కుంకుమ సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు రావాల్సిందిగా కోరుతూ సోమవారం లోక్‌భవన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సమ్మక్క కలిశారు. ఈమేరకు మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. సారలమ్మ పూజారులుసమ్మక్క సారలమ్మ జాతరకు రావాలని మంత్రులు ఆహ్వానించారు. సమ్మక్క సారలమ్మ >>2



హౌసింగ్ బోర్డు ఎల్ఐజి ఫ్లాట్లకు

## భారీ డిమాండ్


గచ్చిబౌలిలోని 111 ఫ్లాట్లకు 2685 దరఖాస్తులు

కేటాయింపునకు నేడు లాటరీ నిర్వహణ

యూట్యూబ్, ఇతర మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం

స్థలాభావం రీత్యా లాటరీ కేంద్రంలోకి ప్రజలకు నో ఎంట్రీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి5:** అల్పాదాయ (ఎల్ఐజి) వర్గాల కోసం హౌసింగ్ బోర్డు ప్రత్యేకంగా కేటాయించిన వివిధ ప్రాంతాల్లోని ఫ్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించిన ఫ్లాట్లను ఎల్ఐజి వర్గాలకు (6 లక్షల వార్షికాదాయం ఉన్న ప్రజల కోసం) విక్రయించడానికి, ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ హౌసింగ్ బోర్డు డిసెంబర్ 16 వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చింది. 3వ తేదీ సాయంత్రం వరకు మొత్తం 3.096 దరఖాస్తులు వచ్చాయి. ఒక్క హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతంలోని వివిధ అపార్ట్ మెంట్ లలో ఉన్న 111 ఫ్లాట్ల కోసం 2,685 దరఖాస్తులు వచ్చాయి. వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రాజెక్టులోని ఫ్లాట్ల కూడా 388 దరఖాస్తులు వచ్చాయి. కాగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఖమ్మంలోని ఫ్లాట్లకు దరఖాస్తుల స్వీకరణ తేదీని 8వ తేదీ వరకు పొడిగించారు.వీటికి సంబంధించిన లాటరీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించడానికి హౌసింగ్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది. 6వ తేదీన హైదరాబాద్, 8వ తేదీన వరంగల్, 10వ తేదీన ఖమ్మం ప్రాంతంలోని ఫ్లాట్ల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని హౌసింగ్‌బోర్డు ప్రజా సంబంధాల అధికారి (పిఆర్‌ఓ)వి.వాసుఒక ప్రకటనలో తెలిపారు. >>2



సినిమా చూడటానికి బస్సులో వెళ్తున్న సిఎం రేవంత్, మంత్రులు

## 'పూలే' ఆదర్శనీయుడు

ఆయన ఆశయాల సాధనకు కృషి: సిఎం రేవంత్

అసెంబ్లీ నుంచి బస్సులో వెళ్లి ప్రసాద్ ల్యాబ్‌లో సినిమాను చూసిన సిఎం, మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి5:** సోమవారం సాయంత్రం ప్రసాద్ ల్యాబ్‌లో హిందీ నుంచి తెలుగులోకి అనువదించిన పూలే సినిమాను ప్రదర్శించారు. ఈ సినిమాను వీక్షించేందుకు ముఖ్యమంత్రి >>2

న్యూయార్కు కోర్టురూమ్‌లో

## నికోలస్ మదురో!

వెనిజులా అధ్యక్షుడి అరెస్టును సవాల్ చేసిన న్యాయవాదుల బృందం

**న్యూయార్కు, జనవరి 5:** సైనిక చర్యతో అరెస్టుచేసిన వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను యుఎస్ అదికారులు న్యూయార్కు కోర్టురూంలో సోమవారం హాజరుపరిచారు. నార్కో >>2



మదురోను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు



## మావోల రహిత రాష్ట్రంగా తెలంగాణ

కగార్ గడువులోపే లక్ష్య సాధన

మిగిలిన 17 మంది లొంగుబాటుకు

చర్యలు: డిజిపి శివధర్‌రెడ్డి 2



ఫోన్ ట్యాపింగ్ కేసు:

## హరీష్‌రావుకు ఊరట!

తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ మాజీ నేత చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి నమోదైన ప్రధాన కేసుతో సంబంధం లేని ఈ కేసు విషయంలో ఇప్పటికే >>2



2

మండలిలో కవిత కంటతడి

వ్యక్తిగా సభనుంచి వెళ్తున్నా..

రాజకీయ శక్తిగా

## తిరిగొస్తా..

ఇక రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి

నాది ఆత్మగౌరవ పంచాయితీ

అవమానించి పార్టీ నుంచి గెంటేశారంటూ మండలిలో కవిత భావోద్వేగం



సోమవారం గుంటూరులో తెలుగు మహాసభల్లో మాట్లాడుతున్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు

# కృష్ణా, గోదావరి అనుసంధానం

## విద్వేషాలు వద్దు.. సమైక్యంగా ముందుకెళ్దాం!

### జల వివాదాల శాశ్వత పరిష్కారం నా లక్ష్యం

### 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, జనవరి 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు రాష్ట్రాలు సమైక్యంగా ఉంటేనే తెలుగు జాతి పురోగతి సాధ్యమవుతుందని... ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య జల వివాదాలు శాశ్వతంగా పరిష్కారం కావాలన్నదే తన లక్ష్యమని... తెలుగు వారంతా ఐక్యంగా ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. గుంటూరులో సోమవారం శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వహిస్తున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్య అతిథిగా సిఎం చంద్రబాబు హాజరయ్యారు. గోవా గవర్నర్ పి.అశోక్ గజపతి రాజుతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని తపాల శాఖ రూపొందించిన ప్రత్యేక కవర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం సిఎం చంద్రబాబు ప్రసంగిస్తూ... “మనం రెండు రాష్ట్రాలుగా ఉన్నా, తెలుగే మనకు మాతృభాష. తెలుగు వారంతా ఐకమత్యంగా ఉంటేనే అగ్రస్థానంలో నిలుస్తాం. సాగునీటి వ్యవస్థకు దారి చూపింది ఎన్టీఆర్. ఎన్టీఆర్ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. సాగర్ జలాలను ఉపయోగించుకునేలా ఎస్ఎల్‌బిసి, ఎస్ఆర్‌బిసి కాలువలు తెచ్చారు. ఆ తర్వాత తాను ముఖ్యమంత్రిగా కల్వకుర్తి లిఫ్ట్, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేశాను. కృష్ణా డెల్టా ఆధునీకరణతో నీటిని పొదుపు చేసి 20 టిఎంసిల నీటిని తెలంగాణకు కేటాయించి బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశాం. గోదావరి నదిపై అలీ సాగర్, దేవాదుల ఎత్తిపోతల వంటి పథకాలను చేపట్టాం. ఆంధ్రా ప్రాంతంలో చాగల్నాడు, పుష్కర, తాటిపూడి వంటి లిఫ్ట్ ప్రాజెక్టులు తెచ్చాం. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాకు నీరు అందించాం. ప్రతి ఏడాది గోదావరి నుంచి 3 వేల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలోకి పోతోంది. గతేడాది కృష్ణా, గోదావరి నదుల నుంచి సుమారు 6,282 టిఎంసిల నీళ్లు సముద్రంలోకి వెళ్లాయి. గోదావరిలో పుష్కలంగా ఉన్న నీళ్లను తెలంగాణ వాడుకున్నా, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా అభ్యంతరం చెప్పలేదు. ఎపిలో నదులను అన్నింటినీ అనుసంధానించాలి. కృష్ణా- గోదావరి నదులు అనుసంధానం జరుగుతుంది“ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

# యూనివర్సిటీకి చట్టబద్ధత

>> చట్టం1991'ని సవరిస్తూ రూపొందించిన బిల్లును ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి తరఫున, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శాసనసభలో ప్రవేశపెట్టారు. 1978లో స్థాపించిన కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ (తర్వాతి కాలంలో ఇంజనీరింగ్ కాలేజీ)ని అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 2025లో సీఎం చేతుల మీదుగా ప్రారంభమైన ఈ వర్సిటీకి, తాజా చట్ట సవరణ ద్వారా పూర్తి అటానమీ (స్వయంప్రతిపత్తి) లభించనుంది. దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలకు నివాళిగా ఈ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం జరిగింది. యూనివర్సిటీ అభివృద్ధికి వచ్చే రెండేళ్లలో రూ. 500 కోట్లు కేటాయిస్తామని, యూనివర్సిటీ విస్తరణ కోసం 310 ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. ప్రపంచంలో ఎర్త్ సైన్సెస్ కోసం ప్రత్యేక వర్సిటీలు ఉండడం చాలా అరుదన్నారు. సింగరేణి గనులు, గోదావరి నది, అటవీ సంపద ఉన్న కొత్తగూడెం ప్రాంతం విద్యార్థులకు ఒక “లివింగ్ లాబొరేటరీ“ గా మారుతుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనతో కూడిన విద్య ఇక్కడ సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. .ప్రస్తుతం ఉన్న బీటెక్ కోర్సులతో పాటు, కొత్తగా బీఎస్సీ (జియాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్), ఎంఎస్సీ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి సభకు తెలిపారు. చట్టబద్ధత వల్ల యూనివర్సిటీకి సొంతంగా కరికులమ్ రూపొందించుకునే స్వేచ్ఛ, యూజీసీ నిధులు, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు (ఎంవోయు) కుదుర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. సింగరేణి ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తెలంగాణను మైనింగ్, జియాలజీ రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టేందుకే ఈ యూనివర్సిటీని స్థాపించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ సభకు వివరించారు. చట్టసవరణపై ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ మాట్లాడుతూ యూనివర్సిటీలో కొత్త కోర్సులను ఏర్పాటు చేయాలని, మార్కెట్‌కి అనుగుణంగా కోర్సులను రూపొందించాలన్నారు. సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు సంతోషకరమన్నారు. వర్సిటీ నిర్వహణలో ఇబ్బందులు రాకుండా, నిధులుఏర్పాటు చేయాలనిసిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు.

# కోర్టురూమ్‌లో నికోలస్ మదురో!

>> ఉగ్రవాదం, డ్రగ్స్ అక్రమరవాణా వంటి వాటిపైనే ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. అయితే ఆయన తరపు న్యాయవాదులబృందం కొన్ని కీలక పాయింట్లపై ఆయన అరెస్టును సవాల్‌చేయనున్నారు. ప్రస్తుత దేశ అధ్యక్షుడు అయిన మదురో ఒక విదేశీ కోర్టులోప్రాసిక్యూషన్ అభియోగాలనుంచి మినహాయింపు పొందే అవకాశం ఉంది. అంతర్జాతీయ చట్టాలప్రకారం ఇది ఎంతమాత్రం వీలుకాదు. అమెరికా ప్రభుత్వం వరకూ చూస్తే వెనిజులా మదురోను న్యాయబద్ధంగా ఎన్నికైన నాయకుడుగా గుర్తించడంలేదు. అమెరికా దేశీయ చట్టాలప్రకారం మదురో న్యాయవాదుల వాదనలు కొట్టివేసే వీలుంది. అలాగే న్యాయవాదులు మదురోను దాడిచేసి పట్టుకున్న తీరుపైనా సవాల్‌చేయనున్నారు. ఇది ఒక అక్రమ చట్టవిరుద్ధమైన కిడ్నాప్‌కిందకు వస్తుందని, చట్టవ్యతిరేక దాడి కిందకు వస్తుందని, వెనిజులా సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని వాదించనున్నారు. అయితే అమెరికా న్యాయవాదులు ప్రాసిక్యూటర్లు దేశీయ చట్టాలపైనే ఆధారపడి ఆయనపై అభియోగాలు నమోదుచేసారు. దేశీయంగా ఈ బిల్లును 2020 మార్చిలో అమలుకు తెచ్చారు. ఆనాడు అమెరికా సుప్రీం కోర్టు సహజంగానే విదేశీ ఖైదీలను విచారించే వెసులుబాటు కలినపంచింది. వారిని ఏవిధంగా తీసుకువచ్చారన్నది పరిగణనలోకి తీసుకోనవడసరం లేదని అమెరికా గడ్డపైకి వచ్చినతర్వాత వారిని యుఎస్‌కోర్టుల్లో ప్రాసిక్యూట్ చేయవచ్చని వాదించారు.

# హరీష్‌రావుకు ఊరట!

>> రాష్ట్ర హైకోర్టు హరీష్ రావుకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం తెలిసిందే. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేయడంతో అక్కడ హరీష్ రావు తరపు న్యాయవాదులు, ప్రభుత్వం తరపు న్యాయవాదుల మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి. సిద్దిపేట్‌కు చెందిన చక్రధర్ గౌడ్ గతంలో బిఆర్ఎస్‌లో వుం డేవారు. ఆ సమయంలో అతను అసంతృప్తి నేతగా ముద్రపడ్డారు. ఈ సమయంలోనే అప్పట్లో మంత్రిగా వున్న హరీష్ రావు తన ఫోన్‌ను ట్యాపిం గ్ చేశారని ఆరోపించారు. అయితే చక్రధర్ గౌడ్ అరోపణలను అప్పట్లో పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. 2023 డిసెంబర్ నెలలో రాష్ట్రంలో కా ంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కోర్టు ఆదేశాల మేరకు చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందులో హరీష్ రావుతో పాటు అ ప్పటి టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావును కూడా ఆయన నిందితుడుగా చూపారు. ఈ కేసులో హరీష్ రావు, రాధాకిషన్ రావులకు పంజాగుట్ట పోలీసులు నోటీసులు జారీ చేసి విచారణకు రావాలని కోరగా వారు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఆరు నెలల పాటు వాదనలు సాగిన తరువాత తెలంగాణ హైకోర్టు హరీష్ రావు, రాధాకిషన్ రావులకు అనుకూలంగా చక్రధర్ గౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను క్వాష్ చేసింది. అ యితే తెలంగాణ హైకోర్టు తీర్పును రాష్ట్ర సర్కారు సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావు బాధితుడిని బెదిరించినట్లు ఆధారాలు వున్నాయని సర్కారు తరపున వాదించిన సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా సోమవారం నాడు సుప్రీం కోర్టుకు తెలిపారు. ఈ వాదనలను హరీష్ రావు తరపున వాదించిన న్యాయవాది తోసిపుచ్చారు. ఇరువర్గాల వాదనలు విన్న జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ప్రభుత్వ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ విషయంలో హరీష్ రావుకు అనుకూలంగా తెలంగాణ హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన తీర్పును సమర్థించడంతో పాటు ఇందులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది.

# జాతరకు మెగా ఏర్పాట్లు

>> ఆలయ అభివృద్ధి పనులను గవర్నర్ కు మంత్రులు వివరించారు. ఆలయ ఆచారం ప్రకారం గవర్నర్‌కు పూజారులు ఈవో వీరస్వామి ఆహ్వానం పలికారు. కాగా, జాతర విశిష్టతను గవర్నర్ కు మంత్రులు సీతక్క, కొండా సురేఖ వివరించారు. శాశ్వత ప్రాతిపదికన చేపడుతున్న పనుల వివరాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఆదివాసి జాతరగా పేరుగాంచిన మేడారంను సందర్శించాలని మంత్రులు చేసిన విజ్ఞప్తికి గవర్నర్ స్పందించారు. ఆదివాసి సాంస్కృతిక వైభవంతో నిండిన ఆ మహా జాతరను తప్పకుండా ఒక రోజు స్వయంగా దర్శిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు.

## వారం - వర్జ్యం

06-01-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
తదియ ఉ.8.03,
ఆశ్లేష మ.12.22
వర్జ్యం : రా.12.11-1.46
దు.ఉ.8.52-9.37, 2) రా.10.17-11.02
శుభసమయం:ఉ.9.45-10.15, సా.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:**జీవితం ఒకే గాడిలో సాగుతున్నట్లుగా భావిస్తారు. కొత్తదనాన్ని కోరుకుంటారు. వాహన సౌఖ్యం.

**వృషభం:**ఊహాలోకాలలో విహరిస్తారు. శారీరక, మానసిక శ్రమ అధికంగా ఉంటుంది. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు.

**మిథునం:** మంచితో మీరు చేసే ఒక పనిని మీ ప్రత్యర్థి వర్గం చెడుగా ప్రచారం చేస్తుంది. ప్రయాణాలు.

**కర్కాటకం** :సంతానాన్ని క్రమశిక్షణలో నడిపించుకోవడానికి గాను చేసే యత్నాలు కొంతవరకు పురోగిస్తాయి.

**సింహం:** మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. వ్యాపారాలలో మెలుకువ అవసరం.

**కన్య:** రాజకీయ పరిచయాలవలన లాభనష్టాలు సరిసమానంగా ఉంటాయి. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి.

**తుల :** ఏ సంగతీ తేల్చకుండా వాయిదా వేస్తూ వస్తున్న ఒక విషయంలో మీ నిర్ణయాలను స్పష్టంగా తెల్చిచెప్పలేని పరిస్థితి.

**వృశ్చికం:**ప్రయత్నాలు ఫలిస్తాయి. సన్నిహితుల నుండి సహాయసహకారాలు అందుకుంటారు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:**కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి.

**మకరం:** పారిశ్రామిక రంగాల వారికి అనుకూలంగా వుంటుంది. ప్రయాణాలు అలసటకు లోనుచేస్తాయి. ప్రయాణాలు.

**కుంభం:** చెవి, ముక్కు, గొంతు సంబంధిత ఇబ్బందులు చోటు చేసుకుంటాయి. వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** మీరు చేసే ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. బంధువుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వ్యక్తిగా సభనుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగొస్తా

### ఇక రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి

### నాది ఆత్మగౌరవ పంచాయితీ

### అవమానించి పార్టీలో నుంచి గెంటేశారంటూ మండలిలో కవిత భావోద్వేగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి5:** ‘బీఆర్ఎస్ పార్టీలో ఏ బాధ్యత అప్పజెప్పినా చిత్తశుద్ధితో నిర్వర్తించా.. పార్టీలో, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు నన్ను దారుణంగా అవమానించి బయటకుపంపించారు” అంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసనమండలిలో కంటతడి పెట్టారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చుట్టూ ఉన్న కొంతమంది నాయకులు తనను ఎన్నో సందర్భాలలో అవమానించారని చెప్పారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా ఇచ్చినా చైర్మన్ ఆమోదం తెలపకపోవడంతో మండలి వేదికగా తన ఆవేదన వెల్లడించేందుకు సభకు వచ్చానని ఆమె పేర్కొన్నారు. సోమవారం శాసనమండలి సమావేశానికి హాజరైన కవిత సభలో భావోద్వేగంతో కన్నీరు పెడుతూనే మాట్లాడుతూ... 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించామని చెప్పారు. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోతే రాష్ట్రంలో ఎలా ఉంటుందని ప్రశ్నించారు.పార్టీలో అవినీతిని ప్రశ్నిస్తే తనపై కక్షగట్టారని ఆరోపించారు. ఈడీ, సీబీఐలతో పోరాడేటప్పుడు పార్టీ తనకు అండగా నిలవలేదని, కేసీ ఆర్‌పై కక్షతో బీజేపీ తనను జైలులో పెట్టించినా పార్టీ ఆదు కోలేదని కవిత విమర్శించారు. అమరువీరుల స్తూపం మొదలు కలెక్టరేట్ల వరకు.. అన్నింటా అవినీతి జరిగింది. సిద్దిపేటలో నిర్మించిన కలెక్టరేట్ ఒక్క వర్షానికే కొట్టుకు పోయింది. అమరవీరులకు తగిన గుర్తింపు ఇవ్వాలని, ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీ వేదికల్లో డిమాండ్ చేసినా పట్టించుకోలేదు. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగాను. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నిమార్లు కోరినా ఉపయోగం లేకుండా పోయింది.ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కాళేశ్వరం విషయంలో కేసీఆర్ పై వచ్చిన ఆరోపణలను బీఆర్ఎస్ లో పెద్ద నాయకులమని చెప్పుకునే వాళ్లు ఎవరూ స్పందించలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేర్లు మీడియాకు వెల్లడించాను అని కవిత అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై కీలక ప్రకటన చేశారు. తన సంస్థ త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరిస్తుందని, అందరూ తనను ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ జాగృతిరాజకీయ పార్టీగా మారబోతోందని, రాబోయే ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని ప్రకటించారు.

కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. “వ్యక్తిగా సభ నుంచి వెళుతున్నా.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తా“ అని కవిత ప్రతిజ్ఞ చేశారు. ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని ఆమె ఆరోపించారు.రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ వేదిక రాబోతుందని, విద్యార్థులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల కోసం తాను పనిచేస్తానని హామీ ఇచ్చారు. “అవమాన భారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారుతుంది“ అని ఆమె పేర్కొన్నారు.

సభ నుంచి బయటకు వచ్చాక కవిత మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారుల కోసం, వారి ఆశయాల కోసం తెలంగాణ జాగృతి పార్టీ పనిచేస్తుందని అన్నారు. ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానిస్తున్నానని ఆమె అన్నారు. అవినీతి, రైతుల మీద కేసులు, బీఆర్ఎస్ సొంత నాయకులపై కేసులు, ఇంకా మరెన్నో బీఆర్ఎస్‌లో జరిగిన అక్రమాల గురించి తాను అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని అన్నారు.

ఈరోజు కుట్రదారులు, తెలంగాణ ద్రోహులు గెలిచారని మండిపడ్డారు. కానీ బీఆర్ఎస్ కోసం కడుపు కట్టుకుని పని చేసిన ఏ నాయకుడు ఉండలేకపోయారని అన్నారు. తాను ఊరుకునే వ్యక్తిని కాదని, కొట్లాడే ఆడబిడ్డనని అన్నారు. నాడు బీఆర్ఎస్ పార్టీ చేసిన అన్యాయాన్ని నేడు కాంగ్రెస్ కూడా కొనసాగిస్తోందని ఆరోపించారు. అందుకే తెలంగాణలో ఒక రాజకీయ వేదిక అవసరమని, తెలంగాణ జాగృతి ఆ ఖాళీని పూర్తి చేస్తుందని అన్నారు.

ఒక ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్న తనను ఆదరించమని ఆమె కోరారు. ఎప్పుడైనా కొత్త రాజకీయ శక్తి వస్తున్నప్పుడు ఇష్టారీతిన ఆరోపణలు చేయడం సహజమే అన్నారు. తాను బీఆర్ఎస్‌లో వాటాలు కుదరక బయటకు వచ్చానని కాంగ్రెస్ అంటోందని, తనతో కాంగ్రెస్ మాట్లాడుతోందని బీఆర్ఎస్ చెబుతోందని, కానీ ఆ వాదనల్లో వాస్తవం లేదని అన్నారు.

తనకు దైవభీతి ఎక్కువ అని, లక్ష్మీ నరసింహస్వామి మీద ప్రమాణం చేసి చెబుతున్నానని, తనది ఆస్తుల పంచాయితీ కాదని, రాజకీయ పంచాయితీ అని అన్నారు. తాను బీసీల గురించి, అవినీతి గురించి మాట్లాడానని గుర్తు చేశారు. మండలి ఛైర్మన్ తన రాజీనామాను ఆమోదిస్తే ప్రజల కోసం పూర్తిగా పోరాడతానని అన్నారు. శాసనమండలిలో తన ప్రసంగం ముగిస్తూ తన రాజీనామాను ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను కోరారు. మండలికి వస్తున్న సందర్భంగా ఆమె తన ఇద్దరు కుమారులను వెంట తీసుకుని వచ్చారు. అక్కడి నుంచి ఆమె అమర వీరుల స్తూపం వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు.

# మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి

>> ఈ ప్రాజెక్టు ప్లానింగ్ దశలోనే ఉంది కదా? ప్లానింగ్ డాక్యుమెంటేషన్ ప్రిపరేషన్‌కి ఏపీ నిధులే వృధా అవుతాయి కదా? ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ పిటీషన్ విచారణ అర్హతను పరిశీలిస్తున్నాం. సివిల్ సూట్ ఫైల్ చేస్తేనే సమగ్రంగా విచారణ జరపవచ్చు. ప్రాజెక్టు ఆపాలన్న మీ అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వ కమిటీ పరిశీలించేలా చూడమని ఆదేశాలు ఇస్తాం. అలాగే మధ్యవర్తిత్వం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేయండి అని అన్నారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ వరద జలాల పేరుతో మాకు కేటాయించిన నీటి వాటాను తరలించుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. ప్రాజెక్టుపై వెంటనే సుప్రీంకోర్టు స్టే ఇవ్వాలి. గోదావరిలో తెలంగాణకు 968 టిఎంసీల నీటి వాటా ఉంది. పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్టుతో మా వాటా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను ఏపీ పట్టించుకోవడం లేదు. సిడబ్ల్యుసి చైర్మన్ నేతృత్వంలో ఇటీవల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ప్రాజెక్టును ఆపే ఆధికారం లేదు. సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టును ఆపాలన్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టులో మేము నిబంధనలు ఉల్లంఘించలేదు. కేవలం మేము ప్లాన్ రెడీ చేసుకుంటున్నాం. సముద్ర జలాలు వృథా అవుతున్నాయి. వాటిని రాయలసీమకి అందించాలనుకుంటున్నాం. ఇది రాష్ట్ర ప్రాజెక్టు మాత్రమే జాతీయ ప్రాజెక్టు కాదు. మా రాష్ట్ర అవసరాలపైన ప్లానింగ్ చేసుకునే అధికారం ఉంది. మేము పిఎఫ్ఆర్,డిపిఆర్‌లను తయారు చేస్తున్నాము అని తెలిపారు.ఈ క్రమంలో సుప్రీంకోర్టు సూచించిన పరిష్కారాలపై తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుసుకునేందుకు సమయం ఇవ్వాలని అభిషేక్ సింఘ్వీ కోరారు. దీంతో కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి(12వ తేదీకి) సుప్రీంకోర్టు సీజే వాయిదా వేశారు.



సోమవారం తమిళనాడులోని తిరుచ్చిలో ‘నమ్మ ఊరు మోడీ పొంగల్’ వేడుకలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తమిళనాడు ఎన్నికల ఇన్‌ఛార్జ్ పీయూష్ గోయల్, కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ తదితరులు

# మావోల రహిత రాష్ట్రంగా తెలంగాణ

## కగార్ గడువులోపే లక్ష్య సాధన

### మిగిలిన 17 మంది లొంగుబాటుకు చర్యలు: డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** వచ్చే మార్చి నాటికి దేశంలో మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని కేంద్రం ప్రకటించడం తెలిసిందే. ఇం దులో భాగంగా నక్సలైట్ల ఏరివేతకు వీరి ప్రభావం వున్న ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఒడిషాలో ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తుండడం విదితమే. ఈ క్రమంలో ఆ మూడు రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలలలో భారీగా నక్సలైట్లు లొంగిపోతున్నారు. అయితే ఆపరేషన్ కగార్ గడువులోపే తెలంగా ణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చేందుకు పోలీసు శాఖ కసరత్తులు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మావోయిస్టు పార్టీలో తెలంగా ణ నుంచి వున్న 17 మందిని లొంగిపోయేలా చేసేందుకు చర్యలను వేగవంతం చేసింది. ఈ నెల మూడవ తేదీన మావోయిస్టు పార్టీకి చెందిన పీపు ల్స్ ఆర్మీ గెరిల్లా దళంలో కీలకంగా వున్న దేవాతో పాటు 20 మంది నక్సలైట్లు భారీ ఎత్తున ఆయుధాలతో సహా లొంగిపోవడం తెలిసిందే. ఈ స ందర్భంగా పోలీసులు ఏర్పాటు చేసిన బ్యానర్ చర్చనీయాంశంగా మారింది, పతనం అంచున మావోయిస్టు పిఎల్‌జిఎ అని బ్యానర్‌ను ప్రదర్శించా రు. నక్సలైట్ల లొంగుబాటు సందర్భంగా పోలీసు శాఖ ఇలాంటి బ్యానర్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. దీనిని హక్కుల సంఘాలు అభ్యంతరం చెబుతున్నా పోలీసులు సమర్థించుకున్నారు. ఈ సమావేశంలో మావోయిస్టు పార్టీలో తెలంగాణ నుంచి మిగిలిన వారు 17 మంది మాత్రమే వున్నా రని డిజి పి శివధర్ రెడ్డి తెలిపారు. వీరు కూడా వెంటనే లొంగిపోవాలని, జనజీవన స్రవంతిలో కలిసిన వారికి పున రావాసం కల్పిస్తామని, రివా ర్డులు వారికే అందజేస్తామని తెలిపారు. దీని తరువాత 17 మంది మావోయిస్టులను లొంగిపోయేలా చేసేందుకు పోలీసు శాఖ చర్యలను వేగవంతం చేసింది. ఓవైపు వారి స్వగ్రామాలలో ఆయా జిల్లాల పోలీసు అధికారులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ జనజీవన స్రవంతిలో కలవాలని పిలు పు ఇచ్చేలా చేస్తున్నారు, వయో వృద్ధులైన మావోయిస్టుల తల్లిదండ్రులకు పోలీసులు ఆర్థికంగా చేయూతనివ్వడంతో పాటు కొన్ని నెలలకు సరిపడ ని త్యావసర సరుకులు అందజేస్తున్నారు. ఈ తరహా కార్యక్రమం ఇటీవలే మొదలైంది. మరోవైపు నక్సలైట్ల లొంగుబాటుపై రాష్ట్ర పోలీసు శాఖ సోమవారం నాడు ఒక ప్రకటన విడుదల చేస్తూ మావోయిస్టు పార్టీలో మిగిలిన 17 మంది ప్రజల్లో కలవాలని కోరింది. వీరి పేరిట వున్న రెండు కోట్ల 25 లక్షల రూపాయల రివార్డు వీరికే ఇస్తామని పేర్కొంది. వారిని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపింది. కాగా మావోయిస్టు పార్టీలో తెలంగాణ నుంచి వ్ను వారిలో ఐదుగురు మహిళలు వున్నారని పోలీసు శాఖ తెలిపింది. 17 మందిలో నలుగురు కేంద్ర కమిటీలో ఐదుగురు రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు వుండగా మరొకరు అ జ్ఞాతంలో వున్నారని పోలీసు శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీలో రాష్ట్రం నుంచి వు న్న వారిలో పార్టీ అగ్రనేత ముప్పాల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి, రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా చెబుతున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రాం, పసునూరి నరహరి అలియాస్ సంతోష్ వుండగా రాష్ట్ర కమిటీ సభ్యులుగా ముప్పిడి సాంబయ్య అలియాస్ సు దర్శన్, వార్త శేఖర్ అలియాస్ మంగుత్, జోడే రత్నా భాయ్, నక్కా సుశీల, లోకేటి చంద్రశేఖర్, దామోదర్ వున్నారు. డివిజన్ కమిటీ సభ్యులుగా రాజేశ్వరి, రంగబోయిన భాగ్య, బాడిషా ఉంగా, సంగీత, భవాని, మైసయ్య, భగత్ సింగ్‌లు వున్నారు. మావోయిస్టులు వెంటనే లొంగిపోతే ఆపరే షన్ కగార్ గడువులోగానే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారి చరిత్ర సృష్టిస్తుందని పోలీసు శాఖ చెబుతోంది.

# జెడివాన్స్ ఇంటిపై దాడి

### కిటికీ అద్దాలు ధ్వంసం, అనుమానితుడు అరెస్టు

**ఓహియో,జనవరి 5:** అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ సిన్సినాటి నివాసంపై ఆగంతకులు దాడిచేసారు. రాత్రివేళలో జరిగిన ఈ దాడిలో అనేక కిటికీల అద్దాలు ధ్వంసం అయ్యాయి. వెంటనేసీక్రెట్ షర్వీస్, స్థానిక పోలీసులు రంగంలోకి ప్రవేశించారు. జెడివాన్స్ ఈస్ట్ వాల్‌నట్ హిల్స్ నివాసానికి వెంటనే చేరుకుని దర్యాప్తు షురూచేసారు. ఇందుకు సంబంధించి ఒక అనుమానితుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆతడిపై అభియోగాలునమోదయిందీ లేనిదీ వెల్లడికాలేదు. పోలీసులు మాట్లాడుతూ డబ్ల్యుసిపిఒ స్థానికవిభాగం ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుందనిమాత్రమే తెలిపింది. అయితే ఈ దాడిసమయంలో జెడివాన్స్ ఓహియో నివాసంలో లేరు. వారాంతంలో అక్కడ ఉన్న వాన్స్ దాడిసమయంలో మాత్రం లేరు. గత వారం వాన్స్ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌ను కూడా కలవలేదు. ఆయన వెనిజులా అధ్యక్షుడిపై చేసిన ఆపరేషన్ స్వయంగా వీక్షించిన సంగతి తెలిసిందే. మార్ ఎ లాగో విడిదినుంచి ట్రంప్‌తోపాటు వీక్షించేందుకు వాన్స్ వెళ్లలేదు. అయితే అందుకు బదులుగా ఉపాధ్యక్షుడు వాన్స్ ఈ ఆపరేషన్‌ను ఒక విడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించి ఆ తర్వాత సిన్సినాటికి వెళ్లిపోయారు. వాన్స్ కార్యాలయం కూడా ఆపరేషన్ వెనిజులాలో జెడివాన్స్ స్వయంగా పర్యవేక్షించినట్లు చెపుతున్నారు. అత్యధిక సెక్యూరిటీ సమస్యల కారణంగా ఈ వివరాలను వెల్లడించలేదు. అయితే అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు తరచూ వైట్‌హౌస్‌లో భేటీ కూడా ఇటీవల అంతగా లేదు. అధికారులు కూడాసెక్యూరిటీ సమస్యలుంటాయని చెపుతున్నారు. ఆ ప్రాంతంలో భారీ ఎత్తున గట్టి బందోబస్తుఉన్నప్పటికీ దాడి ఎలా జరిగిందన్నదే ఆరాతీస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రోడ్లన్నీ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేసారు. కొన్నిరోజులపాటు రోడ్లపై రాకపోకలు కూడా నిలిపివేసారు.

# ఎల్ఐజి ఫ్లాట్లకు భారీ డిమాండ్

>> హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతంలోని ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన లాటరీని నిర్మిత కేంద్ర వద్ద ముందుగా ప్రకటించినట్లుగానే జనవరి 6వ తేదీన (మంగళవారం) ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో నిర్వహించున్నారు. ఉదయం పూట రాంకీ ప్రాజక్టులోని 76 ఫ్లాట్లకు, మధ్యాహ్నం వసంత ప్రాజెక్టు లోని 35 ఫ్లాట్లకు ఈ లాటరీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఫ్లాట్ల కొనుగోలుకు భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో, దరఖాస్తు దారులు, లాటరీ ప్రక్రియ చూడటానికి రావద్దనీ, ఈ ప్రక్రయ మొత్తం ఆన్ లైన్ లోనూ, యూట్యూబ్ తదితర మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లుగా హౌసింగ్ బోర్డు పిఆర్ఒ ఒక ప్రకటనలో తెలిపారు. అనూహ్యంగా, ఒక్కో ఫ్లాట్ కు సగటున 25 మంది వరకు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో, ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి లాటరీ నిర్వహించే ప్రాంగణంలోని స్థలాభావం,భద్రతా కారణాల రీత్యా లాటరీ ప్రక్రియకు ప్రజలను అనుమతించబోవడం లేదని పిఆర్ వో వాసు తెలిపారు. అధికారుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా నిర్వహించే లాటరీ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయడం తోపాటు, ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డు కూడా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అంతే కాకుండా నిర్మిత కేంద్ర ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్ల ద్వారా లాటరీ నిర్వహణ ను చూడవచ్చని వివరించారు.దరఖాస్తు దారులు లాటరీ ప్రక్రియను యూట్యాబ్ లింక్ ద్వారాను ఇతరత్రా మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడవచ్చని , ఈలాటరీ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు దరఖాస్తు దారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ‘పూలే’ ఆదర్శనీయుడు

>> ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్,మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ లు, ఎంపీలు,ఇతర ముఖ్యనేతలు సాయంత్రం అసెంబ్లీ నుంచి ఆర్టీసి ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. సినిమా చూసిన అనంతరం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రాన్ని తెలుగులోకి అనువదించారని, ఈ సినిమాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు కలిసి చూశామన్నారు.పూలే జీవిత చరిత్రను సినిమాలో చూపించిన పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా భారతదేశ సమాజానికి అద్భుతమైన సందేశాన్ని అందించే చిత్రమన్నారు. మహిళల కోసం జ్యోతిబాపూలే సావిత్రి బాయి పులే చూపిన ప్రత్యేక శ్రద్ధ ఆదర్శనీయమైందన్నారు. మహిళలతో పాటు కుల వివక్షను ఇబ్బందులు తట్టుకొని సమ సమాజ స్థాపనకు వారు కృషి చేశారని సిఎం పేర్కొన్నారు.

# సర్కారు, ఉన్నత విద్యామండలి మధ్య సమన్వయం బలోపేతం కావాలి

### మండలి ఛైర్మన్‌తో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత యేడాది కాలంగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి రాష్ట్రంలో నిర్వహిస్తున్న పాత్రను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. యేడాదికాలం నుంచి ఉన్నత విద్యామండలి నిర్వహించిన కార్యక్రమాల గురించి తెలుసు కోవడం కోసం గవర్నర్ సోమవారం ఉన్నత విద్యామండలి ఛైర్మన్, సెక్రటరీతోపాటు వైస్‌ఛైర్మన్లతో లోక్‌భవన్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు ఛాన్స్‌లర్‌గా కొనసాగుతున్న గవర్నర్‌ను సోమవారం యూనివర్సిటీలతోపాటు రాష్ట్రంలో ఉన్నత విద్యకోసం తాము చేసిన కార్యక్రమాల నివేదికను సమర్పించారు. లోక్ భవన్‌లో వైస్ చాన్సలర్ల సమావేశం సందర్భంగా, రాష్ట్ర గవర్నర్‌కి ఉన్నత విద్యా మండలి చేపట్టిన కార్యక్రమాలు, సంస్కరణలు, సాధించిన విజయాలపై రూపొందించిన సమగ్ర నివేదికను సమర్పించారు. నివేదికలో అక్టోబర్ 2024 నుండి డిసెంబర్ 2025 వరకు గల కాలానికి సంబంధించి, ప్రభుత్వ విధాన లక్ష్యాలు, జాతీయ విద్యా విధానం(ఎన్ఈపి)- 2020కి అనుగుణంగా తాము చేపట్టిన విధాన జోక్యాలు, అకడమిక్ సంస్కరణలు, పరిపాలనా బలోపేతం, పాఠ్యప్రణాళిక పునర్వ్యవస్థీకరణ, ప్రవేశాల సంస్కరణలు, పరీక్షా వ్యవస్థ మెరుగుదల, పరిశోధన ప్రోత్సాహం, విద్యార్థి కేంద్రిత కార్యక్రమాలపై గవర్నర్‌కి వివరించారు.

ఈ సందర్భంగా, ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాల సమగ్ర సవరణ. సెట్స్‌ల పారదర్శక నిర్వహణ. డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా ప్రవేశాల వ్యవస్థ బలోపేతం, కొత్త అకడమిక్ కార్యక్రమాల విస్తరణ. కీలక విధాన అంశాలపై నిపుణుల కమిటీల ఏర్పాటు, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, అలాగే అకడమియా పరిశ్రమ సహకారాల పెంపు వంటి ముఖ్యమైన మైలురాళ్లను గవర్నర్‌కు వివరించారు. అధ్యాపకుల సేవా నిబంధనలు. కొత్త విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల ఏర్పాటు, ఆర్‌జియుకెటి క్యాంపస్‌ల విస్తరణ, సమావేశితత్వం, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థుల ఉపాధి సామర్థ్య పెంపు లక్ష్యంగా చేపట్టిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత విద్యా మండలి అందించిన సేవల గురించి గవర్నర్‌కి వివరించారు.

ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ఉన్నత విద్య రంగంలో వ్యవస్థాత్మక సంస్కరణలను ముందుకు నడిపించడంలో ఉన్నత విద్యా మండలి పోషిస్తున్న చురుకైన పాత్రను ప్రశంసిస్తూ, తెలంగాణ రైజింగ్ 2047" లక్ష్య సాధన కోసం విశ్వవిద్యాలయాలు, మండలి, రాష్ట్ర ప్రభుత్వం మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్నత విద్య స్థిరమైన అభివృద్ధికి దోహదపడేలా, పారదర్శక పరిపాలన, అకడమిక్ ఉత్తమత్వం, సమావేశితత్వం, ఆవిష్కరణలు, విద్యార్థి కేంద్రిత సంస్కరణలను అమలు చేయడంలో అందరి భాగస్వామ్యంతో పనిచేయడానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి కట్టుబడి ఉంటుందని బాలకిష్టారెడ్డి తెలిపారు.

# రాష్ట్రానికి ఆరుగురు ఐఎఫ్ఎస్ అధికారులు

### ప్రభుత్వ లేఖపై స్పందించిన కేంద్రం

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త :** తెలంగాణకు కు ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) కేటాయింపులో ప్రాధాన్యతన నిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం చేసిన క్యాడర్ కేటాయింపుల్లో ఈ నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ఐఎఫ్ఎస్‌లను రాష్ట్రానికి కేటాయింపులు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణకు చెందిన అట్ల తరుణ్‌తేజ్, చాడ నిఖిల్‌రెడ్డి, కర్నాటకకు చెందిన సుమంత్ ఎస్ జనార్ధి, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మయూర్ దేశ్‌ముఖ్, న్యూఢిల్లీకి చెందిన శుభం వత్స, గోవాకు చెందిన వీర్ రిషికేశ్ నాగనాథ్‌లు తెలంగాణకు కేటాయించిన కేడర్‌లో ఉన్నారు. 2024-25 ఐఎఫ్ఎస్ బ్యాచ్ అధికారుల రాష్ట్రాల వారీగా కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దేశ వ్యాప్తంగా మొత్తం 141 మంది ఐఎఫ్ఎస్‌లను వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయింపులు చేసింది. కాగా తెలంగాణలో గత కొన్నేళ్లుగా ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారుల కొరత ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో ఈ అంశంపై అటవీ సంరక్షణ ప్రధాన అధికారి, అటవీ దళాల అధిపతి డాక్టర్ సి సువర్ణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఒక లేఖరాసింది. ఈ నేపథ్యంలో ఈ లేఖకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అధిక మంది ఐఎఫ్ఎస్ అధికారులను కేటాయింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# 2023 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలి

### ముఖ్యమంత్రికి టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2023 డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పిఆర్‌టియు టిఎస్ నేతలతో కలిసి సోమవారం అసెంబ్లీ హాల్‌లో విజ్ఞప్తి చేశారు. పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్లం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 2026 పిఆర్‌టియు టిఎస్ డైరీని రాష్ట్ర శాసనసభలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెం. 57 ద్వారా, అలాగే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అనుసరించి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని కోరారు. రెండు దశాబ్దాల నుండి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అమలుచేయాలని, తద్వారా పూర్తిస్థాయి పర్యవేక్షణ అధికారులను నియమించడం వలన విద్యావ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. వేసవి సెలవుల్లో పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని సీఎంని కోరారు. వాటితోపాటు పెండింగ్ డి.ఎ.లను విడుదల చేస్తూ పి.ఆర్.సి. రిపోర్టు తెప్పించి నూతన పి.ఆర్.సి. అమలుచేయాలని కోరారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ అంశాలన్నింటినీ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారని సంఘం నేతలు తెలిపారు. .2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు బి. మోహన్‌రెడ్డి, సంఘం అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పి. వెంకట్ రెడ్డి, మాసపత్రిక ప్రధాన సంపాదకులు జగన్మోహన్ గుప్త, ఆడిట్ కమిటీ ఛైర్మన్ యస్. శ్రీనివాసరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

# చికెన్ ధరలు ట్రిపుల్ సెంచరీ

### రూ.300 దాటిన కిలో

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త :** కొత్త సంవత్సరం ఆరంభంలో చికెన్, గుడ్ల ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ప్రస్తుతం కిలో చిక్ ట్రిబుల్ సెంచరీ దాటింది. సంక్రాంతి డిమాండ్, సరఫరా సమస్యల కారణంగా ధరలు భారీగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని ఈ పెంపుతో వినియోగదారులు తీవ్ర భారాన్ని ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా రూ.200 నుంచి రూ.250 మధ్య ఉన్న కేజీ చికెన్ ధర ఒక్కసారిగా పీక్స్‌కు చేరింది. ప్రస్తుం మార్కెట్‌లో కేజీ చికెట్ ధర ట్రిపుల్ సెంచరీకి చేరి రూ.300 దాటి పలుకుతోంది. హైదరాబాద్‌తో సహా, రాష్ట్రంలో కేజీ స్కిన్ లెస్ చికెన్ ధర కిలోకు రూ.310 వరకు, గుడ్డు రూ.8కు చేరింది. ఇక ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కేజీ బ్రాయిలర్ కోడి మాంసం ధర రూ.300గా ఉండగా, లైవ్ కోడి మాంసం కేజీ ధర రూ.170గా పలుకుతోంది. ఫారం కోడి మాంసం విషయానికి వస్తే కేజీ ధర రూ.180గా ఉండగా బండ కోడి మాంసం ధర రూ.280గా వరకు అమ్ముతున్నారు. అయితే గతంలో బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో కోళ్ల ధరలు భారీగా తగ్గగా.. ప్రభుత్వ సహకారంతో కోళ్లఫారాల యాజమాన్యాలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి కొనుగోళ్లను పెంచారు. దీంతో కోడి ధర రూ.285 చేరింది. ఆ తర్వాత ఇది మళ్లీ తగ్గి డిసెంబర్‌లో కేజీ చికెన్ ధర రూ.240 నుండి 250 మధ్య కొనసాగింది. కానీ డిసెంబర్ చివరి వారం నుంచి ఈ ఏడాది మొదటి వారం మధ్య చికెన్ ధర ఒక్కసారిగా పెరిగింది.

# తెలంగాణ సాంస్కృతిక, సామాజిక పురోగతికి అందెశ్రీ అవిరళ కృషి

### వారి తనయుడు దత్తసాయికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం

### శాసనమండలిలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 5:** జయ జయహే తెలంగాణ గీతం ద్వారా రాష్ట్ర ప్రజలను ఏకం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన అందెశ్రీ సేవలను ప్రభుత్వం గుర్తించింది, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయి ంచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. అందెశ్రీగా పిలవబడే అందే ఎల్లయ్య తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా రేపర్తి గ్రామంలో అనాధ అయిన అందెశ్రీ పశువుల కాపరిగా ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని గీత రచయితగా ఎదిగారు అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఎటువంటి సాధికారత విద్య లేకున్నా తెలంగాణ గ్రామీణ మరియు అనగారిన వర్గాలను ప్రతిబింబించేలా ఆయన 3 వేల కవితలు రచించారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆశలు, పోరాటాలు వాటి స్ఫూర్తిని తెలియజేస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రచించిన జయ జయ హే తెలంగాణ గీతం రాష్ట్ర ప్రజలను ఏకం చేయడంలో ప్రముఖ పాత్ర వహించిందని తెలిపారు. అందెశ్రీ విప్లవాత్మక కవితలు భావోద్వేగంతో కూడిన గేయాలు కార్మికులు, రైతులు, అణగారిన వర్గాలను ప్రభావితం చేయడమే కాకుండా వారి పోరాటాలను వ్యక్తీకరించాయి, తెలంగాణ సంస్కృతికి స్వరంగా నిలిచాయి అన్నారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా చేయాలని 2 జూన్ 24 న 783 జీవో ద్వారా ఆమోదించిందని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి వారు అందించిన అమూల్యమైన సేవలను దృష్టిలో పెట్టుకొని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వారి అకాల మరణంతో నష్టపోయిన వారి కుటుంబం సామాజికంగా, ఆర్థికంగా ఎదుర్కొనే సవాళ్లపై సకాలంలో మానవీయ దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజిక న్యాయ సూత్రాలు, పరిపాలన సంబంధమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉందని వివరించారు. ఈ చర్య తెలంగాణ ఐక్యత,



పురోగతికి తన జీవితాన్ని అంకితం చేసి సాంస్కృతికి ప్రతీకగా నిలిచిన అందెశ్రీని గుర్తించి గౌరవించి ప్రభుత్వం కుటుంబానికి హామీ ఇస్తుందని తెలిపారు. తెలంగాణ సమాజం అంటేనే కవులు కళాకారులు, వారి దగ్గర ఉన్న కలలు అన్నీ పీడిత ప్రజల విముక్తి కోసం సమ సమాజ నిర్మాణం కోసం, వారి ఆశయాలు ఆశలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో చాలామంది కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గౌరవించుకుంటూ వచ్చిందని తెలిపారు. అందెశ్రీ గేయం జయ జయహే తెలంగాణ ఈ సమాజాన్ని ఏ విధంగా మేలుకొలిపిందో అందరికీ తెలుసు తెలంగాణ ఉద్యమ సమయంలో జయ జయ గీతాన్ని పెద్ద ఎత్తున వాడుకొని రాష్ట్రం వచ్చినాక ఆనాటి పాలకులు ఆ గేయాన్ని, మనిషిని వదిలేసిన గత ప్రభుత్వాన్ని చూసాం అన్నారు. మా ప్రభుత్వం ఏర్పడగానే ఆ గేయాన్ని అధికారిక గేయంగా ప్రకటించడమే కాకుండా వారిని ఏ రకంగా గౌరవించుకున్నామో రాష్ట్ర ప్రజలందరూ చూశారని తెలిపారు. దురదృష్టవశాత్తు అందెశ్రీ అకాల మరణం చెంది మన మధ్య లేకపోవడాన్ని చింతిస్తూనే వారి గౌరవాన్ని పెంపొందిస్తూ మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు అని వారు రాసి, పాడిన పాట స్ఫూర్తితో ఈ ప్రభుత్వం పనిచేస్తుంది అన్నారు. మానవత్వంతో ఈ ప్రభుత్వం అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం బాధ్యతగా భావించి వారి కుమారుడు దత్త సాయికి ఉన్నత విద్యా శాఖలో డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించినట్టు తెలిపారు తెలిపారు. 25 నవంబర్ 2025న ఆర్డినెన్స్ 7 ద్వారా ఉద్యోగ నియామకం చేశామని, ఆరోజు శాసనమండలి సమావేశంలో లేనందున ఆ ఆర్డినెన్స్‌ను ఈరోజు అందరి చేత ఏకగ్రీవంగా ఆమోదించుకోవడం హర్షనీయం అన్నారు.

# 10 సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన

### మూడు దశల్లో 94 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

### శాసన మండలిలో మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 5:** స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సమర్ధవంతంగా సులువుగా పారదర్శకంగా అవినీతిరహితంగా మెరుగైన సేవలు అందించడానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శాసన మండలిలో సోమవారం నాడు ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సుదీర్ఘంగా జవాబు ఇచ్చారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించే పరిస్థితికి తెరదించుతున్నాం. సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వ్యవస్థ వలన అవినీతికి అడ్డుకట్టపడుతుంది అని చెప్పారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు 94 అద్దె భవనాల్లో 50 ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. మూడు దశల్లో వీటికి శాశ్వత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మొదటి దశలో ఔటర్ రింగ్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగా రెడ్డి నాలుగు జిల్లాల్లోని 39సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి సమీకృత సబ్ రిజిస్ట్రార్ భవనాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ 39 సబ్ రిజిస్టర్ కార్యాలయాల నుంచి 69 శాతం ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్), (ఆర్వో రంగారెడ్డి, గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్) క్లస్టర్‌గా విభజించారని ఈ భవనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, ఈ నెల చివరి నాటికి మిగిలిన 10 సమీకృత భవనాలకు కూడా శంకుస్థాపన చేస్తామన్నారు.

# మార్చి 31 డెడ్‌లైన్‌కు మావోయిస్టు పార్టీ విరుగుడు వ్యూహం

### మైదాన ప్రాంతాలకు వెళ్లి తెలిసిన వారి ఇళ్లలో ఆశ్రయం పొందాలని క్యాడర్‌కు పిలుపు

### నక్సల్స్ ఖిల్లా అబూజ్‌మడ్ నుంచి భారీగా మావోయిస్టులు సురక్షిత ప్రాంతాలకు వలస?

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** వచ్చే మార్చి నెలాఖరుకు దేశంలో మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని ప్రకటించిన కేంద్రం అందుకు అ నుగుణంగా ఛత్తీస్‌ఘడ్ సహా పలు రాష్ట్రాలలో ఆపరేషన్ కగార్ నిర్వహిస్తుండడం తెలిసిందే. వేల సంఖ్యలో భద్రతా బలగాలు నక్సలైట్ల కోసం కూంబింగ్ నిర్వహిస్తుండడం విదితమే. ఈ క్రమంలోనే ఛత్తీస్‌ఘడ్ సహా పలుచోట్ల ఓవైపు ఎన్‌కౌంటర్లు, మరోవైపు భారీగా లొంగుబాట్లు జరుగుతున్నాయి. అయితే మావోయిస్టులు మాత్రం కేంద్రంతో అమీతుమీకి సిద్ధమవుతున్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఇప్పటి వరకు నక్సలైట్లు తమ ఆయుధాలతో లొంగిపోతారని భావించిన కేంద్రానికి తాజాగా వెలుగు చూస్తున్న సమాచారం కొంత ఇబ్బందికరంగా వుందని తెలిసింది. ఆపరేషన్ కగార్ కారణంగా చెల్లా చెదురైన పార్టీ క్యాడర్‌ను మళ్లీ ఎలాగైనా ఒకచోటికి చేర్చేందుకు మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వం నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి సంబంధించి కేంద్రానికి సమాచారం అందినట్లు తెలిసింది. మార్చి 31వ తేదీ సమీపిస్తుండడంతో నక్సలైట్లను ఏరివేసేందుకు భద్రతా బలగాలు ముందుకు కదలుతుండడంతో మావోయిస్టులు దీనికి విరుగుడుగా తమ క్యాడర్‌లో చాలా మందిని మైదాన ప్రాంతాలకు వెళ్లి అక్కడ తమ కు తెలిసిన వారి ఇళ్లలో, నమ్మకస్తులైన వారి ఇళ్లలో కొంతకాలం వుండాలని, వివరాలు ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడాలని పురమాయించినట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో అడవులను వదిలి బయటకు కావడం కష్టమే అయినా ఈ విషయంలో ఎలాగైనా రావాల్సిందేనని, పార్టీ బతకాలంటే ఈ సమయంలో కచ్చితంగా ధైర్యం చేయాలని అగ్ర నాయకత్వం పేర్కొనట్లు తెలిసింది. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వం ఆదేశాల దరిమిలా ఛత్తీస్‌ఘడ్‌లోని నక్సల్స్ కోట అబూజ్‌మడ్ నుంచి వందల సంఖ్యలో మావోయిస్టులు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది. ఇందులో కొందరు ఆయుధాలతో వెళ్లగా మరి కొందరు తమ ఆయుధాలను అబూజ్‌మడ్‌లోనే సురక్షిత స్థావరాలలో దాచివుంచారని సమాచారం. అ బూజ్‌మడ్‌ను వీడిన నక్సలైట్లు మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలకు వలస వెళ్లినట్లుగా నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలలో నక్సల్స్ సానుభూతిపరుల ఇళ్లలో సోదాలు చేయాలని ఆదేశాలు అందాయి. ఇటీవల తెలంగాణకు వచ్చి దొరికిపోయిన పలువురు నక్సలైట్లు కూడా ఇదే కోవకు చెందిన వారుగా ప్రచారం జరుగుతోంది. అయితే మార్చి 31వ తేదీకి మూడు నెలలు వుండడంతో కేంద్రం వైఖరి ఎలా వుంటుందనేది చూడాల్సి వుంది.

# 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు

### యేడాదిన్నరలో 12 పాఠశాలలె పూర్తి

### ఈ యేడాది రూ. 1,250 కోట్లు కేటాయింపు

### శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షిల్స్ స్కూల్స్‌ను ఏడాదిన్నరలో ప్రారంభించనున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో ప్రకటించారు. రాష్ట్రంలో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది వాటి కోసం రూ. 1250 కోట్లను బడ్జెట్‌లో కేటాయించినట్టు తెలిపారు. సోమవారం శాసనసభ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల్లో .. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి సంబంధించిన ప్రశ్నలను సభ్యులు పట్లోళ్ల సంజీవ రెడ్డి, బాలు నాయక్, మేడిపల్లి సత్యం, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కె శంకరయ్యతోపాటు ఇతర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి దామోదర రాజనర్సింహా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 105 రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. వాటిలో 79 పాఠశాలలకు అడ్మినిస్ట్రేటివ్ అనుమతి లభించిందన్నారు. అందులో 76 స్కూల్స్ నిర్మాణాలకు టెండర్లను పిలిచినట్టు తెలిపారు. టెండర్లు పిలిచినవాటిలో ఇప్పటికే 12 స్కూల్స్ పనులను ప్రారంభించామన్నారు. 6 స్కూల్స్‌కి స్థలాలను వెదుకుతున్నట్టు చెప్పారు. ఇప్పటికే పనులు ప్రారంభమైన పాఠశాలలను ఏడాదిన్నరలో పూర్తి చేయనున్నట్టు మంత్రి దామోదర సభకు తెలిపారు. 2027 జూన్ నాటికి 70 స్కూల్స్, 2028 జూన్ నాటికి 9 స్కూల్స్ నిర్మాణం పూర్తి చేయనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1250 కోట్లను కేటాయించినట్టు తెలిపారు. అందులో రాష్ట్ర బడ్జెట్ రూ. 500 కోట్లు కాగా నాబార్డు రుణం రూ. 300 కోట్లు, డిఎంఎఫ్‌టి రూ. 450 కోట్లని తెలిపారు. మొత్తంగా ప్రాజెక్టు పూర్తి కావడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 12,800 కోట్లను ఖర్చు చేయనుండగా నాబార్డు నుంచి రూ. 3300 కోట్లను, ఏడిబి నుంచి రూ. 4900 కోట్లను ఖర్చు చేయనున్నట్టు మంత్రి సభకు తెలిపారు.

# చైల్డ్ పోర్నోగ్రఫీ కేసులపై టిజిసిఎస్‌బి ఉక్కుపాదం

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చైల్డ్ పోర్నోగ్రఫీ కేసులు పెరగడంతో ఈ తరహా నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) నడుం బిగించింది. 2024తో పోలిస్తే 2025లో ఈ తరహా కేసుల సంఖ్య పెరగడంతో దీనిపై టిజిసిఎస్‌బి దిద్దుబాటు చర్యలు తీసుకోసాగింది. ఈ క్రమంలోనే నిందితులపై వేగంగా కేసులు నమోదు చేయడం, వెంటనే అరెస్టు చేయడం పై టిజిసిఎస్‌బి దృష్టి సారించింది. చిన్నారుల భద్రతకు ముప్పుగా మారుతున్న చైల్డ్ ఫోర్నోగ్రఫీ కేసులపై ఉక్కుపాదం మోపాలని సర్కారు ఆదేశించి న దరిమిలా దీనిపై టిజిసిఎస్‌బి రంగంలో దిగింది. తరహా కేసుల్లో నిందితులు ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని, కోర్టుల్లో కఠిన శిక్షలు పడేలా చూస్తామని టిజిసిఎస్‌బి పేర్కొంది. ఈ మేరకు టిజిసిఎస్‌బి అధికారులు సోమవారం నాడు మీడియాకు వివరాలు వెల్లడించారు. చైల్డ్ పోర్నో గ్రఫీ వీడియోలు చూసినా వారితో పాటు వీటిని షేర్ చేసిన వారిపైనా చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని టిజిసిఎస్‌బి తెలిపింది. గత ఏడాది చైల్డ్ ఫోర్నోగ్రఫీ కేసులు 869 నమోదుద కాగా ఈ కేసులకు సంబంధించి 423 మంది నిందితులను అరెస్టు చేసినట్లు టిజిసిఎస్‌బి తెలిపింది. 2024లో 80 కేసులు నమోదు కాగా 37 మందిని అరెస్టు చేసినట్లు ఆ విభాగం తెలిపింది. చైల్డ్ ఫోర్నోగ్రఫీ కేసులు పెరగడానికి సోషల్ మీడియా ఒక కారణంగా తేలింది. దీనిపై టిజిసిఎస్‌బి నిఘా వుంచగా ఇళ్లలో బాలలు, టీనేజి యువత వీటిపట్ల ఆకర్షితులవకుండా చూడాల్సిన బాధ్యత తల్లి దండ్రులపై వుందని టిజిసిఎస్‌బి అధికారులు తెలిపారు. ఎవరి సెల్‌ఫోన్‌లో అయినా చైల్డ్‌పోర్నోగ్రఫీకి సంబంధించిన విడియోలువస్తే దీనిపై వెంట నే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, వీటిని ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయవద్దని టిజిసిఎస్‌బి అధికారులు కోరారు. ఈ తరహా వఁడి యో లను వ్యాప్తి చేస్తున్న వారిని గుర్తించేందుకు టిజిసిఎస్‌బి అధునాతన సాంకేతకతను వాడుతోంది.

# పిఎం కిసాన్ పథకంలో 35,44,213 మంది అనర్హుల తొలగింపు

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త :** రైతుల కోసం కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంలో అనర్హుల ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా కేంద్రం దేశవ్యాప్తంగా 35,44,213 మంది అనర్హులను తొల గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే వీటని క్షేత్రస్థాయిలో ఫిజికల్ వెరిఫికేషన్ తర్వాత వాస్తవ అర్హులను తిరిగి పథకంలో చేర్చుతామని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తాజాగా వివ రణ ఇచ్చింది. పీఎం కిసాన్ లబ్దిదారుల నుంచి తొలగించిన పేర్లకు సంబంధించి ఇది తాత్కాలిక తొలగింపే కానీ, శాశ్వత తొలగింపు కాదని తేల్చి చెప్పింది. ఇలా తొలగించిన పేర్లకు సంబం ధించి.. ఫిజికల్ వెరిఫికేషన్ జరుగుతుందనీ.. అది పూర్తైన తర్వాత అర్హులైన వారి పేర్లను తిరిగి జాబితాలో చేర్చుతామనీ కేంద్రం చెప్పింది.

# రైతుల సమస్యలను పరిష్కరించాలి

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో మా ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి రైతు సమస్యల పరిష్కారానికి ముందుంటామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోయా కొనుగోళ్లలో అధికార యంత్రం నిర్లక్ష్యంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతాంగం పూర్తిగా మోసపోతా ఉంటే జిల్లా కలెక్టర్ వేసిన కమిటీ సైతం రైతుల పక్షాన మోసపూరితంగా తయారైందని మాజీ మంత్రి జోగు రామన్న ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ ముందర బైఠాయించారు రైతు వ్యతిరేక విధానాలపై విధానాలతో హోరెత్తించారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు బిఆర్ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమం చేపడుతూ ఉంటుందని హెచ్చరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ. సోయా కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ డ్రామాలు చేస్తున్నాయన్నారు. సోయా కొనుగోలుపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని అఖిలపక్షంతో కలిసి కలవాల్సి కన్నా నైతిక బాధ్యత ఉందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 75 కొనుగోలు చేసి కేంద్రంతో 20 కొనుగోలు చేయించామన్నారు. కేంద్రం తగ్గముఖం పట్టిన రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు



నిరసన చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బిఆర్ఎస్ నాయకులు

చేసిందని గుర్తు చేశారు. రైతాంగని ప్రోత్సహిస్తూ రైతుబంధు సకాలంలో వేసిన ఘనత కేసీఆర్ అని కొనియాడారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానంతో రైతులు పూర్తిగా మోసపోతున్నారని. వ్యవసాయాన్ని ఖూనీ చేస్తూ కార్పొరేట్‌కు మద్దతుగా ప్రభుత్వాలు పనిచేయడం సిగ్గుచేటు అన్నారు.

కేంద్రం కేవలం ఒక్క 133 కోట్ల రూపాయలను ఖర్చుతో రైతుల ధాన్యాన్ని పూర్తిగా కొనవచ్చు, కానీ బడా కార్పొరేటర్ల బాకీలు 12లక్షల కోట్లను ఏకకాలంలో రుణమాఫీ కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. రైతులకు ఇవ్వడానికి మాత్రం కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు రాకపోవడంపై మండిపడ్డారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఇప్పటివరకు 29 మంది రైతులు చనిపోగా, కేంద్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతాంగంపై కేంద్ర రాష్ట్రాలు ప్రభుత్వాలు పెడుతున్న నిబంధనలతో రైతు కుటుంబాల్లో తీవ్ర సంక్షోభం నెలకొంటుంది అన్నారు. కిసాన్ కాపాస్ యఫ్, తడిసిన ధాన్యం, రంగుమర్ల ధాన్యం, యూరియా కొరత, రైతు రుణమాఫీ, లేక అనేక ఇబ్బందులు రైతులకు ఎదురవుతున్నాయి అన్నారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరాకుంటే బిఆర్ఎస్ పార్టీ కార్యాచరణ కొనసాగిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, ఇజ్జగిరి నారాయణ, యాసం నర్సింగరావు, మెట్టు ప్రహ్లాద్, యూనిస్ అక్బాని, మారశెట్టి గోవర్ధన్, అడప తిరుపతి, బట్టు సతీష్, గణేష్ యాదవ్, దమ్మపాల్ కొండ, వాగ్మారె, ప్రశాంత్ పాల్గొన్నారు.




# బంగ్లాలో స్థానిక దినపత్రిక ఎడిటర్ కాల్చివేత

### హిందూ వితంతువుపై సామూహిక అత్యాచారం

### బంగ్లాలో మైనార్టీలో ఆగని అకృత్యాలు

**ఢాకా, జనవరి 5:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలపై అకృత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఒక హిందూ ఫ్యాక్టరీ ఓనర్, స్థానిక దినపత్రిక సంపాదకుడిని గుర్తుతెలీనివ్యక్తులు బైక్‌పై వచ్చి కాల్చి చంపి పరారయ్యారు. జాషోర్ జిల్లాలోని మణిరామ్‌పూర్ సబ్ జిల్లా కోపాలియా బజార్‌లో బాధితుడు రాణాప్రతాప్(45)ను కాల్చి దుండగులు పరారయ్యారు. ఒక మోటారుసైకిల్‌పై వచ్చిన దుండగులు ప్రతాప్‌ను తన ఐస్‌ఫ్యాక్టరీనుంచి బయటకు రావాలని హుకుం వేసి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆతని తలపై పాయింట్ బ్లాంక్‌రేంజిలో కాల్పులుజరిపారు. కాల్పులకు ముందు రాణాతో దుండగులు వాదనకు దిగినట్లు తేలింది. బిడిఖబర్ అనే స్థానిక దినపత్రికను కూడా నడుపుతున్నారు. దినపత్రిక ఎడిటర్ అబ్దుల్ కాషిమ్ మాట్లాడుతూ ప్రతాప్ అంతకుముందు ఇలాంటి ఎన్నో కేసులు ఎదుర్కొన్నారని, అన్నింటినుంచి విడుదలయ్యారన్నారు. ఈ హత్యకు కారణం ఏమయి ఉంటుందన్నది తెలియడంలతేదన్నారు. అదేవిధంగా ఒక హిందూ వితంతువును సామూహిక అత్యాచారంచేసి ఒక చెట్టుకు కట్టి ఆమె జుత్తును కూడా దుండగులు కత్తింరిచారని పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. సెంట్రల్ బంగ్లాదేశ్‌లో ఈసంఘటన జరిగింది. 40 ఏళ్ల ఈమహిళ ఇద్దరు వ్యక్తులు తనపై కాలిగంజ్‌లో దాడిచేసారని ఆమె పోలీసులకు తెలిపింది. రెండున్నరేళ్లక్రితం సాహిన్ ఆతడి సోదరుడినుంచి తాను ఒక చిన్న ఇంటిస్థలం, ఒక ఇంటిని కొనుగోలుచేసానని అప్పటినుంచి షాహిన్ తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలిపింది. సాహిన్‌తోపాటు మరో వ్యక్తి హసన్ అనే వ్యక్తి ఇద్దరూ కలిసి తనపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డారని, అంతేకాకుండా తననుంచి 50 వేల టాకాలు ఇవ్వాలని డిమాండ్‌చేసినట్లు వాపోయింది. ఈ దాడులు హత్యలతో బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలు ఐదుగురు బలయినట్లు తెలుస్తోంది. మరిన్ని ఘాతుకాలకు పాల్పడతామని దేశంనుంచి వెళ్లిపోవాలన్న బెదిరింపులు ఎక్కువవుతున్నట్లు హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. యూనస్ కేర్‌టేకర్‌ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించే లోపు మరింతగా దాడులుజరిగే ప్రమాదం ఉందని అన్నారు.

వార్త


మన సమస్యలకు పరిష్కారాలు మన దగ్గరే ఉంటాయి. కానీ మనం ఎవరో పరిష్కరించుకోవాలని అనుకుంటామంతే.

-షేక్స్పియర్

# పర్యావరణంతో పరాచకాలొద్దు!

కళ్ళెదుట మానవాళి తట్టుకోలేనంతగా పర్యావరణ విధ్వంసం జరుగుతుంటే అగ్రదేశాలు కళ్ళప్పగించి చూస్తున్నాయే తప్ప తమవంతు ప్రయత్నమేదీ చేయటానికి ముందుకు రావడం లేదు. అదే ప్రపంచ దేశాలకు శాపంగా మారింది. కర్బన ఉద్గారాల తగ్గింపు కోసం పదేళ్ల క్రితం ప్యారిస్ వేదికగా కుదిరిన చరిత్రాత్మక ఒప్పందాన్ని దాదాపు అన్ని దేశాలూ పోటీలు పడి మరీ ఉల్లంఘిస్తున్న విషయం విదితమే! ఈ తరుణంలో బ్రెజిల్ లోని బెలేమ్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్30) సదస్సు, అంతకు ముందు శ్రీలంకలోని బాకూలో కూడా పర్యావరణ సదస్సులు జరిగాయి. నానాటికీ తీసికట్టు నాగంభట్లు అన్న చందాన ప్రతి సదస్సులోనూ చర్విత చర్వణంగా పాత లక్ష్యాలకు కొత్త అర్థాలు,భాష్యాలు వెదుక్కోవడమే సరిపోతోంది. ఏటా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఈ సదస్సులు జరగడం, చర్చోపచర్చలతో ముగియడం రివాజు. అందువల్లే నిరుడు అజర్ బైజాన్లోని బాకూలో కాప్29 కాస్తంత పర్వాలేదనిపిం చింది. ఆ తర్వాత ఎన్నో దేశాల ముఖ్యప్రతినిధులు హాజరౌతూనే ఉన్నా చెప్పుకోదగిన ఫలితాలు లేవనే చెప్పాలి. దక్షిణ అమెరికా ప్రాంత దేశాన్ని ఎంపిక చేసుకోవటంలో ఓ ప్రత్యేకత కనపడుతోం ది. అమెజాన్ అడవుల సమీపంలో ఉన్న బెలేమ్ పోర్ట్ ప్రదేశం వాతావరణ మార్పులపై ఇక్కడ చర్చించడమే మంచిదనే అభిప్రాయం ఏర్పడింది. సుస్థిరాభివృద్ధికి మద్ద తుగా ఉండాల్సిన అవశ్యకత కొన్ని దేశాలకు తెలియవస్తుందన్నది ఈ నిర్ణయ నేపథ్యం. ప్రపంచం ఇప్పుడు ప్రమాదకర వాతావరణంలోకి ప్రవేశించింది. పారిశ్రామికీ కరణకు ముందు, తర్వాత అని లెక్కిస్తే ఆనాటి ఉష్ణోగ్ర తలు వేరు ఇప్పటి ఉష్ణోగ్రతలు వేరు. ఎ2 డిగ్రీల సెల్సియస్‌లోపే పెరుగుదల అనుకూల వాతావరణంగా ఉండాలి లేదా కనీసం అది 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమిత మయ్యేలా చూడాలని ప్యారిస్ ఒడంబడికలో ప్రధాన నిర్ణయం. కానీ 2024నాటికి 1.5డిగ్రీల పరిమితి దాటిపో యామన్నది అక్షరాల నిజం. ముంచుకోస్తున్న పర్యావరణ విపత్తులను ఏ విధంగానూ ఆపలేమని తేటతెల్లమైంది. గత బైడెన్ ప్యారిస్ ఒడంబడిక నుండి బయటికి రాగా ఇప్పుడు ట్రంప్ దానిని ధ్రువీకరించారు. అంతేతప్ప అమెరికా నుంచి అనుకున్నంత నిధులు కూడా రాలేదు. దాంతో నిర్భాగ్య దేశాలకి ఒరిగిందేమీ లేదు. గతానికి భిన్నంగా కాకుండా కొనసాగింపుగానేఅమెరికా వ్యవహారం నడుస్తోంది.అభివృద్ధి చెందిన దేశాలు గ్రీన్ క్లైమేట్ ఫండ్ కు ఇస్తామన్న ఆర్థిక సహాయం పెంచే విషయంలో ఆయా అగ్రదేశాలు కిమ్మన్నాస్తిగా ఉండిపోయాయి.అగ్రరాజ్యాలు ఇలా బాధ్యతల నుంచి తప్పుకోవడం, పర్యావరణ విధ్వంసంతో తమకేమిటన్నట్లు పలాయన వాదం చిత్తగించడం సబబుగా లేదు. రవాణా నౌకలకాలు ష్యాన్ని అరికట్టేందుకు 100 దేశాల మధ్య ఒడంబడికపై సంతకాలు చేయాల్సిన సందర్భంలో అమెరికా సైంధవపాత్ర పోషించిందని వేరేచెప్పనక్కర్లేదు. కాప్31 సదస్సులో వివిధ దేశాల అభిమతాలు ఎలా ఉంటాయో చెప్పలేం. గమ్యాన్ని చేరుకోవడం తప్పదు. కానీ బడుగు దేశాలు ఎన్నిఅగచాట్లుపడాలో ఊహించడం కష్టం.నిధులు, ప్రత్యామ్నాయ వనరులు లేకుండా గమ్యం ఎలాగో తదు పరి సదస్సునిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అమెరికాలో శిలాజ ఇంధన వాతావరణమార్పులపై ఆశించినంత మార్పులేమీ జరుగలేదు. వాతావరణ ఆధారిత ప్రాజెక్టులకు అనుమతులిస్తున్నారు. కర్బన ఉద్గారాల తగ్గింపూ లేదు. పైగా ఆఫ్రికా తీర సమీపంలోని వేడినీటి పగడపుదిబ్బలు కనుమరుగుకావటం ప్రమాద సంకేతమని బ్రిటన్ విశ్వవిద్యాలయం ఒకటి విశ్లేషించింది. హెచ్చరించింది కూడా. కనీసం కాప్31లోనైనా భూగోళం పదికాలాలు పచ్చగా ఉంచే నిర్ణయాలు తీసుకోగలరనిఆశిద్దాం. లేకుంటే పర్యా వరణ సమస్యను ఎదుర్కోవడానికి సిద్ధం కావాల్సిందే! ఐక్యరాజ్యసమితి సదస్సులు సాధించాయని చెప్పుకోవ దానికి ఏమీలేదు. అమెరికాతో సంబంధంఉన్న సదస్సుల పర్యావసానం అలాగే ఉంటుందని తెలియంది కాదు. నిర్ణయాత్మకంగా వ్యవహరించలేని సదస్సులు చివరాఖరికి నిరర్థకంగా మిగులుతాయి. 2015నాటి ప్యారిస్ ఒడంబడికలో అంగీకరించిన లక్ష్యాలను ఏదేశం ఏమేరకు నెరవేర్చిందో చూసి, ఆ విషయంలో చేయాల్సిందేమిటో నిర్దేశించటమే ఉద్దేశం. బెల్లేమ్ ఈసారి అన్నిదేశాలనుంచీ ఆ లక్ష్యాల సాధనకు అవలంబించబోయే కార్యా చరణేమిటో తెలుసుకోవటమే ధ్యేయమన్నట్లు భావించినా తీరా సాధించింది స్వల్పమే. పాశ్చాత్య దేశాల పాత్ర అంతంత మాత్రమే. శిలాజ ఇంధనాల వినియోగాన్ని అంచెలంచెలుగా తగ్గించటానికి ఉద్దేశించిన కాప్‌సదస్సు ఏమీ చెప్పలేక పోయింది.కాప్ 29,30ల మధ్య చెప్పుకోదగిన ప్రగతి ఏమీకన్పించడం లేదు. భూగోళం వేడెక్కడానికి దారితీసే కారణాల్లో ప్రధానమైన శిలాజ ఇంధన వాడకంపైనే ఏమీ సాధించలేని స్థితిలో ఐక్యరాజ్యసమితి పరిధివెలుపలవాటి తగ్గింపు కృషికొనసాగుతుందనీ, ఇందుకు కొలంబియా, మరో 90దేశాలూ సమష్టిగా ప్రణాళిక రచనకు పూనుకోవచ్చు.బెలేమ్ సదస్సు గురించి చెప్పు కోదగ్గదల్లా వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనే దేశాలకు చేసే ఆర్థికసాయాన్ని మూడురెట్లు పెంచుతామనిసంపన్న దేశాలిచ్చిన హామీ అలా ఒంటిరిగా మిగిలిపోయింది.దాన్ని యధాతథంగా కొనసాగేలా చేయడమే. అదేవిధంగా జరిగితే ఏటా12వేల కోట్లడాలర్లు సమకూరుతాయి.కానివివిధ దేశాలు కనీసం ముప్పైవేలకోట్ల డాలర్లుంటేనే పర్యావరణ సమత్యులత సాధించవచ్చునని అంచనావేయడం కొసమెరుపు.

నువ్వు భయపడితే అది భయపెట్టేవాని సమర్థత కాదు, భయపడే అసమర్థత నీది.



ఎల్లెన్ గ్లాస్గో

మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.



పాస్కల్

## ప్రజావాక్కు



### జీవంత వారసత్వం

బుద్ధునిపవిత్ర అవశేషాలు కేవలం పురావస్తువులు కావని, అవి భారతదేశపు జీవంతమైన సాంస్కృతిక వారసత్వంలో భాగమని ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు కాలానుగుణంగా ఎంతోప్రాధాన్యం సంతరించుకున్నాయి. చరిత్రను గాజు పెట్టెల్లో బంధించి చూడటం ఒక విధమైతే, ఆచరిత్రను జీవన విలువలుగా మార్చుకుని ఆచరించటం మరోవిధం. బౌద్ధ ధర్మం విషయంలో భారతదేశం రెండో మార్గాన్నే ఎంచుకుంది.బుద్ధుని బోధనలు శతాబ్దాలు గడిచినా మానవాళికి దారి చూపుతూనే ఉన్నాయి. శాంతి, కరుణ, అహింస వంటి విలువలు నేటి ఉద్రిక్త ప్రపంచంలో మరింత అవసరమయ్యాయి.అలాంటి ధర్మాన్ని ప్రపంచానికి అందించిన దేశంగా భారతదేశానికి ఉన్న బాధ్యత కేవలం అవశేషాల పరిరక్షణతో ముగియదు.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

### జులాయితనం చెలాయిస్తున్న అమెరికా

వెనిజులా దేశంపై దాడిచేసి,అధ్యక్షుడిని బందీ చెయ్యడం ద్వారా అమెరికా అంతర్జాతీయ న్యాయసూత్రాల్ని, మర్యాదల్ని,హక్కుల్ని తుంగలో తొక్కింది.ఈ దురాక్రమణ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్కడి కాంగ్రెస్ అనుమతి తీసుకోలేదు. ఐక్య రాజ్య సమితి సెక్యూరిటీ కౌన్సిల్ లో చర్చించలేదు.వెనిజులా అధ్యక్షుడిపై ఆరోపణలకు ఋజువులు లేవు.ఆ సార్వభౌమ దేశం వల్ల అమెరికా కు జరిగే తక్షణ అపకారం,బెదిరింపులు ఏమీ లేవు..కుంటిసాకులు తప్ప.అమెరికా దురాక్రమణ అంతర్జాతీయ చట్టం నిబంధనలకు విరుద్ధం.ఇది ప్రపంచ దేశాలు ముక్త కంఠంతో ఖండించాల్సిన,శిక్షించాల్సిన దుశ్చర్య.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### నాణ్యమైన విద్య అందించాలి

రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతన నిధులను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్‌కళాశాలల యాజమాన్యం ఆర్థికఇబ్బందులతో కళాశాలలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులకునాణ్యతతో కూడిన విద్యఅందడం లేదు.విద్యార్థులు తమభవిష్యత్తుగురించి ఆందోళనచెందుతున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడ కుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయి నిధులను విడుదల చేయాలి.

- బి. కృష్ణ , హైదరాబాద్

### చైనా మాంజా ఉపయోగించరాదు

సంక్రాంతి పండుగ వస్తున్న సందర్భంగా యువత, పిల్లలకు సెలవులు వస్తున్నాయి సంక్రాంతికి గాలిపటాలు ఎగురవేస్తారు. ఆ పతంగులు ఎగుర వేసేదారం మాంజాతో ఎగుర వేయడానికి ప్రయత్నిస్తారు అలా కాకుండా సాధరణమైన దారంతో ఎగుర వేయాలి కాల క్రమేణా ఎన్నో పక్షులు అంతరించి పోతున్న తరుణంలో ఉన్న వాటిని కాపాడుకోవాల్సిన భాధ్యత మన అందరి పైన ఉంది కావునా బాధ్యతాయుతంగా నడుచుకోవాలి చైనా మాంజా ఉపయోగించడం ద్వారా పక్షులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రోడ్లపై బండ్లపై వెళ్ళే వారికి కూడా ప్రమాదాలు జరిగిన సందర్భాలు చూశాము కావునా వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని మాంజాను నియంత్రించాలి. సంబంధించిన అధికారులు కూడా తనిఖీలు చేస్తూ ప్రజలందరూ ప్రశాంతంగా సంతోషకరమైన వాతావరణంలో పండుగ జరుపుకునే విధంగా చూడాలని కోరుకుంటున్నాము.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంస్థ గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి. విద్య వైద్యం రవాణా విద్యుత్ గృహవసతి వ్యవసాయ రంగం వంటి అంశాలపై గిరిజన సంక్షేమ శాఖలో, గిరిజన గురుకులాలలో పనిచేస్తున్న లెక్చరర్స్ టీచర్స్‌ను గిరిజన సంక్షేమంపై పరిశోధనలు నిర్వహించాలి. యూనివర్సిటీలలో పరిశోధనలు చేసిన గిరిజన సంక్షేమశాఖ ఉద్యోగులను. పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో ట్రైబల్ స్టడీస్ ఆప్షనల్ సబ్జెక్టుగా ఉన్న వారిని గుర్తించి నియమించాలి. పరిశోధనలకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిధులు కేటాయించాలి. పరిశోధనలకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిధులు కేటాయించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### రైతు సమస్యలను పట్టించుకోండి

వ్యవసాయరంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది.ప్రధానంగా, 2013 భూసేకరణ చట్టంప్రకారం, భూమిని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు.అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షించి, రైతుఉత్పత్తులకు అనుకూలమైనవిధంగామార్చాలి.రైతుకువాస్తవలాభంచేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నవ సంకల్ప స్ఫూర్తి..సోమనాథ్ దీప్తి

సోమనాథ్... ఈ పదం చెవినపడగానే మన హృదయాంతరాళం పులకాంకితమై, మదిలో సగర్వ భావన మెదలుతుంది. ఇది భారతీయాత్మ అనంత స్పందన. ఈ అద్భుత ఆలయం పశ్చిమ భారత తీరంలోని గుజరాత్ రాష్ట్రం 'ప్రభాస్ పటాన్' అనే ప్రదేశాన్ని పావనం చేస్తోంది. దేశంలోని 12 జ్యోతిర్లింగాల ప్రాశస్త్యాన్ని ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రం ప్రస్తుతిస్తుంది. 'సౌరాష్ట్రే సోమనాథం చ...' అంటూ ఆరంభమయ్యే ఈ స్తోత్రం, తొలి జ్యోతిర్లింగ నెలవుగా సోమనాథ్ నాగరికత, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా ఈ శ్లోకం జ్యోతిర్లింగ మహత్తును ఇలా చాటిచెబుతుంది.

**సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యత్ లభతే ఫలం మనోవాంఛితం మృతః స్వర్గం సమాశ్రయేత్** అంటే సోమనాథ్ శివలింగ దర్శన మాత్రాన జీవుడు పాప విముక్తుడై సదాశయాలను నెరవేర్చి, మరణానంతరం స్వర్గ ప్రాప్తినొందుతాడు" అని అర్థం. కానీ, లక్షలాది భక్తజనం భక్తిప్రపత్తులతో నీరాజనాలు అర్పించిన ఈ సోమనాథ్‌పై దురదృష్టవశాత్తూ విధ్వంసమే ఏకైక ధ్యేయంగా విదేశీ దురాక్రమణదారులు దండయాత్రలు చేశారు. ఈ నేపథ్యంలో సోమనాథ ఆలయానికి 2026 సంవత్సరం ప్రత్యేకమైనది. ఈ ఇతిహాసిక పుణ్యక్షేత్రంపై తొలి దాడికి ఈ ఏడాదిలో వెయ్యేళ్లు పూర్తవుతున్నాయి. గజనీ మహమ్మద్ 1026 జనవరిలో క్రూర, హింసాత్మక దండయాత్రలో భాగంగా ఈ ఆలయంపై దాడి చేశాడు. ప్రజల భక్తివిశ్వాసాలకు, నాగరికతకు సుసంపన్న ప్రతీక అయిన ఈ ఆలయాన్ని ధ్వంసం చేయజూశాడు. అయితే, సోమనాథ్‌కు పూర్వ వైభవందిశగా ఏళ్లపాటు సాగిన అవిరళ కృషి ఫలితంగా వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ ఆలయ దివ్యదీప్తి ప్రపంచవ్యాప్తంగా ప్రకాశిస్తోంది. ఇటువంటి ప్రయత్నాల్లో ఒక ఘట్టానికి 2026లో 75 సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ మేరకు ఆలయ పునరుద్ధరణ అనంతరం 1951 మే 11వ తేదీన అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ సమక్షాన నిర్వహించిన కార్యక్రమంలో భక్తులకు జ్యోతిర్లింగ భాగ్యం కల్పిస్తూ ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. సోమనాథ్‌పై వెయ్యేళ్ల నాటి తొలి దండయాత్ర, అక్కడి దురాక్రమణదారుల క్రూరత్వం, పుణ్యక్షేత్ర విధ్వంసం వంటి అమానుష ఘట్టాలను వివిధ చారిత్రక గ్రంథాలు సవివరంగా నమోదు చేశాయి. వాటిని చదివే ప్రతి పాఠకుడి గుండె విలవిలలాడుతూ లిప్తపాటు విచలితమవుతుంది. ప్రతి పంక్తిలోనూ బట్టబయలయ్యే హింస, క్రూరత్వం వెయ్యేళ్ల గడిచినా మరపురాని విషాద భారాన్ని మన మనోఫలకంపై మోపుతాయి. భారత దేశం పైన, ప్రజల మనోధైర్యం మీద అది చూపిన పెను దుష్ప్రభావాన్ని ఒకసారి ఊహించండి. సముద్ర తీరంలోగల సోమనాథ్ ఆలయం అమేయ ఆర్థిక శక్తితో సమాజానికి సాధికారతనిచ్చింది. అన్నింటినీ మించి సోమనాథ్‌కు విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. నాటి సమాజంలోని సముద్ర వ్యాపారులు, నావికులు సోమనాథ్ వైభవ గాథలను దేశదేశాలకు విస్తృతంగా మోసుకెళ్లారు. అయినప్పటికీ, తొలి దాడికి సహస్రాబ్ది పూర్తయ్యాక కూడా సోమనాథ్ గాథ విధ్వంస నిర్వచనంగా నిలవకపోవడంపై నిస్సందేహంగా నేనెంతో గర్విస్తున్నాను. ఈ ఆలయం ఈనాడు భరతమాత కోట్లాది బిడ్డల అఖండ ధైర్యానికి నిర్వచనంగా నిలుస్తోంది. ఎన్నడో వెయ్యేళ్ల కిందట 1026లో మొదలైన మధ్యయుగపు అనాగరిక దండయాత్ర, ఇతరులను కూడా సోమనాథ్‌పై పదేపదే దాడులకు ప్రేరేపించింది. దేశ ప్రజలను, సంస్కృతిని దాస్య శృంఖలాల్లో బంధించే ప్రయత్నాలకు నాంది పలికింది. కానీ, ఆలయంపై దాడి జరిగిన ప్రతి సందర్భం



సోమనాథ్ ఆలయం



ప్రధాని నరేంద్ర మోడీ

లోనూ రక్షణ కుడ్యంలా నిలిచి, ఆత్మార్పణకూ వెరవని వీర పుత్రులు, పుత్రికలు ఎందరో ఉన్నారు.దాడి జరిగిన ప్రతిసారి మనదైన గొప్పనాగరికతకు వారసులుగా వారు పుంజుకుంటూ తరతరాలుగా ఆలయ పునర్నిర్మాణం, పునరుజ్జీవనానికి పాటుపడుతూనే వచ్చారు. ఇటువంటి మహనీయులలో అహల్యాబాయి హోల్కర్ ప్రముఖులు. సోమ్‌నాథ్‌లో భక్తులు ప్రార్థనలు చేసుకునేలా ఆమె అందించిన అవిరళ కృషి వెలకట్టలేనిది. అటువంటి మహానుభావులు జీవించిన నేలపై నడయాడగలగటం నిజంగా మన అదృష్టం. స్వామి వివేకానంద 1890 దశకంలో సోమనాథ్‌ను సందర్శించినపుడు అనిర్వచనీయ అనుభూతికి లోనయ్యారు. నాటి తన అనుభవాన్ని 1897లో చెన్నై నగరంలో ఓ కార్యక్రమం సందర్భంగా దక్షిణ భారతంలోని ప్రాచీన ఆలయాలతో పాటు గుజరాత్‌లోని సోమనాథ్ వంటివి మనకు అపార జ్ఞానప్రదాతలు.ఎన్నో పుస్తకాలు వివరించలేని జాతి చరిత్రపై మనకు మరింత లోతైన అవగాహనను అందిస్తాయి. వంద దాడులను భరించిన గుర్తులతోనే కాకుండా వంద పునరుజ్జీవన చిహ్నాలతో ఈ ఆలయాలు ఎంత వైభవంగానిలిచాయో గమనించండి. నిరంతర విధ్వంసం, శిథిలాల నుంచి నిరంతర పునరుజ్జీవనంతో మునుపటి రీవితో ఎంతశక్తిమంతంగా విలసిల్లుతున్నాయో చూడండి! అదే జాతీయ మనోభావన.. జాతీయ జీవన స్రవంతి.అనుసరిస్తే అది అమేయ యశస్సు వైపు మనల్ని నడిపిస్తుంది. ఆ జీవన స్రవంతిని వీడితే ఫలితం మరణమే! ఆ మార్గం వదిలిపెడితే ప్రభావం ఆత్మ నాశనం, వినాశమే!" స్వాతంత్ర్యానంతరం సమర్థుడైన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణ పవిత్ర బాధ్యతను స్వీకరించారు. 1947లో దీపావళి వేళ ఆ ప్రాంతంలో ఆయన పర్యటించారు.అక్కడి పరిస్థితులను చూసి చలించిపోయిన సర్దార్ పటేల్.. అక్కడే ఆలయాన్ని పునర్నిర్మిస్తామని ప్రకటించారు. చివరికి 1951 మే 11న సోమనాథ్‌లో భవ్యమైన ఆలయ ద్వారాలు భక్తుల కోసం తెరచుకున్నాయి. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆవేడుకకు హాజరయ్యారు. ఈ చారిత్రక ఘట్టాన్ని వీక్షించాలని కలలు గన్న యోధుడు సర్దార్ సాహెబ్ ఆ సమయానికి భౌతికంగా ఈ లోకంలో లేరు. కానీ, ఆయన స్వప్నం సాకారమై దేశం ఎదుట సగర్వంగా నిలిచింది. నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈపరిణామం పట్ల అంతగా ఉత్సాహం చూపలేదు. ఎంతో విశిష్టమైన ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్రపతి, మంత్రులు పాల్గొనడం ఆయనకు ఇష్టం లేదు. ఈ కార్యక్రమం భారత్‌పై ప్రతికూల ముద్ర వేసిందని నెహ్రూ వ్యాఖ్యానించారు. కానీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తన నిర్ణయానికి దృఢంగా కట్టుబడి ఉన్నారు. అనంతర పరిణామాలు చరిత్ర పుటల్లో నిలిచే ఉన్నాయి.సర్దార్ పటేల్‌కు ఎంతో అండగా నిలిచిన కె.ఎం. మున్షీని స్మరించుకోకపోతే సోమనాథ్ గాథ అసంపూర్ణమే అవుతుంది.సోమనాథ: నిత్య క్షేత్రం (సోమనాథ: ది ష్రైన్ ఎటర్నల్) గ్రంథంతో పాటు.. సోమనాథ్‌పై ఎన్నో సమాచారభరిత, విజ్ఞానదాయకమైన రచనలు చేశారు. నిజానికి, మున్షీ తన గ్రంథ శీర్షికలో చెప్పినట్టు.. ఆత్మ నిత్యత్వాన్నీ, ఉన్నత భావాల శాశ్వతత్వాన్నీ బలంగా విశ్వసించే గొప్ప నాగరికత మనది. 'నైనం ఛిందన్తి శస్త్రాణి' అని గీతలో చెప్పినట్టు – అది ధ్వంసం చేయశక్యం గాని అజరామరత్వమని మనం బలంగా నమ్ముతాం. మన నాగరికత అజేయ స్ఫూర్తికి సోమనాథ్‌ను మించిన ఉదాహరణ మరొకటి లేదు. ఎన్నో అవరోధాలనూ, ఆటుపోట్లనూ ఎదుర్కొని వైభవోపేతంగా నిలిచిన సోమనాథ్ కన్నా మిన్నగా మరేది దీన్ని వివరించగలదు? వందల ఏళ్ల దాడులనూ, వలసవాద దోపిడీనీ తట్టుకొని నిలబడి.. నేడు ప్రపంచ వృద్ధిలో అత్యంత ఆశాజనకమైన దేశంగా ఎదిగిన భారత ప్రగతిలోనూ ఇదే స్ఫూర్తి తొణికిసలాడుతోంది. నేడు భారత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందంటే మన విలువలు, భారతీయుల దృఢ సంకల్పమే దానికి మూలం. ప్రపంచం ఆశతో, ఆశాభావంతో భారత్‌ను చూస్తోంది. సృజనాత్మకత నిండిన మన యువతపై విశ్వాసంతో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. మన కళ, సంస్కృతి, సంగీతం, పండుగలు ఇప్పుడు విశ్వవ్యాప్తమవుతున్నాయి. యోగా, ఆయుర్వేదం ప్రపంచవ్యాప్తంగా ప్రభావంచూపుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తున్నాయి. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కొన్ని అత్యంత తీవ్రమైన సవాళ్లకు భారత్ పరిష్కారాలను చూపుతోంది. అనాది కాలం నుంచి వివిధ వర్గాల ప్రజలను సోమనాథ్ ఏకంచేస్తోంది.శతాబ్దాల కిందటే పూజ్య జైన సన్యాసి కలికాల సర్వజ్ఞ హేమచంద్రాచార్యులు సోమనాథ్‌కు వచ్చారు. అక్కడ ప్రార్థన అనంతరం..

**భవబీజాంకురజననా రాగాద్యాః క్షయముపగతా యస్య** అనే శ్లోకాన్ని ఆయన చెప్పాడంటారు. అంటే –లౌకిక కర్మ బీజాలను నశింపజేసే వాడికీ..రాగద్వేషాలనూ, సమస్తక్లేశాలనూ తుడిచిపెట్టే వాడికీ వందనాల్మ అని అర్థం. నేడు మన మనస్సులోనూ, ఆత్మలోనూ ఒక బలమైన చైతన్యాన్ని రగిలించే అద్భుత శక్తి సోమనాథ్‌కు ఉంది. 1026లో మొదటిసారి దాడి జరిగి వెయ్యేళ్లు గడిచినా.. సోమనాథ్ వద్ద సాగరం నేటికీ అంతే గంభీరంగా గర్జిస్తోంది. సోమనాథ్ తీరాన్ని తాకే అలలు అద్భుతమైన కథను చెబుతున్నాయి. ఆటంకాలెన్నెదురైనా ఆ అలల మాదిరిగానే మళ్లీ సోమనాథ అభ్యుదయం తథ్యం. నాటి దురాక్రమణదారులు నేడు గాలిలో కలిసిన ధూళి కణాలయ్యారు. వారి పేర్లు విధ్వంసానికి పర్యాయపదాలుగా మిగిలాయి. వారంతా చరిత్ర గ్రంథాల్లో పాదసూచికలు మాత్రమే. సోమనాథ్ మాత్రం దిగంతాలకు అతీతంగా దేదీప్యమై వెలుగులు విరజిమ్ముతోంది. 1026 నాటి దాడితో ఏమాత్రమూ చెక్కుచెదరని ఆ అజేయమైన, చిరతరమైన స్ఫూర్తిని మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది. సోమనాథ్ ఒక ఆశా గీతం.ద్వేషం, మతోన్మాదాలకు తాత్కాలికంగా ధ్వంసం చేసేశక్తి ఉండవచ్చు.కానీసత్యమూ, ధర్మంపై అచంచలమైన విశ్వాసమూ అమరత్వాన్ని సృజించగలవని సోమనాథ్ చాటుతోంది. వెయ్యేళ్ల కిందట దాడికి గురై, తర్వాత కూడా నిరంతర దాడులను ఎదుర్కొన్న సోమనాథ ఆలయం మళ్లీ మళ్లీ సగర్వంగా నిలిచినట్టే.. మనం కూడా పరాయి దండయాత్రలకు ముందున్న,వెయ్యేళ్ల కిందటి మన దేశ మహా వైభవాన్ని పునరుద్ధరించుకుని తీరుతాం. శ్రీ సోమనాథ్ మహాదేవుడి ఆశీస్సులతో, వికసిత భారత నవ సంకల్పంతో మనం ముందుకు సాగుతున్నాం. విశ్వ కల్యాణమే పరమావధిగా.. మన నాగరికతా స్ఫూర్తి దిశా నిర్దేశం చేస్తోంది. జై సోమనాథ్. •

–ప్రధాని నరేంద్రమోడీ, సోమనాథ్ ట్రస్టు చైర్మన్

# భారత్‌ను వణికిస్తున్న వాయు కాలుష్యం

చిలగాని జనార్ధన్

వాయు కాలుష్యం భారత్‌ను వణికిస్తోంది. స్వచ్ఛమైన గాలి పీల్చలేని దుస్థితి ఏర్పడింది. ప్రధానంగా పట్టణాల్లోని పరిస్థితి దయనీయం. దేశ రాజధాని అయిన ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళన కలిగిస్తోంది.ఈ మధ్యకాలంలో సాయంత్ర వేళల్లో ఏయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో 300 నుండి 450 వరకు సూచిస్తోంది. తీవ్రమైన హాని కలుగచేస్తుందనే దానికి సూచిక. దేశ రాజధానిలో వీఐపీలు, ఉన్నత వర్గాలు ఏయిర్ ఫిల్టర్లతో కొంత ఉపశమనం పొందుతున్నా మధ్య, సాధారణ పౌరులు వాయు కాలుష్యంతో మృతి చెందుతున్నారు. తీవ్రమైన ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన దాఖలాలు లేదు. శ్వాస సంబంధిత వ్యాధులతో ఆసుపత్రిలో చిన్నారులు అల్లాడుతున్నా చలనం లేకుండా పోయింది. వాయు కాలుష్యం వల్ల గుండె, ఊపిరితిత్తులు, మెదడు సంబంధించిన వ్యాధుల భారిన పడుతున్నారు. దేశవ్యాప్తంగా ఏటా రెండు మిలియన్ల వరకు మృతి చెందుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు చెబుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనంలేదు.గత పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్షాలు వాయుకాలుష్యంపై చర్చకు పట్టుబట్టినా ఫలితం లేకుండా పోయింది. లేబర్ కోడ్ల అమలు, జీ రాం జీ లాంటి చట్ట సవరణలపై ఉన్న శ్రద్ధ వాయు కాలుష్య నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం చూపకపోవడం విడ్డూరం. వాయు కాలుష్యం ఢిల్లీలో కోరలు చాస్తుండగా దేశంలోని వివిధరాష్ట్రాల్లోని ప్రధాన పట్టణాలు, రాజధానీల్లోనూ రోజురోజుకు పెరుగుతూపోతుంది.భారత్‌లో నేడు నీటి కాలుష్యంతోపాటు ఏయిర్ పొల్యూషన్ పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వాలు ఓటుబ్యాంకు రాజకీయాలకు ఇచ్చినంతగా ప్రజాసంక్షేమంపై చూపడం లేదు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న సెంట్రల్ పొల్యుషన్ కంట్రోల్ బోర్డు సుప్తావస్థలో ఉంది. అధికార యంత్రాంగం కాలుష్య నియంత్రణా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పైగా వాయుకాలుష్యం పెద్దసమస్యే కాదన్నట్లుగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వ్యవహరిస్తోంది. వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నియంత్రణ చర్యలపై కనీసం సూచనలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా 254 ప్రాంతాల్లో ఏయిర్ క్వాలిటీ కొలిచే కేంద్రాలను ఏర్పాటు చేసి సగటున రోజువారి బులిటెన్ విడుదల చేసే వరకు పని చేస్తున్నట్లు తెలుస్తుంది. ఏక్యూఐ ప్రపంచ సూచికతో పోలిస్తే మన సీపీసీబీ కేటగిరీలో వాయు తీవ్రతను కొంత తగ్గించి సూచిస్తున్నట్లు స్పష్టమౌతుంది. తెలంగాణలోనూ రోజురోజుకు వాయు కాలుష్యం పెరుగుతోంది. పెరుగుతోన్న వాహనాలకు తోడు అటవీ ప్రాంతం తగ్గడమూ కారణంగా తెలుస్తుంది. పల్లెలు, పట్టణాలు కాంక్రీట్ జంగల్‌గా మారాయి. రాష్ట్రంలో అడవీ ప్రాంతం 24శాతం వరకు ఉన్నట్లు ఆశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నట్లు విమర్శలున్నాయి. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ, ఇతర అభివృద్ధి నెపంతో భారీ వృక్షాలను కొట్టివేస్తున్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి నగరాల్లో వందేళ్లకు పైగా ఉన్న వృక్షాలను తొలగించారు. రోడ్లకు ఇరు వైపులా మొక్కలు నాటినప్పటికీ..అవి విద్యుత్ స్తంబాల కింద ఉండడంతో ఎప్పటికప్పుడు అవి పెరగకుండా కొట్టి వేస్తున్నారు. రోడ్డు మధ్యలో కోనోకార్పస్ మొక్కలు నాటగా అవి అనారోగ్యాన్ని కలుగ జేస్తున్నట్లు వృక్షశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అటవీ సంపదను 33 శాతం పెంచే లక్ష్యంతో హరిత హారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా 10 శాతం గ్రీన్ బడ్జెట్‌గా ప్రకటించింది. 2022 23 నాటికి 14, 965 నర్సరీలను ఏర్పాటు చేసి..270 కోట్ల మొక్కలు నాటినట్లు చెప్పుకుంది. ఇందుకు సుమారు రూ. 10వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు చెప్పుకొచ్చారు. క్షేత్ర స్థాయిలో ఇందుకు భిన్నంగా కనిపిస్తుంది. ఈ మొక్కలన్నీ నాటి ఉంటే..వాటిని సంరక్షించి ఉంటే..తెలంగాణ ఇలా ఉండేది కాదనేది నగ్న సత్యం. •

# వేగమా, జీవితమా! ఏది ముఖ్యం?

తిప్పర్తి శ్రీనివాస్

ప్రతి సంవత్సరం జనవరి నెలలో దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం మన సమాజా నికి అత్యంత అవసరమైన సందేశాన్ని అందిస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో రహదారి రవాణామన దైనందిన జీవితంలో విడదీయరాని భాగమైంది.అయితే అభివృద్ధితో పాటు ప్రమాదాల సంఖ్య కూడా భయంకరంగా పెరుగుతోంది. ఒక్క క్షణం నిర్లక్ష్యం, చిన్నపాటి తప్పిదం విలువైన ప్రాణాలను కోల్పోయే పరిస్థితిని తెచ్చిపెడుతోంది. ఈ నేపథ్యంలో రోడ్డు భద్రత మాసోత్సవం కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, ప్రజల మనసుల్లో మార్పును తీసుకొచ్చే ఉద్యమంగా మారాల్సిన అవసరం ఉంది. భారత దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో అధికశాతం యువతే కావడం మరింత ఆందోళన కలిగించే విషయం. కుటుంబానికి ఆశాకిరణంగా ఉన్న యువకుడు, తల్లిదండ్రుల కలలకు ప్రతి రూపమైన కుమార్తె, చిన్నారుల భవిష్యత్తుకు ఆధారమైన తండ్రి –ఇలా అనేక మంది రోడ్డు ప్రమాదాల బలవుతున్నా రు. ఈప్రమాదాలకు ప్రధాన కారణాలు అధికవేగం,మద్యం సేవించి వాహనం నడపడం,మొబైల్ ఫోన్‌వాడకం, హెల్మెట్ లేదా సీట్‌బెల్ట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం వంటి మానవ తప్పిదాలే. అంటే ప్రమా దాలు సహజంగా జరుగుతున్నవి కావు. మన నిర్లక్ష్యం వల్లే సంభవిస్తున్నాయి. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం ద్వారా ప్రభుత్వం, రవాణా శాఖ,పోలీసు విభాగం,స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ లు, చడం ద్వారా విద్యార్థులలో చిన్నతనం నుంచే భద్రతా భావనను నాటుతున్నారు. ఎందుకంటే పిల్లలు నేర్చుకున్న విలువలు జీవితాంతం మార్గదర్శకంగా నిలుస్తాయి. రోడ్డు నా సొంతం కాదు – అందరిది" అనే భావన ప్రతి ఒక్కరిలో నాటితేనే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. రోడ్డు భద్రత




అనేది కేవలం వాహనదారుల బాధ్యత మాత్రమే కాదు. పాదచారులు, సైక్లిస్టులు, ప్రయాణికులు – అందరూ కలిసి పాటించాల్సిన సామూహిక బాధ్యత. పాదచారులు జీబ్రా క్రాసింగ్‌లను ఉపయోగించడం, ట్రాఫిక్ సంకేతాలను గౌరవించడం, రోడ్డు మధ్యలో అకస్మాత్తుగా దాటకపోవడం వంటి చిన్నచిన్న జాగ్రత్తలు కూడా అనేక ప్రాణాలను కాపాడగలవు. అదే విధంగా, డ్రైవర్లు తమ నైపుణ్యంపై గర్వపడకుండా, ఇతరుల ప్రాణాల పట్ల బాధ్యతతో వ్యవహరించాలి. "నాకు ఏమీ కాదు" అనే నిర్లక్ష్య ధోరణి ఒక్క ప్రమాదంతోనే శాశ్వత విషాదంగా మారుతుందన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. ప్రభుత్వం రోడ్ల విస్తరణ, సిగ్నల్స్ ఏర్పాటు,సీసీటీవీ కెమెరాలు, స్పీడ్ లిమిట్స్, కఠినచట్టాలు వంటి అనేక చర్యలు తీసుకుంటున్నా, ప్రజల సహకారం లేకుండా ఇవన్నీ పూర్తి ఫలితాలను ఇవ్వలేవు. చట్టం భయంతో కాకుండా, మనస్ఫూర్తిగా నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు భద్రత సాధ్యమవుతుంది. హెల్మెట్ ధరించడం పోలీసుల భయం వల్ల కాదు –అది మన తలకాపాడే కవచం అని భావించినప్పుడే అవగాహన నిజంగా పెరిగినట్లవుతుంది. సీట్‌బెల్ట్ అనేది జరిమానా తప్పించుకునే సాధనం కాదు– అది మన ప్రాణాలను కాపాడే రక్షణ వలయం. మీడియా కూడా రోడ్డు భద్రత ఉద్యమంలో కీలకపాత్ర పోషించాలి.ప్రమాదాల వార్తలను కేవలం సంచలనంగా కాకుండా, వాటి వెనుక ఉన్న కారణాలను,తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలి. ఒక ప్రమాద కథ మరొకరికి గుణపాఠంగామారితేనే వార్తల ఉద్దేశం నెరవేరుతుంది. అలాగే సామాజిక మాధ్యమాలు కూడా అవగాహన ప్రచారానికి శక్తివంతమైన వేదికలుగా మారవచ్చు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం మనకు ఒక ప్రశ్న వేస్తోంది – మీ వేగం కన్నా మీ జీవితం ముఖ్యమా కాదా? ఈ ప్రశ్నకు ప్రతి ఒక్కరూ తమ మనసులో సమాధానం చెప్పుకోవాలి. ఒక నిమిషం ఆలస్యమవడం పర్వాలేదు, కానీ ఒక ప్రాణం కోల్పోవడం అసహ్యామైన విషాదం. మనం పాటించే ఒక్క నియమం, చూపించే ఒక్క జాగ్రత్త ఒక కుటుంబాన్ని దుఃఖం నుంచి కాపాడగలదు. ఈ రోడ్డు భద్రత మాసోత్సవాన్ని ఒక నెలపాటు జరిగే కార్యక్రమంగా కాకుండా, జీవితాంతం కొనసాగే సంకల్పంగా మార్చుకుందాం. మనం మారితే మన కుటుంబం మారుతుంది,కుటుంబం మారితే సమాజం మారుతుంది, సమాజం మారితే దేశం సురక్షితంగా ముందుకు సాగుతుంది. •

# మాట వినకుంటే మదురో కంటే ఘోరమైన గతి

## వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలికి ట్రంప్ హెచ్చరిక





**వాషింగ్టన్, జనవరి 5:** వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరికలు చేశారు. అగ్రరాజ్యం మాట వినకుంటే ఆమె భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఓ మీడియా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించడంతో ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆమె నియామకంపై శనివారం ట్రంప్ స్పందిస్తూ.. వెనిజులాలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అమెరికా చేయాలనుకుంటున్న పనులను చేసేందుకు డెల్సీ సుముఖంగా ఉందన్నారు. అయితే, తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె అమెరికా చర్యలను విమర్శించారు. మదురోను నిర్బంధించడం సరికాదని, ఆయనను వెంటనే వదిలేయాలని డిమాండ్ చేశారు. డెల్సీ స్పందనపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దీన్ని మేం సహించబోం. ఆమె సరైన నిర్ణయాలు తీసుకోకపోతే మదురో కంటే ఘోరమైన గతి పడుతుంది. వెనిజులాపై మా నియంత్రణకు ఆమె అంగీకరించాల్సిందే. అప్పుడే ఆ దేశాన్ని మేం పునర్నిర్మించగలం. మేం కోరుకున్నది ఆమె చేస్తే.. వెనిజులాలో మా బలగాలను మోహరించబోం' అని ట్రంప్ హెచ్చరించారు.

**మాతో కలిసి పనిచేయండి : డెల్సీ**

మరోవైపు వెనిజులాతో కలిసి పని చేసేందుకు అమెరికా ప్రభుత్వానికి డెల్సీ ఆహ్వానం పంపించారు. 'శాంతిస్థాపనకు మేం కట్టుబడి ఉన్నాం. వెలుపలి నుంచి ఎలాంటి ముప్పు లేకుండా అంతర్జాతీయ సహకారంతో గౌరవప్రదంగా జీవించాలని మా దేశం కోరుకుంటోంది. ప్రతి దేశంలో శాంతియుత పరిస్థితులు ఉన్నప్పుడు ప్రపంచ శాంతి నెలకొంటుందని మేం విశ్వసిస్తున్నాం. అమెరికాతోపాటు అన్ని దేశాలతో మర్యాదపూర్వక, సమతుల్య సంబంధాలు నెలకొల్పడానికి మేం ప్రాధాన్యమిస్తాం. మా దేశ పురోగతి కోసం మాతో కలిసి పని చేసేందుకు అమెరికాను ఆహ్వానిస్తున్నాం' అని ఆమె తన సోషల్ మీడియాతో సుదీర్ఘ పోస్ట్ చేశారు.

**మచాడో అధ్యక్ష కలకు అడ్డుపడిన 'నోబెల్'**

**డొనాల్డ్ ట్రంప్ నిర్ణయానికి కారణమిదేనా?**

**కారకాస్, జనవరి 5:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించగానే ప్రతిపక్ష నేత మారియా కొరీనా మచాడో చేసిన



ప్రకటన ఆసక్తి కలిగించింది. 'ఎన్నో యేళ్లుగా ఎదురుచూస్తోన్న స్వేచ్ఛ లభించింది. దేశాన్ని తిరిగి నిర్మిస్తాం' అంటూ అధికారం అందుకునేందుకు సిద్ధమనే సంకేతాలను ఆమె పంపించారు. కానీ, ఆమె కలలను డొనాల్డ్ ట్రంప్ కల్లలు చేశారు. అధ్యక్ష బాధ్యతలను మచాడోకు అప్పగించేందుకు విముఖత వ్యక్తం చేశారు. దేశంలో ఆమెకు సరైన మద్దతు లేదని ట్రంప్ చెప్పినప్పటికీ.. అసలు కారణం మచాడో అందుకున్న 'నోబెల్ బహుమతే' అనే ప్రచారం జరుగుతోంది. దీనిపై వాషింగ్టన్ పోస్టు ప్రచురించిన కథనం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతేడాది నోబెల్ కమిటీ మచాడోకు శాంతి బహుమతి ప్రకటించిన సంగతి తెలిసిందే. దాన్ని అమె అంగీకరించడం ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించిందని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించినట్లు ఆ కథనం పేర్కొంది. 'ఆ బహుమతిని స్వీకరించడమే ఆమె చేసిన పాపం. నోబెల్ కమిటీ ప్రకటించగానే ఆమె దాన్ని తిరస్కరించాల్సింది. ఆ పురస్కారానికి ట్రంప్ మాత్రమే అర్హుడని చెప్పాల్సింది. అలా చేసుంటే ఈ రోజు కచ్చితంగా వెనిజులా అధ్యక్షురాలు అయ్యేవారు' అని సదరు వర్గాలు చెప్పినట్లు తెలుస్తోంది. వెనిజులా అధ్యక్ష బాధ్యతలను తాత్కాలికంగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇందుకు అమెరికా కూడా సుముఖత వ్యక్తం చేసింది. 'ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వెనిజులా బాధ్య తలను వేరేవారికి అప్పగించే ఛాన్స్ తీసుకోం. అది ఆ దేశ ప్రజలకు మంచిది కాదు' అని ట్రంప్ వెల్లడించారు. చమురు పరిశ్రమలోని రిపబ్లిక సత్లతో, వాల్‌స్ట్రీట్‌తోనూ ఆమెకు మంచి సంబం ధాలే ఉన్నట్లు సమాచారం. దీనిని బట్టి వెని జుల్లా అధ్యక్షురాలిగా డెల్సీ కొనసాగే అవకాశం ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

అయితే, మదురో నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఆమె చేసిన ప్రకటన అమెరికా అధ్యక్షుడిని అసహనానికి గురిచేసింది. ఈ పరిణా మాలతో వెనిజులా పాలనపై ట్రంప్ నిర్ణయం ఎలా ఉంటుందోనన్న ఆసక్తి నెలకొంది.

## రష్యా చమురు నిలిపివేయకపోతే భారత్‌పై ఆంక్షలు
### మరోసారి అక్కసు వెళ్లగక్కిన ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 5:** భారత్‌తో వాణిజ్య సంబంధాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. రష్యా చమురు విషయంలో సహకరించకపోతే, భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై టారిఫ్‌లు పెంచే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఓ బహిరంగ సభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు వార్తా సంస్థలు ప్రకటిం చాయి. రష్యా చమురు విషయంలో భారత్ మాకు సహాయం చేయకపోతే, మేము వారిపై టారిఫ్‌లు పెంచగలమని ట్రంప్ అన్నట్లు వార్తా ఏజెన్సీ తెలిపింది. ఇరు దేశాల మధ్య జరుగు తున్న వాణిజ్య చర్చలతో ఈ అంశాన్ని ఆయన ముడిపెట్టారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలతో భారత్‌రష్యా ఇంధన సంబంధాల చుట్టూ నెలకొన్న ఉద్రిక్తతలు మళ్లీ తెరపైకి వచ్చాయి. గతంలో కూడా రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ ప్రకటించారు. అయితే, ట్రంప్ వాదనలను భారత ప్రభుత్వం అప్పట్లోనే తోసిపుచ్చింది. ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య అలాంటి చర్చ ఏదీ జరగలేదని స్పష్టం చేసింది. ఇప్పుడు మరోసారి ట్రంప్ ఇదే అంశాన్ని ప్రస్తావించడం గమనార్హం.



## 11న సోమనాథ్ ఆలయానికి ప్రధాని మోడీ

**గాంధీనగర్, జనవరి 5:** ప్రధామంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 11న సోమనాథ్ ఆలయాన్ని సందర్శించనున్నారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వంలో పాల్గొననున్నారు. ఈ పర్వం ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జరగనుంది. అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు జరగనున్నాయి. చివరిరోజు ప్రధాని మోడీ పాల్గొననున్నారు. ఇదిలా ఉంటే సోమనాథ్ ఆలయం విధ్వంసానికి గురై ఈ యేడాది జనవరితో వెయ్యేళ్లు పూర్తవుతుంది. ఈ సందర్భంగా సోమనాథ్ విశిష్టతను తెలియజేస్తూ ప్రధాని మోడీ ప్రత్యేక వ్యాసం రాశారు. సోమనాథ్ ఆలయం.. గుజరాత్‌లోని వెరావల్ సమీపంలోని ప్రభాస్ పటాన్ దగ్గర నిర్మితమైన పవిత్రమైన హిందూ పుణ్యక్షేత్రం. 12 జ్యోతిర్లింగాల్లో మొదటిది. రాతితో అద్భుతమైన శిల్పాలతో నిర్మితమైంది. అనేకసార్లు ధ్వంసానికి గురైంది. 1026 జనవరిలో ఈ ఆలయంపై గజనీ మహమూద్ దాడి చేసి నాశనం చేశాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వల్లభ్ భాయి పటేల్ ఆధ్వర్యంలో తిరిగి పునర్నిర్మించబడింది. ఈ ఘట్టానికి ఈ యేడాదితో 75 యేళ్లు పూర్తవుతుంది. 'సోమనాథ్ చరిత్రను విధ్వంసం నిర్వచించలేదు. వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ ఆలయ గాథను నిర్వచించేది ధ్వంసంకాదు. భారత మాత కుమారులైన కోట్లాది మంది అపరాజిత ధైర్యసాహసాలే. ఎన్నో దాడులు, అవమానాలు ఎదురైనా సోమనాథ్ మళ్లీ మళ్లీ పునరుజ్జీవనం పొందింది. మన నాగరికత అజేయ ఆత్మశక్తికి సోమనాథ్ కన్నా గొప్ప ఉదాహరణ మరొకటి లేదు. ఎన్నో కష్టాలు, అడ్డంకులు దాటి ఈ ఆలయం నేడు వైభవనంగా నిలవడం భారత సంస్కృతిలోని స్థిరత్వం, విశ్వాసానికి నిదర్శనం. ద్వేషం, మూఢత్వం క్షణికంగా విధ్వంసం చేయగలిగినా.. విశ్వాసం, సద్గుణాలపై నమ్మకం శాశ్వతంగా సృష్టి చేయగలవని సోమనాథ్ చరిత్ర మనకు బోధిస్తుంది' అని ప్రధాని మోడీ తెలిపారు.



## పొల్యూషన్ కంట్రోల్ వెసల్‌గా 'సముద్ర ప్రతాప్'

**పనాజీ, జనవరి 5:** భారతీయ కోస్టు గార్డుకు చెందిన సముద్ర ప్రతాప్ నౌక ఇవాళ జలప్రవేశం చేసింది. గోవాలో జరిగిన కార్యక్రమంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొన్నారు. సముద్ర ప్రతాప్‌ను పొల్యూషన్ కంట్రోల్ వెసల్‌గా వర్ణిస్తున్నారు. ఈ నౌకను స్వదేశీయంగా తయారు చేశారు. నౌకా నిర్మాణం, మారిటైం సామర్థ్యం కలిగిన దేశాల్లో భారత్ ఓ కీలక అడుగు వేసింది. సముద్ర ప్రతాప్ నౌకను గోవా షిప్‌యార్డు సంస్థ నిర్మించింది. సుమారు 60 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో సముద్ర ప్రతాప్ అతిపెద్ద నౌకగా గుర్తింపు తెచ్చుకుంది. మారిటైం పొల్యూషన్, ఫైర్ ఫైటింగ్, సముద్ర, పర్యావరణ రక్షణతోపాటు కోస్తా తీర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించనుంది. మారిటైం సవాళ్లను ఎదుర్కొనే రీతిలో సముద్ర ప్రతాప్ యుద్ధనౌకను తయారుచేసినట్లు మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసే నౌకల్లో 90 శాతం స్వంత వస్తువులను వాడే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ప్రాథమికంగా పొల్యూషన్ కంట్రోల్ కోసం దీన్ని డిజైన్ చేశామన్నారు. సముద్ర పర్యావరణ రక్షణ వ్యూహాత్మకత అవసరమని, నైతిక బాధ్యత అని ఆయన అన్నారు. అడ్వాన్స్‌డ్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్స్ సామర్థ్యం ఉన్న దేశాల్లో ఇప్పుడు ఇండియా కూడా అగ్రభాగాన నిలుస్తుందని మంత్రి అన్నారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతియుత, స్థిరమైన మారిటైం ఎన్విరాన్‌మెంట్ కోసంపాటుపడుతున్నట్లు చెప్పారు. సముద్ర ప్రతాప్‌నౌక సుమారు 114.5 మీటర్ల పొడుగు, 4200 టన్నులు బరువు ఉన్నది. సుమారు 22నాట్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది.

# పిఒకెను భారత్‌లో కలిపేయాల్సిందే

### బ్రిటన్ ఎంపి బాబ్ బ్లాక్‌మాన్



**జైపూర్, జనవరి 5:** బ్రిటన్ కన్జర్వేటివ్ పార్టీ సీనియర్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ జమ్మూకశ్మీర్ విషయంలో భారత్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. జైపూర్‌లోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో జరిగిన హైటీ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, పాకిస్థాన్ జమ్మూ కశ్మీర్ నుంచి ఆక్రమించిన ప్రాంతాల (పీవోకే)ను భారత్‌లో విలీనం చేయాలని స్పష్టం చేశారు. గతంలోనూ పాకిస్థాన్ ఆక్రమణను వ్యతిరేకించానని, ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటానని ఆయన అన్నారు. ఆర్టికల్ 370ని మోదీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని కూడా ఆయన సమర్థించారు. దీన్ని ఇప్పుడు కాకుండా 1992లోనే చేపట్టాల్సిందని అభిప్రాయపడ్డారు. కశ్మీరీ పండితుల వలసల సమయంలోనే ఈ నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని ఆయన పేర్కొన్నారు. పీవోకేలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని, ఇది సరైన చర్య కాదని హెచ్చరించారు. గతేడాది పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన బ్లాక్‌మన్, ఆ దాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను సమర్థించారు. కొన్నేళ్లుగా జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడుతున్నాయని, శాంతి నెలకొన్నట్లు భావించానని, కానీ పహల్గాం దాడితో ఉగ్ర సమస్య మళ్లీ వెలుగులోకి వచ్చిందని ఆయన అన్నారు. సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని విస్తరిస్తే ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు దారి తీస్తుందని పాకిస్థాన్‌ను హెచ్చరించారు. బాబ్ బ్లాక్‌మన్ గతంలోనూ కశ్మీర్ విషయంలో భారత్ అనుకూలంగా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



## కేన్సర్ రోగులకు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం

**బీజింగ్, జనవరి 5:** క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులు సాధారణ వ్యక్తులతో పోలిస్తే గుండె సంబంధిత వ్యాధులతో మరణించే ప్రమాదం ఎక్కువగా ఉందని ఒక తాజా అధ్యయనం హెచ్చరించింది. శరీరంలో వాపు, రక్తం గడ్డకట్టడానికి సంబంధించిన ప్రోటీన్ల పనితీరులో మార్పులు రావడమే ఇందుకు ప్రధాన కారణమని ఈ పరిశోధన తేల్చింది. ఈ అధ్యయన వివరాలు జర్నల్ ఆఫ్ ది అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌లో ప్రచురితమయ్యాయి. చైనీస్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. క్యాన్సర్ రోగులు తమ గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు స్పష్టం చేశారు. మా పరిశోధనలో క్యాన్సర్ రోగులలో హృద్రోగ మరణాలు పెరిగినట్లు స్పష్టమైంది. ముఖ్యంగా యువకులు, క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించిన వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. హార్మోన్లు, కిడ్నీ, వాపు సంబంధిత ప్రమాద కారకాలను ఎప్పటికప్పుడు నియంత్రించుకోవడం చాలా అవసరమని పరిశోధక బృందం సూచించింది. గతంలో క్యాన్సర్‌కు, గుండె జబ్బులకు మధ్య సంబంధం ఉందని తెలిసినప్పటికీ, దాని వెనుక ఉన్న జన్యు, ప్రోటీన్ల పరమైన కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. ఈ నేపథ్యంలో సుమారు 3.8 లక్షల మందిపై ఈ కొత్త అధ్యయనం చేశారు. వీరిలో 65,047మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారు. వయసు, పొగత్రాగడం, అధిక బరువు, రక్తపోటు, షుగర్ స్థాయులు, కిడ్నీ పనితీరు వంటి 9అంశాలు గుండె మరణాలకు ప్రధాన కారణాలని గుర్తించారు. ఆసక్తికరంగా క్యాన్సర్ నిర్ధారణ అయిన మొదటి 10 సంవత్సరాల వరకు క్యాన్సర్ ఉన్నవారిలో, లేనివారిలో గుండె జబ్బులతో మరణించే ప్రమాదం దాదాపు సమానంగా ఉంది. కానీ, ఆ తర్వాత క్యాన్సర్ రోగులలో ఈ ముప్పు గణనీయంగా పెరిగినట్లు తేలింది. క్యాన్సర్ చికిత్స ప్రభావంతో మొదట్లో వాపు, రక్తం గడ్డకట్టే సమస్యలు తాత్కాలికంగా తగ్గుతాయని, అయితే కాలక్రమేణా ఆ ప్రభావం తగ్గి ముప్పు మళ్లీ పెరుగుతుందని పరిశోధకుల అంచనా.

# అమెరికాలో శ్వేతజాతీయుల జనాభా మైనార్టీలోకి..

### ఎరోల్ మస్క్ వ్యాఖ్యల దుమారం




**వాషింగ్టన్, జనవరి 5:** టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ తండ్రి ఎరోల్ మస్క్ అమెరికా జనాభా మార్పులపై చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దుమారం రేపుతున్నాయి. రాబోయే రెండు దశాబ్దాల్లో అమెరికాలో శ్వేతజాతీయుల జనాభా మైనారిటీ స్థాయికి పడిపోతే ఆ దేశం పతనమవుతుందని హెచ్చరించారు. ఇది దేశానికి చాలా చెడు పరిణామం అని ఆయన తెలిపారు. మీరు అమెరికా పతనం కావాలని కోరుకుంటున్నారా మీకు సాంకేతికత, ఎలక్ట్రిక్ కార్లు ఇష్టం లేదా మళ్లీ ఆటవిక కాలానికి వెళ్లాలనుకుంటున్నారా అంటూ ఎరోల్ మస్క్ ప్రశ్నించారు. దక్షిణాఫ్రికా గురించి మాట్లాడుతూ అక్కడ కొద్దిమంది శ్వేతజాతీయులు ప్రవేశపెట్టిన యూరోపియన్ సంస్కృతే నల్లజాతీయుల అభివృద్ధికి తోడ్పడిందని పేర్కొన్నారు. అక్కడ వ్యవస్థీకృత అణచివేత ఉందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. గతంలో ఒక ఇంటర్వ్యూలో ఎలాన్ మస్క్ తన తండ్రిని అత్యంత చెడ్డ వ్యక్తిగా అభివర్ణించారు. నా తండ్రి చాలా జాగ్రత్తగా చెడు పనులు ప్లాన్ చేస్తాడు. మీరు ఊహించగలిగే ప్రతి నేరాన్ని ఆయన చేసి ఉంటారని సంచలన ఆరోపణలు చేశారు. తన తండ్రిని మార్చేందుకు తాను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని, ఆయన మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదని ఎలాన్ స్పష్టం చేశారు. ఎరోల్ మస్క్ జీవితం వివాదాలకు నిలయంగా మారింది. 1998లో ఆత్మరక్షణ కోసం ముగ్గురు వ్యక్తులను చంపినట్లు ఆయనే స్వయంగా అంగీకరించారు. అప్పట్లో ఆయన అరెస్ట్ అయినప్పటికీ, ఆ తర్వాత ఆరోపణలు వీగిపోవడంతో విడుదలయ్యారు. పాశ్చాత్య దేశాల్లో పెరుగుతున్న జనాభా మార్పులపై ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు మరో సారి మస్క్ కుటుంబంలోని అంతర్గత విభేదాలను, ఎరోల్ వివాదాస్పద ఆలోచనా ధోరణిని స్పష్టంచేస్తున్నాయి.

# తమిళనాడులో 10 లక్షల ల్యాప్‌టాప్‌లు పంపిణీ నేడే

**చెన్నై, జనవరి 5:** తమిళనాడు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ల్యాప్‌టాప్‌ల పంపిణీని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రారంభించనున్నారు. చెన్నై ట్రేడ్ సెంటర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొంటారు. ఉలగం ఉన్ కైగలిల్ (ప్రపంచం మీ చేతుల్లో) అనే పేరుతో చేపట్టిన ఈ పథకం తొలి దశను సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులను డిజిటల్‌గా బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 20 లక్షల ల్యాప్‌టాప్‌లను రెండు దశల్లో పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి దశలో 10 లక్షల మంది విద్యార్థులకు వీటిని అందజేస్తారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, మెడికల్, లా, అగ్రికల్చర్ కళాశాలలతో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ల్యాప్‌టాప్‌లు డెల్, ఏసర్, హెచ్‌పీ వంటి అగ్రశ్రేణి బ్రాండ్లకు చెందినవి. ఇవి ఇంటెల్_3 ప్రాసెసర్, 8 జీబీర్యామ్, 256 జీబి ఎస్ఎస్‌డీ స్టోరేజ్, విండోస్ 11, ఎంఎస్ ఆఫీస్ 365 వంటి ఆధునిక ఫీచర్లను కలిగి ఉన్నాయి. విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్, వెబ్ డిజైనింగ్ వంటి రంగాల్లో వారు రాణించేందుకు ఇవి దోహదపడతాయని ప్రభుత్వం పేర్కొంది. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థుల సంక్షేమం కోసం ఇప్పటికే తమిళ పుదల్వన్, ఇన్నోవేటివ్ ఉమెన్, ఫస్ట్ జనరేషన్ గ్రాడ్యుయేట్ వంటి పలు పథకాలను అమలు చేస్తోంది. తాజాగా ల్యాప్‌టాప్‌ల పంపిణీ ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ వ్యత్యాసాన్ని తగ్గించి, సమ్మిళిత వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# అసోం, త్రిపురల్లో భూకంపం



**గువాహతి, జనవరి 5:** ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, త్రిపురలలో ఈ రోజు తెల్లవారు జామున భూకంపం సంభవించింది. అస్సాంలోని మోరిగావ్ ప్రాంతంలో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్సీఎస్) వెల్లడించింది. భూకంప కేంద్రం భూమికి సుమారు 50 కిలోమీటర్ల లోతులో ఉండగా, రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.1గా నమోదైనట్లు తెలిపింది. అదే సమయంలో త్రిపురలో కూడా స్వల్ప భూకంపం సంభవించినట్లు ఎన్సీఎస్ ప్రకటించింది. గోమతి ప్రాంతంలో సుమారు 54 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఏర్పడగా, రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 3.9గా నమోదైనట్లు పేర్కొంది. ఈ ప్రభావంతో మేఘాలయ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కూడా స్వల్పంగా భూమి కంపించినట్లు సమాచారం. అయితే ఈ భూకంప ఘటనలతో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

## నిరాశ్రయులైన వృద్ధజంటకు భారతీయుని సాయం




**న్యూయార్కు, జనవరి 5:** నిరాశ్రయులైన ఓ అమెరికన్ జంటకు భారతీయ యువకుడు ఆహారం, నీళ్లు అందించి వారి ఆకలి తీర్చిన ఘటన అందరి హృదయాలను కదిలించింది. నోవా అనే ఇన్‌స్టాగ్రామ్ క్రియేటర్ చేసిన ఈ సాయంపై నెటిజన్ల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. కొత్త సంవత్సరం రోజున నోవాకు రోడ్డు పక్కన నిస్సహాయ స్థితిలో ఓ జంట కనిపించింది. వారి వద్దకు వెళ్లి, ముందుగా కొన్ని వాటర్ బాటిళ్లు అందించాడు. ఇంకా ఏమైనా కావాలా అని అడగగా, ఆ జంటలోని వ్యక్తి ఎంతో వినయంగా మెక్‌డొనాల్డ్స్‌లో ఏదైనా తింటాం అని చెప్పాడు. వెంటనే నోవా వారి ఆర్డర్ తీసుకుని, వారికి ఆహారం తెచ్చి ఇచ్చాడు. ఊహించని ఈ సాయానికి ఆ జంట తీవ్ర భావోద్వేగానికి గురైంది. వారు పదేపదే కృతజ్ఞతలు తెలుపుతూ, దేవుడు నిన్ను చల్లగా చూడాలి (గాడ్ బ్లెస్ యూ) అని దీవించారు. ఈ వీడియోను నోవా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, వీరి వద్ద తాగడానికి నీళ్లు కూడా లేకపోవడం చూసి కన్నీళ్లొచ్చాయి. వారికి సాయం చేయగలగడం నా అదృష్టం అని క్యాప్షన్ పెట్టాడు. ఈ వీడియో చూసిన నెటిజన్లు నోవా మంచితనాన్ని కొనియాడుతున్నారు. డబ్బు ఇస్తే డ్రగ్స్‌కు వాడొచ్చు, కానీ ఆహారం ఇవ్వడం ఉత్తమమైన పని అని ఒకరు, ప్రతిచోటా మీలాంటి వారుంటే బాగుండు అని మరొకరు కామెంట్ చేశారు.

# సంక్షిప్తంగా..

## ప్రధాని మోడీ చాదర్ సమర్పణపై పిల్‌ను తిరస్కరించిన 'సుప్రీం'



**న్యూఢిల్లీ, జనవరి 5:** అజ్మీర్ షరీఫ్ దర్గాకు ప్రధాని మోడీ చాదర్‌ను సమర్పించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆ అంశం న్యాయసమ్మతంగా లేదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను తిరస్కరించింది. ఇస్లామిక్ గురువు ఖవాజా మొయినుద్దీన్ చిస్తీ, అజ్మీర్ దర్గాను గుర్తిస్తూ గౌరవంగా చాదర్‌ను సమర్పించడాన్ని ఓ పిటిషనర్ వ్యతిరేకించారు. జితేందర్‌సింగ్ పిటిషన్ వేశారు. ఆయన తరఫున బారున్‌సిన్హా వాదించారు.

## సిగ్నల్ అందడంలేదని బాల్కనీలోకి వెళ్లి కిందపడి మృతి



**నోయిడా, జనవరి 5:** ఇంట్లో సరిగా సిగ్నల్ అందట్లేదని ఫోన్ మాట్లాడేందుకు బాల్కనీలోకి వెళ్లిన ఓవ్యక్తి ప్రమాదవశాత్తూ 17వ అంతస్తు నుంచి పడిపోవడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. రక్తపుమడుగులో పడి ఉన్న అతడిని అపార్ట్‌మెంట్‌వాసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆ వ్యక్తి మరణించాడని వైద్యులు తెలిపారు. ఈ విషాదకర సంఘటన నోయిడాలోని సెక్టార్ 104లో ఓ అపార్ట్ మెంట్‌లో చోటుచేసుకుంది. కాన్పూర్‌కు చెందిన అజయ్‌గార్గ్ (55) ఢిల్లీలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

## వంతెనకు పగుళ్లతో మహాశివలింగ్ తరలించేందుకు అడ్డంకి



**పాట్నా, జనవరి 5:** ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత బరువైన శివలింగాన్ని తరలించడం బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా అధికారులకు పెద్ద సవాలుగా మారింది. స్థానికంగా నారాయణి నదిగా పిలుచుకునే గండక్ నదిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో శివలింగం ప్రయాణం మధ్యలోనే నిలిచిపోయింది. తమిళనాడులోని మహాబలిపురంలో తయారు చేసిన ఈ శివలింగం ఆదివారం ఉదయం గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. ఈ శివలింగం బరువు సుమారు 210 టన్నులు కాగా, దీనిని తరలిస్తున్న 106 చక్రాల ప్రత్యేక ట్రైలర్ బరువు మరో 160 టన్నులు. ఈ రెండింటి మొత్తం బరువును వంతెన మోయలేదని, ప్రాథమిక తనిఖీల్లో వంతెనపై చాలాచోట్ల పగుళ్లు ఉన్నట్లు గుర్తించడంతో భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, బీహార్ రాజ్య పుల్ నిర్మాణ్ నిగమ్ లిమిటెడ్ బృందాలను పిలిపించినట్లు జిల్లా కలెక్టర్ పవన్ కుమార్ సిన్హా తెలిపారు.

## క్రికెటర్ షమీకి ఇసి నోటీసులు


**కోల్‌కత్తా, జనవరి 5:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణల ప్రక్రియలో భాగంగా పలువురు ప్రముఖులకు ఎన్నికల కమిషన్ సమన్లు జారీ చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, ప్రముఖ నటుడు దేవ్ (దీపక్ అధికారి), భారత క్రికెటర్ మహ్మద్ షమీకి కూడా విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు అందాయి. ఈ పరిణామంపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఇది కేవలం వేధింపు చర్యేనని ఆరోపించింది. ఎంపీ దేవ్‌తో పాటు ఆయన కుటుంబంలోని మరో ముగ్గురు సభ్యులకు కూడా ఈసీ నోటీసులు పంపింది. ఘటల్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన దేవ్, ప్రస్తుతం కోల్‌కతాలోని సౌత్ సిటీ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో నివసిస్తున్నారు. ఈసీ నోటీసులపై దేవ్ వైపు నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. మరోవైపు, భారత పేసర్ మహ్మద్ షమీకి కూడా ఓటరు జాబితాలోని కొన్ని సమస్యల కారణంగా హియరింగ్ నోటీసు అందింది.

## ఉమర్‌ఖలీద్, షార్జిల్ ఇమామ్‌లకు బెయిల్ తిరస్కృతి



**న్యూఢిల్లీ, జనవరి 5:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అల్లర్ల వెనుక భారీ కుట్ర ఉందన్న అభియోగాలపై నమోదైన కేసులో విద్యార్థి నేతలు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టువీరిద్దరూ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లను తిరస్కరించింది. ఇదే కేసులో ఐదేళ్లకు పైగా జైలులో ఉన్న గల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్ సహా మరో ఆరుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు వ్యతిరేకంగా ప్రాథమిక ఆధారాలున్నాయని, అందువల్ల చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం సెక్షన్ 43ఎ(5) కింద బెయిల్ మంజూరు చేయడానికి నిబంధనలు అంగీకరించవని ధర్మాసనం స్పష్టం చేసింది.

# పేదలకూ కార్పొరేట్ వైద్యసేవలు



## ప్రభుత్వాస్పత్రుల్లో త్వరలో అందుబాటులోకి

## అదనంగా 490 వెంటిలేటర్లు, 9 ఎంఆర్ఐ యంత్రాలు

## నిమ్స్‌లో 850 పోస్టులకు త్వరలో రిక్రూట్‌మెంట్

### శాసనసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి శాసనసభలో వెల్లడించారు. అసెంబ్లీ శీతాకాల సమావే శాల్లో భాగంగా 4వరోజు సోమవారం శాసనసభ ప్రశ్నో త్తరాల సమయంలో ప్రభుత్వ దవాఖానాల్లో వెంటి లేటర్లపై సిపిఐ సభ్యుడు కూనంనేని సాంబశివ రావుతోపాటు ఇతర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రస్తుతం సుమారు 1,790 వెంటిలేటర్ బెడ్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో వైద్యసేవలు మెరుగుపడటంతో ప్రభుత్వ హాస్పిటళ్లకు చికిత్స కోసం వచ్చే పేషెంట్ల సంఖ్య పెరిగి, ఐసీయూ బెడ్లు, వెంటిలేటర్ బెడ్ల అవసరం పెరిగిందని మంత్రి తెలిపారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా మరో 490 వెంటిలేటర్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో అదనంగా 490 వెంటిలేటర్లు, 8 ఎంఆర్ఐ యంత్రాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియా, ఎంజిఎం, ఆది లాబాద్ రిమ్స్‌లో ఎంఆర్ఐ యంత్రాలు అందు బాటులో ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో రూ. 192 కోట్లతో 8 ఎంఆర్ఐ మెషిన్లను కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. వాటిని రోగులు ఎక్కువగా ఉండే మహబూబ్ నగర్, సూర్యాపేట, నిజామాబాద్, నల్గొం డ, సిద్దిపేట, నిలోఫర్ ఆసుపత్రి (పీడియాట్రిక్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ)తోపాటు అదనంగా ఉస్మానియా, గాంధీ ఆసు పత్రుల్లో ఈ యేడాది మార్చి నాటికి ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. గాంధీ, ఉస్మా నియా, ఎంజిఎం వంటి ప్రభుత్వ జనరల్ హాస్పి టల్స్, జిల్లా హాస్పిటళ్లలో వాటిని ప్రజలకు అందు బాటులోకి తీసుకొస్తామన్నారు. నిమ్స్‌కు కెపాసిటీకి మించి పేషెంట్లు వస్తున్నారని చివరి నిమిషంలో ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటళ్ల నుంచి వెంటిలేటర్ మీద నిమ్స్‌కు వచ్చే పేషెంట్ల సంఖ్య ఎక్కువైందన్నారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా నిమ్స్‌లో అదనంగా మరో 125 వెంటిలేటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**నిమ్స్‌లో కొత్తగా 850 పోస్టులను భర్తీ**

అలాగే నిమ్స్‌లో నూతనంగా దాదాపు 850 పోస్టులను భర్తీ చేయనున్నట్లు మంత్రి మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. వాటిలో 242 డాక్టర్ పోస్టులు న్నాయన్నారు. గాంధీ, ఉస్మానియా, ఆదిలాబాద్ రిమ్స్, ఎంజిఎంలో మాత్రమే ప్రస్తుతం ఎంఆర్ఐ యం త్రాలు ఉన్నాయని, మరో 9 ఎంఆర్ఐ యం త్రాలు కొనుగోలు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. గతేడాది కొత్తగా 213 అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని దీంతో ఎమర్జన్సీ రెస్పాన్స్ 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గిందన్నారు. ఈ ఏడాది మరో 79 కొత్త అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నామని ఇవి కూడా అందుబాటులోకి వచ్చాక ఎమర్జన్సీ రెస్పాన్స్ టైమ్ 10 నిమిషాలకు తగ్గుతుందని మంత్రి దామోదర తెలిపారు. గడిచిన రెండేండ్లలో కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిస్టింగ్ డయాలసిస్ సెంటర్లలో వందకుపైగా డయాలసిస్ మిషన్లను అద నంగా అందుబాటులోకి తీసుకొచ్చామని, రాష్ట్రంలోని ఏ పాయింట్ నుంచైనా 20 నిమిషాల ప్రయాణంలోనే డయాలసిస్ సెంటర్ ఉండేలా, ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిం చామ న్నారు. డయాలసిస్ పేషెంట్లకు ఇబ్బంది కలగ కుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిదని మంత్రి స్పష్టం చేశారు. క్యూర్ ఏరియాలో బస్తీ దవాఖాన్లను బలోపేతం చేస్తున్నామని, బస్తీ దవాఖాన్లకు ఇంతకు ముందు పీహెచ్‌సీల నుంచి మందులను సరఫరా చేసే వారమని, ఇకపై సెంట్రల్ మెడిసినల్ స్టోర్స్(సీఎంఎస్) నుంచి నేరుగా బస్తీ దవాఖాన్లకు పంపిణీ చేయబోతు న్నామన్న మంత్రి ఈ నిర్ణయంతో బస్తీ దవాఖానల్లో మెడిసిన్ కొరతకు చెక్ పెట్టబోతున్నట్టు తెలిపారు.


# రూ. 200 కోట్లతో మేడారం ఆధునీకరణ

## 200 యేళ్లు నిలిచేలా రాతి కట్టడాలు

## కుంభమేళాను తలపించేలా ఏర్పాట్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 5:** గిరిజన, గిరిజనేతరుల ఆరాధ్య దైవాలైన సమ్మక సారలమ్మ జాతర నేపధ్యంలో సుమారు 200 కోట్ల రూపాయిలకు పైగా ఖర్చుతో ఆధునీకరణ పనులు చేపట్టామని, ఇప్పటికీ దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సోమవారం శాసనమండలిలో ఈ మేరకు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ .. కనీసం 200 సంవత్సరాలకు పైగా నిలిచేలా రాతి కట్టడాలతో ఆధునీ కరణపనులు చేపట్టామని వివరించారు. ఈ మేడారం



చుట్టుపక్కల సుమారు 10 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే ఆధునీకరణ పనుల కోసం 29 ఎకరాల భూమిని అధికారికంగా సేకరించామని తెలిపారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు మరో 63 ఎకరాల భూ సేకరణకు నిర్ణయించామని వెల్లడించారు. ఈనెల 29 నుంచి 31 వరకు జరిగే మేడారం జాతర కోసం కుంభమేళాను తలపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో నిరక్ష్యానికి గురైన ఈ మేడారం జాతర, ఏర్పాట్లు, ఆధునీకరణ వంటి అం శాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా తాను, ఈ ములుగు నియోజకవర్గ ప్రతినిధి, మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలతో కలిసి పలు మార్లు పర్యవేక్షి స్తూ ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇస్తున్నామని తెలిపారు. ఈ నెల 18న మేడారం ఆధునీకరణ పనులు ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా శాసనసభ, శాసన మం డలి సభ్యులను, మంత్రులు, స్పీకర్‌లను ఆహ్వానిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

# జిఎస్టీ శ్లాబుల సవరణతో రాష్ట్రానికి 7వేల కోట్లు నష్టం

## యేటా రూ. 2,02,369 కోట్ల పన్నులు కేంద్రానికిస్తే

## రాష్ట్రానికి ఇచ్చేది 55,630 కోట్లు : మంత్రి జూపల్లి

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** ఇటీవల జీఎస్టీ స్లాబుల్లో చేసిన సవరణ వల్ల రాష్ట్రానికి రూ.7వేల కోట్ల నష్టం జరిగిందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిఎస్టీ సంస్కరణలు ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెడ్ అన్నట్లున్నాయని మంత్రి జూపల్లి విమర్శించారు. నిధుల కేటాయింపులో కేంద్రం రాజకీయం చేస్తోంది. రాష్ట్రం నుంచి పన్నుల కింద ఏటా ..2,02,369 కోట్లు ఇస్తుంటే తిరిగిచ్చేది ..55,630 కోట్లేనన్నారు. జీఎస్టీని అమలు



చేస్తున్నది కేంద్రప్రభుత్వమని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, వే బిల్స్ అంశాలు కేంద్రం పరిధిలోనే ఉన్నాయన్నారు. జీఎస్టీ స్లాబులను తగ్గించామని కేంద్రం, బీజేపీ నేతలు పదేపదే చెప్తున్నారన్నారని పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్తున్నది ఎక్కువ.. మనకు రాష్ట్రం ఇస్తున్నది తక్కువ అని జూపల్లి విమర్శించారు. ఈమేరకు జిఎస్టీ నిబంధనలను మరింత సరళతరం చేస్తూ, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన తెలంగాణ వస్తు, సేవల పన్ను (సవరణ) బిల్లు-2026ను సోమవారం సిఎం రేవంత్ రెడ్డి తరపున పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ బిల్లును సభ ముందు ఉంచారు. గత ఏడాది నవంబరులో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ నూతన బిల్లును తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. జాతీయ విధానానికి అనుగుణంగా.. జీఎస్టీ కౌన్సిల్ 51 నుంచి 55వ సమావేశాల వరకు చేసిన సిఫార్సుల మేరకు దేశవ్యాప్తంగా ఒకే రకమైన పన్ను విధానం ఉండాలనే ఉద్దేశంతో ఈ సవరణలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తన పరిధిలోని చట్టాలను సవరించిందని, దానికి అనుగుణంగా రాష్ట్ర జీఎస్టీ చట్టంలో మార్పులు చేయడం తప్పనిసరి అయిందని పేర్కొన్నారు. 2025 సెప్టెంబరు నాటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నందున, అప్పట్లో అత్యవసరంగా ఆర్డినెన్స్ జారీ చేశామని, ఇప్పుడు దానికి సభ ఆమోదం కోరుతున్నామని చెప్పారు.

**జిఎస్టీ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం:**

**ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ వాకౌట్**

జీఎస్టీ వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతోందని ఈవిధానాన్ని తమపార్టీ వ్యతి రేకిస్తుందని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. జనాభా ప్రాతిపదికన కేంద్రం నిధులు ఇస్తోందని దీంతో నిధులు రాష్ట్రానికి తక్కువగా వస్తున్నాయన్నారు. వన్ నేషన్ వన్ ట్యాక్స్ పేరిట రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బడా బాబులను వదిలేసి పేదప్రజలపై జిఎస్టీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పెట్రోల్, డిజిల్ పై ప్రశ్నిస్తూ పెట్రోల్‌లో ఇథనాయిల్ కలుపుతున్నారని దీని వెనక ఒకేంద్రమంత్రి కొడుకు ఉన్నారని ఆరోపించారు. రాష్ట్రానికి నిధులు , నీళ్ల రావడం లేదని డిలిమిటేషన్ వల్ల రాష్ట్రంలో లోక్‌సభ సీట్లు తగ్గుతాయని అన్నారు.కావున ఈబిల్లును వ్యతిరేకిస్తూ సభనుంచి వాకౌట్ చేస్తున్న అక్బదరుద్దీన్ ప్రకటించారు.



**స్పీకర్ వెల్‌లోకి వెళ్లిన బిజెపి ఎమ్మెల్యేలు**

జీఎస్టీ సవరణ బిల్లుపై మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఫ్లోర్ లీడర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ స్పీకర్ వెల్‌లోకి వెళ్ళి నిరసన తెలిపారు. అనంతరం స్పీకర్‌వారికి సమయం కేటాయించారు.అంతకుముందు ఇదేఅంశంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, దన్‌పాల్ సూర్యనారాయణలు మాట్లాడుతూ గతంలో ఈదేశంలో ఒకే టాక్స్ విధానం రావాలని అనేక చర్చలు జరిగినప్పటికీ అధి అమలుకు నోచుకోలేదని మోదీ పిఎం అయ్యాక ఈదేశంలో టాక్స్ కట్టేవారి సంఖ్య మూడింతలు పెరిగిందన్నారు. రాష్ట్రంలో జిఎస్టీ విభాగంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని జిఎస్టీ రిజిస్ట్రేషన్ చేయాలాన్నా...క్యాన్సిల్ చేయాలన్నా అధికారులు డబ్బులు అడుగుతూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాగే చిన్నవ్యాపారులకు నోటీసులు ఇస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జిఎస్టీ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

# రైతన్నలకు విద్యుత్ వెలుగులు

## శాసనమండలిలో డిప్యూటీసిఎం భట్టి విక్రమార్క ప్రకటన

## మూడేళ్లలో 3.44 లక్షల వ్యవసాయ కనెక్షన్ల మంజూరు

### రంగంలోకి విద్యుత్ అంబులెన్స్‌లు.. 1912కు ఫోన్‌చేస్తే చాలు పరిష్కారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 5:** రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని పటిష్టం చేస్తూ, రైతులకు, సామాన్య ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో విద్యుత్ శాఖపై జరిగిన చర్చకు ఆయన సుదీర్ఘంగా సమాధానుచ్చారు.గత ప్రభుత్వాల హయాంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తూనే, ఆధునిక సాంకేతికతతో విద్యుత్ శాఖను ప్రజల ముంగిటకే తీసుకెళ్తున్నామని ఆయన వివరించారు.2022 జనవరి నుంచి 2025 డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, ఏకంగా 3,44,462 మంది రైతులకు కొత్త విద్యుత్ కనెక్షన్లు కల్పించినట్లు తెలిపారు.

కనెక్టెడ్ లోడ్ కనెక్షన్ల అనుగుణంగా 75,686 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. సీనియారిటీని ప్రాతిపదికన తీసుకుని ఎక్కడా వివక్ష లేకుండా కనెక్షన్లు ఇస్తున్నామని, మరో 9,700 మంది రైతులకు లైన్ పనులు పూర్తి కాగానే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గడిచిన రెండేళ్లలో (2024,2025) దాదాపు 2 లక్షల అదనపు కనెక్షన్లు ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అంబులెన్స్ తరహాలో విద్యుత్ సేవలువిద్యుత్ అంతరాయం కలిగితే గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా, ఖి108ఖి తరహాలో విద్యుత్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, థర్మల్ విజన్ కెమెరాలు, సేఫ్టీ గేర్ బాక్సులతో కూడిన వాహనం క్షేత్రస్థాయికి చేరుకుంటుందని తెలిపారు. ఈ వాహనంలో ఒక ఇంజనీర్ ఇద్దరు సిబ్బంది ఉండి యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరిస్తారని వివరించారు.

ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు, వైర్ల కొరత లేదురాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు లేదా వైర్ల కొరత లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజా బాట కార్యక్రమంలో అధికారులు వారానికి మూడు రోజులు పొలాల్లోనే ఉండి వంగిన స్తంభాలను, వేలాడుతున్న తీగలను సరిచేస్తు న్నారని చెప్పారు. సభ్యులు ఏదైనా సమస్యను లిఖితపూర్వకంగా తన దృష్టికి తెస్తే, కేవలం 24 గంటల్లోనే పరిష్కరిస్తామని సభలో ధీమా వ్యక్తం చేశారు.

# అసెంబ్లీ మీడియా పాయింట్




## అధ్యక్ష పదవి కోసం బావ, బామ్మర్ది కొట్లాట

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ అధ్యక్ష పదవి కోసం బావ, బామ్మార్ది కొట్లాట మొదలైందని, మొదట కుటుంబ సమస్యలు పరిష్కరించుకుని తర్వాత ప్రజల సమస్యలపై మాట్లాడాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన రాహుల్ గాంధీ కుటుంబంపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. రాహుల్ గాంధీని ఉరి తీయాలని అనడం బలుపు మాటలని ఫైర్ అయ్యారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందని, అసెంబ్లీకి రాకుండా పారిపోయారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా కేసీఆర్ పని అయిపోయిందని.. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువ అయ్యాయని అన్నారు.

ఇక పార్టీ అధ్యక్ష పదవి కోసం హరీశ్‌రావు, కేటీఆర్ మధ్య పోటీ తారాస్థాయికి చేరిందని బీర్ల ఐలయ్య తెలిపారు. సోనియా గాంధీ దయతో కేసీఆర్ సీఎం అయ్యారని, ఆమె లేకపోతే కేటీఆర్ మంత్రి పదవి ఎక్కడిదని కామెంట్ చేశారు. ముందుగా చెల్లెలు కవిత చేసిన వ్యాఖ్యలు, హరీష్ రావుపై చేసిన ఆరోపణలపై కేటీఆర్ సమాధానం చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, గాంధీ కుటుంబంపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బీర్ల ఐలయ్య వార్నింగ్ ఇచ్చారు.

# వ్యాపారరంగ నారీమణులకు 'ఇందిరా మహిళా శక్తి'తో ప్రోత్సాహం

## 50 లక్షల మంది మహిళలకు ఇందిరమ్మ చీరెల పంపిణీ

## సంక్రాంతిలోపు మరో 15 లక్షల మందికి కూడా..

### శాసనసభలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా 20కిపైగా వ్యాపార రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వం పెద్దన్న పాత్రను పోషిస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళలు నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలన్నదే తమ ఉద్దేశమని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు తక్కువ ధరల్లో రుచికరమైన ఆహారం అందించే కేంద్రాలుగానే మారడమే కాకుండా, మహిళల జీవితాల్లో వెలుగులు నింపే సాధనాలుగా మారాయన్నారు. రుచి, మమ కారంతో వంటకాలు అందించేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు వేదికలుగా నిలుస్తున్నాయన్నారు. అసెంబ్లీలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై కాంగ్రెస్ సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, బాలునాయక్‌తోపాటు ఇతర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంచి సీతక్క సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారతకు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. ప్రతి మహిళ ఎస్‌హెచ్‌జీ సభ్యురాలుగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి పండు ముదుసలి వరకు మహిళా సంఘం సభ్యులుగా చేర్చుతున్నామని, కిశోర బాలికలు,



వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు మహిళా సాధికారతకు, ప్రజా సంక్షేమానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. పాలనకు గుండెకాయ లాంటి బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదలైన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ప్రస్థానం..ఈ రోజు ఒక ఉద్యమంలా మారుమూల ప్రాంతాల వరకూ విస్తరిస్తోందన్నారు. కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, పర్యాటక కేంద్రాలు, రద్దీ ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లు ప్రజలకు సేవలంది స్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 250 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. షెఫ్ శిక్షణ, క్యాంటీన్ నిర్వహణపై ఒక్కొక్కరికి రూ.22,300 వ్యయంతో మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు 10 రోజుల పాటు హైదరాబాద్‌లోని జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ (నిథం) ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు కోసం అవసరమైన పెట్టుబడిని రుణాల రూపంలో అందిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. రోజూ వేల మందికి అందుబాటు ధరల్లో ఆకలి తీర్చే కేంద్రాలుగా ఇందిరా మహిళా శక్తి కేంద్రాలు మారాయన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు పేదల జీవితాల్లో పెద్ద ఊరటగా నిలుస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఇవి మరిన్ని ప్రాంతాలకు విస్తరించి, మరింత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ, పేద ప్రజల ఆకలి తీరుస్తాయని బలంగా నమ్ముతున్నామన్నారు. అవసరం ఉన్న ప్రతిచోట ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని నిన్ననే మేడారంలో వరంగల్ ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మేడారంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేశామని మంత్రి సీతక్క తెలిపారు.

**మహిళా స్వయం సహాయక బృందాలు**

ఇందిరమ్మ లబ్ధిదారులకు మహిళా స్వయం సహాయక బృందాలు ఆసరాగా నిలుస్తు న్నాయని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే పేదలకు లోన్లు ఇవ్వటం ద్వారా వారి సొంతింటి కలను సాకారం చేస్తున్నారని తెలిపారు. పేదరికాన్ని నిర్మూలించే దిశలో మహిళా స్వయం సహాయక సంఘాల తోడ్పాటు తీసుకుంటునామన్నారు. తెలంగాణలోనూ అత్యంత పేదరికంలో మగ్గిపోతున్న పేదలను మహిళా సంఘాల ద్వారా గుర్తిస్తామని, అవసరమైన చేయూతని ప్రభుత్వం ఇస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే 130 ఐఎంఎస్ క్యాంటీన్లను ఏర్పాటు చేశామని, మరిన్ని క్యాంటీన్లను దశల వారీగా ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి సీతక్క శాసన సభలో ప్రకటించారు.

# స్పోర్ట్స్ పాలసీని పకడ్బందీగా అమలుచేయాలి

## శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్పోర్ట్స్ పాలసీని పకడ్బం దీగా అమలు చేయాలని కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య శాసనమండలిలో ప్రభుత్వానికి సూచించారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లా డుతూ... రాష్ట్రంలోని సర్కారు పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో చాలా చోట్ల ప్లే గ్రౌండ్స్ లేవని, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని సభకు తెలిపారు. మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దాదాపు 200 పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు. అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఆటలాడేందుకు సరైన మైదానాలు, అవసరమైన మౌలిక వసతులు లేవని సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు, యు వతకు చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. రాష్ట్రంలోని సర్కారు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టులను వెంటనే భర్తీ చేస్తే విద్యార్థులు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి మం డలం, నియోజకవర్గంలో అవసరమైన చోట క్రికెట్, ఫుట్ బాల్, హాకీవంటి క్రీడలకు ప్రత్యేక మైదానాలు, స్టేడియాలు నిర్మించాలని కోరారు.

# ప్యారడైజ్ నుండి శామీర్‌పేట్ వరకు త్వరలో పనులు ప్రారంభిస్తాం

## బిఆర్ఎస్ నేతల గైర్హాజరు సరైంది కాదు

## ఆ సభ్యులపై చర్యలు తీసుకోవాలి

### శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** పారడైజ్ నుండి డైరీ ఫామ్ వరకు, పారడైజ్ నుండి షామిర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ల పనులను త్వరలోనే చేపడతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసనసభలో తెలిపారు. సోమవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆర్‌కె పురం రోడ్డు ఓవర్ బ్రిడ్జి, రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యుబి) ప్రాజెక్టు వలన 59 బిపిఎల్ ఆస్తులు ప్రభావితం అవుతాయా? అని అలాగే ఈ పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని, పారడైజ్ నుంచి షామిర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పరిస్థితిపై సభ్యులు ప్రశ్నించారు. అందుకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానమిస్తూ ఆర్‌కె పురం ప్రాజెక్టు మూలంగా 54 ఆస్తులు పాక్షికంగా ప్రభావితం అవుతున్నాయని తెలిపారు. వారికి రెండు నెలల్లోపు నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. ఇదే సందర్భంగా పారడైజ్ నుంచి డైరీఫామ్ వరకు, పారడైజ్ నుంచి షామిర్‌పేట్ వరకు ఎలివేటె కారిడార్ల పనులు ఎంత మేరకు వచ్చాయని ప్రశ్నించగా.. అందుకు మంత్రి సమాధానమిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో పారడైజ్ నుంచి డైరీఫామ్ వరకు, పారడైజ్ నుంచి షామిర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ల పనులకు సంబంధించి కేంద్రంలోని రక్షణ మంత్రిత్వ శాఖతో చర్చలు కూడా సానుకూలంగా సాగాయన్నారు. ఇందుకు సంబంధించి దాదాపు 100 ఎకరాల రక్షణ భూమి బదిలీ ఇప్పుడు చివరి దశలో ఉందన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్టు మంత్రి సభకు తెలిపారు. జిహెచ్ఎంసిని మూడు విభాగాలుగా విభజించాలనే ప్రతిపాదన వెనుక నిర్దిష్ట పరిపాలన, ఆర్థిక ఉద్దేశం ఉందా, అలాగే 2025 డినుంచి నాటికి జిహెచ్ఎంసి బకాయి ఉన్న రుణం ఎంతని సభ్యులు ప్రశ్నించారు. అందుకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానమిస్తూ.. జిహెచ్ఎంసిని మూడు విభాగాలుగా విభజించాలనే ప్రతిపాదన లేదన్నారు. ఇదే సందర్భంగా ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ సభలో లేకపోవడంపై సీరియస్ అయ్యారు. శాసనసభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు సభలో లేకపోవడం సరైంది కాదన్నారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం సభలో కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేసిందన్నారు. దానిపై అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి కానీ.. బయట చెప్పడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని చెప్పిన బిఆర్ఎస్ ఎందుకు అసెంబ్లీ నుంచి జారుకున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీరాలు పలికి ఇపుడు సభ నుంచి తోకముడించారని విమర్శించారు. స్పీకర్‌ని అవమానపరిచేలా వ్యవహరించిన బిఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ని కోరారు.

# ఉస్మానియా ఆస్పత్రి పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన అవసరం

## ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాలు

### భూసేకరణ, నాలా పనులు, రోడ్డు అనుసంధానంపై ఉన్నతస్థాయి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 5:** గోషామహల్‌లో నిర్మిస్తున్న నూతన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనుల పురోగతి, రోడ్డు మౌలిక సదుపాయాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌కు ఆదేశాలు జారీ చేశారు.ఆదేశాల మేరకు సోమవారం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించి, సంబంధిత అన్ని శాఖల అధికారులతో విస్తృతంగా చర్చలు నిర్వహించారు.ప్రాజెక్టు పరిధిలో గుర్తించిన 56 నిర్మాణాలను ఫిబ్రవరి చివరి నాటికి పూర్తిగా తొలగించనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. దీనివల్ల ఆసుపత్రి నిర్మాణ పనులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగుతాయని వెల్లడించారు.ఇంతకు ముందు పోలీస్ శాఖ పరిధిలో ఉండి, అనంతరం వైద్య విద్యా సంచాలకత్వ శాఖ (డీఎంఈ)కి బదిలీ అయిన భూమికి సంబంధించి భూఉపయోగ మార్పు అంశంలో, ఎంఏ అండ్ యూడీ శాఖ నుంచి అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) జారీ పెండింగ్‌లో ఉందని అధికారులు వివరించారు.ప్రాజెక్టు కన్సల్టెంట్లు, 2026 జనవరి 10 నాటికి పూర్తి డ్రాయింగుల షెడ్యూల్‌ను సమర్పిస్తామని, ఆమోదించిన కాలపరిమితి ప్రకారం పనులు కచ్చితంగా చేపడతామని హామీ ఇచ్చారు.ఇరిగేషన్ కాడ్ శాఖ సమర్పించిన ప్రస్తుత నాలా డిజైన్‌ను సమీక్షించిన అనంతరం, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ (బిల్డింగ్స్)కు వెంటనే పనులు ప్రారంభించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.రోడ్డు మౌలిక సదుపాయాల విషయంలో ప్రతిపాదిత రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ)కు తక్షణమే డిజైన్ సిద్ధం చేయాలని, ఆసుపత్రి ప్రవేశ రోడ్డులో ట్రాఫిక్‌కు ఆటంకంగా మారిన మ్యాన్‌హోల్‌ను సరిచేయాలని, పరిసర రోడ్ల అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ వేగంగా చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రాజెక్టు నిర్ణీత కాలపరిమితిలో పూర్తి అయ్యేలా పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను సమాంతరంగా చేపట్టాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

'అమెరికాలో హైదరాబాద్ యువతి హత్య'

# నిందితుడు అర్జున్ అరెస్టు!

### తమిళనాడులో అరెస్టు చేసిన పోలీసులు

### అర్జున్‌శర్మ బాయ్‌ఫ్రెండ్ కాదు.. రూమ్మేట్ మాత్రమే: నిఖిత తండ్రి

### నా కూతుర్ని కేవలం డబ్బుల కోసమే హత్య చేశాడు

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 5, ప్రభాతవార్త :** హైదరాబాద్ యువతి గోడివాల నిఖిత ఇటీవల అమెరికాలో ధారుణ హత్యకు గురైంది. ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. అనుమానితుడిగా ఉన్న ఆమె మాజీ మాజీ బాయ్‌ఫ్రెండ్ అర్జున్ శర్మను ఇంటర్ పోల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడులో అతనిని అరెస్టు చేశారు. అంతకు ముందు అతడిపై అమెరికా పోలీసులు అరెస్టు వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్ తార్నాక విజయ్‌పురి కాలనీకి చెందిన 27ఏళ్ల నిఖిత ఉన్నత చదువుల కోసం అమెరికాలోని మేరీల్యాండ్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించింది. డిసెంబరు 31 నుంచి కనిపించకుండా పోయిన ఆమె మృత దేహాన్ని జనవరి 3 అర్జున్‌శర్మ అపార్ట్‌మెంట్‌లో పోలీ సులు గుర్తించారు. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. దీంతో అర్జున్ శర్మపై వారికి అను మానం వచ్చింది. ఇదిలా ఉండగా ఈ నెల 2న అర్జున్‌శర్మ స్వయంగా పోలీ సులకు ఫిర్యాదు చేసి అదేరోజు ఇండియాకు బయలుదేరి రావడంతో వారికి అనుమానం వచ్చి అరెస్టు వారెంట్ జారీ చేశారు.



నిఖిత (ఫైల్)

**అర్జున్‌శర్మ నా కూతురి రూమ్మేట్ మాత్రమే..**

అర్జున్‌శర్మ బాయ్‌ఫ్రెండ్ కాదని కేవలం రూమేట్ మాత్రమే అని నిఖిత తండ్రి ఆనంద్ పేర్కొన్నారు. అమెరికాలో హత్యకు గురైన నిఖిత తండ్రి ఈ మేరకు స్పందించి సోమవారం ఆయన నివాసముండే తార్నాక విజయపురి కాలనీలో నివాసముండే శ్రీమిత్ర ప్రిన్స్ అపార్ట్‌మెంట్ వద్ద ఆయన మాట్లాడుతూ నా పెద్ద కూతురైన నిఖితను చంపిన ఆ శర్మగాడిని వదలొద్దని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.సోషల్ మీడియాలో వస్తున్నట్లు నా కూతురు నిఖితను చంపిన శర్మ బాయ్ ఫ్రెండ్ కాదని, కేవలం రూమ్మేట్ మాత్రమే అని స్పష్టం చేశారు. నా పెద్ద కుమార్తె నిఖిత నాలుగేళ్ల క్రితమే అమెరికా వెళ్లిందని అక్కడ అర్జున్ శర్మ పరిచయం అయ్యాడని పేర్కొన్నారు. ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగినట్లు నిఖిత స్నేహితులు చెబుతున్నారని డబ్బుల విషయంపై ఇద్దరు కలిసినట్లు తెలిసిందని తండ్రి ఆనంద్ చెప్పారు. చివరి సారి జనవరి ఒకటో తేదీన హ్యాపీ న్యూ ఇయర్ డాడీ అని చెప్పిందని ఇంతలోనే ఇంతటి విషాద వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు తండ్రి ఆనంద్. నా కుమార్తెను చంపి వాడే మళ్లీ పోలీస్ ఫిర్యాదు చేశాడన్నారు. హత్య విషయం ఎలాగైనా బయటకు తెలుస్తుందన్న భయంతో ఇండియా పారిపోయి వచ్చాడన్నారు నిఖిత తండ్రి ఆనంద్ చెప్పారు. అర్జున్ శర్మను కఠినంగా శిక్షించాలని, వాడిని వదలొద్దు అంటూ పోలీసులను వేడుకున్నారాయన. మా పాప డెడ్ బాడీని అమెరికా నుంచి హైదరాబాద్ తీసుకొచ్చే విధంగా సాయం చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. నా కూతురికి జరిగిన విధంగా ఎవ్వరికీ జరగకూడదని,అర్జున్ శర్మకు ఇండియాలో లేదా అమెరికాలో ఎక్కడైనా కఠినంగా శిక్ష పడే విధంగా చూడాలని కోరారు. అందరి దగ్గర డబ్బులు తీసుకుంటూ ఉంటాడని,అదే విధంగా నా కూతురు దగ్గర కూడా డబ్బులు తీసుకున్నట్లు.. నిఖిత స్నేహితులు చెబుతున్నారంటూ వివరించారాయన.అర్జున్ శర్మ అనేవాడు నా కుమార్తె ఎక్స్ బాయ్ ఫ్రెండ్ కాదని, కేవలం రూమ్మేట్ మాత్రమే అని అది కూడా ఇప్పుడు కాదని స్పష్టం చేశారు తండ్రి ఆనంద్. కాగా ఆనంద్‌కు ఇద్దరు కూతుర్లు ఉండగా పెద్ద కూతురు ఆమెరికా వెల్లగా మరో కూతురు తార్నాకలోనే ఉంటుంది.

## కవిత పార్టీ పెట్టడం వల్ల మాకు వచ్చే నష్టమేమీ లేదు

### బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. జనవరి 5:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానన్న ప్రకటనపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. ఎవరైనా పార్టీలు పెట్టుకోవచ్చని, కేఏ పాల్ కూడా ఒక పార్టీ స్థాపించారని ఆయన గుర్తు చేశారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నదని కవిత చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, అది వారి కుటుంబానికి సంబంధించిన విషయమని అన్నారు. ఆమె పార్టీ పెట్టడం వల్ల తమకు ఎలాంటి నష్టం లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని రామచందర్ రావు ఖండించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎవరికీ ఒరిగిందేమీ లేదని ఆయన అన్నారు. పలు రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకంలో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. పారదర్శకత లేని పథకాలే కాంగ్రెస్ పార్టీకి కావాలని ఆయన విమర్శించారు.

## గడ్డిమందు ఇంజక్షన్ తీసుకొని జూనియర్ డాక్టర్ ఆత్మహత్య

### చికిత్సపొందుతూ మృతి.. మృతురాలు సిద్దిపేట మెడికల్ కాలేజీ హౌస్‌సర్జన్

**సిద్దిపేట అర్బన్, జనవరి 5, ప్రభాతవార్త :** గడ్డి మందు ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన జూనియర్ డాక్టర్ హైదారాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన బి.లావణ్య సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో హౌజ్ సర్జన్ పూర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తుంది.శుక్రవారం ఉదయం లేబర్ రూంలో విధుల్లో ఉన్న సమయంలో అనారోగ్యంగా ఉండడంతో క్యాజువల్ డిపార్ట్‌మెంట్‌లో చికిత్స తీసుకొని కాలేజీ హాస్టల్‌కు వెళ్లింది. శనివారం ఉదయం ప్రభుత్వ కళాశాల హాస్టల్‌లో పారాక్వాట్ గడ్డి ముందును ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. వెంటనే తోటి జూనియర్ డాక్టర్లు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదారాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెంది. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

**ప్రేమించి మోసం చేసిన డాక్టర్ అరెస్టు**

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో హౌస్ సర్జన్‌గా పని చేస్తున్న దళిత కుటుంబానికి చెందిన విద్యార్థిని బి.లావణ్య(23) జూనియర్ డాక్టర్ ప్రేమించి మోసం చేసిన అమె ఆత్మహత్యకు కారణమైన డాక్టర్ ప్రణయ్ తేజ్‌ను అరెస్టు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న లావణ్యకు అదే కాలేజీలో సీనియర్ రెసిడెంట్‌గా డాక్టర్ జనరల్ మెడిసిన్ చదువుతున్న సికింద్రాబాద్ అల్వాలకు చెందిన ప్రణయ్‌తేజ్‌తో గత సంవత్సరం జూలై నెలలో పరిచయం ఏర్పడి ప్రేమ సంబంధింగా మారిందని తెలిపారు.వివాహం చేసుకుంటానని నమ్మించి సన్నిహితంగా మెలిగిన ప్రణయ్‌తేజ్ అనంతరం కుల బేధం కారణంగా వివాహానికి నిరాకరించడంతో లావణ్య తీవ్ర మనస్తాపానికి గురై కాలేజీ హాస్టల్‌లో గడ్డి నివారణకు వాడే పారాక్విట్ మందును ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టి చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు.నిందితుడు ప్రణయ్‌తేజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా బిసి కంసాలి కులానికి చెందిన వ్యక్తి కాగా మృతురాలు దళిత సామాజిక వర్గానికి చెందినందున ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

# పోలవరం-నల్లమలసాగర్‌ను ముమ్మాటికి అడ్డుకుంటాం

### ఎపి ప్రతిపాదనలు జల నిబంధనలను ఉల్లంఘించడమే

### హరీశ్‌రావు చూపించిన లేఖను సిడబ్ల్యుసి ఆమోదించలేదు

### వచ్చే సోమవారం జరిగే వాదనలకు స్వయంగా హాజరవుతా

### మీడియాతో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 5:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించే ప్రసక్తేలేదని,ఖచ్చితంగా అడ్డుకుని తీరుతామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తేల్చిచెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు ముమ్మాటికి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ 1980 అవార్డ్‌తో పాటు అంతరాష్ట్ర జల నిబంధనలు ఉల్లంఘించడమేనని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఆయన రాష్ట్ర శాసనసభలోని లాబీలో తన ఛాంబర్‌లో జరిగిన మీడియా చిట్‌చాట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ మాజీ మంత్రి హరీష్ రావు చూపిస్తున్న లేఖ సి.డబ్ల్యూ.సి అంతర్గతంగా సమాచారం కోసం పంపిన లేఖ మాత్రమే నని,ఎంత మాత్రం సి.డబ్యు.సి ఆమోదించినట్లు కాదని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణా రాష్ట్ర జల హక్కులపై ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు బిఆర్ఎస్ పార్టీ పూనుకుందని ఆ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని ఆయన కొట్టి పారేశారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం జీఆర్‌యంబి,పోలవరం ప్రాజెక్ట్ అథారిటీలతో పాటు కేంద్ర జల కమిషన్,కేంద్ర పర్యావరణ,అటవీ మంత్రిత్వ శాఖ,కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలకు లేఖలు రాసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.తెలంగాణా ప్రభుత్వ అభిప్రాయంతో పైన పేర్కొన్న సంస్థలన్నీ ఏకీభవించాయని ఆయన వెల్లడించారు. డిసెంబర్ 4న కేంద్ర జల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖనే ఇందుకు నిదర్శనమన్నారు. అంతటితో ఆగకుండా భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామని ఆయన వెల్లడించారు.ఇదే ప్రాజెక్టును ఒక్క తెలంగాణా రాష్ట్రం మాత్రమే కాకుండా మహారాష్ట్ర,కర్ణాటక రాష్ట్రాలు కూడా ఆక్షేపిస్తున్నాయని ఆయన తెలిపారు.ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణా ప్రాంత ప్రయోజనాలను కాపాడడంతో పాటు గట్టి వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింగ్విని నియమించిందని ఆయన పేర్కొన్నారు.అయితే సోమవారం(5వ తేదీ) జరగాల్సిన వాదనలు వచ్చే సోమవారం(12వ తేదీకి) రోజుకు వాయిదా పడ్డాయని రిట్ పిటిషన్ ను సూట్ పిటిషన్ గా మార్చి దాఖలు చేయాలని సూచించినట్లు ఆయన వెల్లడించారు. వచ్చే సోమవారం జరగనున్న వాదనలకు స్వయంగా తాను హాజరు అవుతానని, మళ్ళీ స్టే ఆర్డర్ కోరతామని ఆయన తెలిపారు.ఇదే విషయమై రానున్న రెండు రోజుల్లో న్యాయవాదులతో ప్రత్యేకంగా మరో సమావేశం నిర్వహించి తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలువరించడంలో విజయం సాదించమన్నారు.తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదటనే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి బ్రేక్ పడిన విషయాన్ని తెలంగాణా సమాజం గుర్తించుకోవాలన్నారు.కొత్తగా ఏర్పడ్డ తెలంగాణా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ పాలకులు జల వనరుల నిర్వహణలో ఘోరంగా విఫల మయ్యారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.బిఆర్ఎస్ పాలనలో మాటలకు చేతలకు ఎక్కడ పొంతన లేదని ఆయన విమర్శించారు. జూరాల నుండి పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని శ్రీశైలంకు,తుమ్మిడిహట్టి నుండి మెడిగడ్డకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద తుమ్మిడిహట్టి ప్రాజెక్టును రీ డిజైన్ చేయడం వంటి నిర్ణయాలు తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ తరాల మీద మోయలేని భారాన్ని బిఆర్ఎస్ పాలకులు మోపారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు.

## ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు వర్సిటీ చట్టసవరణ బిల్లు 2026కు ఆమోదం

### సభలో ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీకి చట్టబద్ధత లభించనుంది. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి చట్టబద్ధత కల్పించడం కోసం తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026కు శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది. సోమవారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాలు ముగియగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున సభలో యూనివరినసటీ చట్టసవరణ బిల్లును వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రవేశ పెట్టారు. గతేడాది డిసెంబర్‌లో యూనివర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూనివర్సిటీని ప్రారంభిన విషయం తెలిసిందే. ఖనిజ సంపదకు నెలవైన కొత్తగూడెం ప్రాంతాన్ని విద్యా హబ్‌గా మార్చే లక్ష్యంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతేడాది డిసెంబర్‌లో ప్రారంభించిన "డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" కి శాశ్వత ప్రాతిపదికన చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది.ఈ మేరకు 'తెలంగాణ యూనివర్సిటీల చట్టం1991'ని సవరిస్తూ రూపొందించిన బిల్లును ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి తరపున, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా శాసనసభలో ప్రవేశపెట్టారు. 1978లో స్థాపించిన కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ (తర్వాతి కాలంలో ఇంజనీరింగ్ కాలేజీ)ని అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 2025లో సీఎం చేతుల మీదుగా ప్రారంభమైన ఈ వర్సిటీకి, తాజా చట్ట సవరణ ద్వారా పూర్తి అటానమీ (స్వయంప్రతిపత్తి) లభించనుంది.

దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలకు నివాళిగా ఈ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం జరిగింది. యూనివర్సిటీ అభివృద్ధికి వచ్చే రెండేళ్లలో రూ. 500 కోట్లు కేటాయిస్తామని, యూనివర్సిటీ విస్తరణ కోసం 310 ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. ప్రపంచంలో ఎర్త్ సైన్సెస్ కోసం ప్రత్యేక వర్సిటీలు ఉండడం చాలా అరుదన్నారు. సింగరేణి గనులు, గోదావరి నది, అటవీ సంపద ఉన్న కొత్తగూడెం ప్రాంతం విద్యార్థులకు ఒక "లివింగ్ లాబొరేటరీ" గా మారుతుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనతో కూడిన విద్య ఇక్కడ సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. .ప్రస్తుతం ఉన్న బీటెక్ కోర్సులతో పాటు, కొత్తగా బీఎస్సీ (జియాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్), ఎంఎస్సీ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి సభకు తెలిపారు. చట్టబద్ధత వల్ల యూనివర్సిటీకి సొంతంగా కరికులమ్ రూపొందించుకునే స్వేచ్ఛ, యూజీసీ నిధులు, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు (ఎంవోయు) కుదుర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. సింగరేణి ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని, తెలంగాణను మైనింగ్, జియాలజీ రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టేందుకే ఈ యూనివర్సిటీని స్థాపించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ సభకు వివరించారు. చట్టసవరణపై ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ మాట్లాడుతూ యూనివర్సిటీలో కొత్త కోర్సులను ఏర్పాటు చేయాలని, మార్కెట్‌కి అనుగుణంగా కోర్సులను రూపొందించాలన్నారు. సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు సంతోషకర మన్నారు. యూనివర్సిటీ నిర్వహణలో ఇబ్బందులు రాకుండా, నిధులు ఏర్పాటు చేయాలని సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు.

## కవిత రాజీనామా చేశాక మండలికి వెళ్లి కంటతడి పెట్టారు

### ఆమె ఎవరో ఆడించినట్లు ఆడుతున్నారు: బిఆర్ఎస్ నాయకురాలు గొంగిడి సునీత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. జనవరి 5:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన తర్వాత, ఇప్పుడు శాసనమండలికి వెళ్లి కంటతడి పెడుతున్నారని బీఆర్ఎస్ నాయకురాలు గొంగిడి సునీత విమర్శించారు. కవిత తన ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామా కేవలం ఒక నాటకమని, ఆమె మనస్ఫూర్తిగా ఆ పని చేయలేదని సునీత ఎద్దేవా చేశారు. ఒకవేళ నిజంగానే పదవి అవసరం లేదనుకుంటే కౌన్సిల్ సమావేశాలకు ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మహిళా నేతలతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. మద్యం కుంభకోణంలో కవిత జైలుకు వెళ్ళినప్పుడు ఆమెను విడిపించడానికి హరీశ్ రావు ఎంతో కృషి చేశారని ఆమె అన్నారు.కెటిఆర్ వారానికి నాలుగు సార్లు ఢిల్లీకి తిరిగి ఆమె కోసం శ్రమించారని, కానీ ఇప్పుడు ఆమె మాత్రం పార్టీకి వెన్నుపోటు పొడిచేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత కూర్చున్న కొమ్మను నరుక్కునే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలకు కనీస సమయం ఇవ్వని ప్రభుత్వం,కవితకు మాత్రం అంత సమయం ఎలా కేటాయించిందో చూస్తుంటే ఆమెను ఎవరు నడిపిస్తున్నారో స్పష్టంగా అర్థమవుతోందని, కవిత ఎవరో చెప్పినట్లు ఆడుతున్నారని ఆరోపించారు. నిజామాబాద్‌లో ఎంపీ స్థానం నుంచి ఓడిపోతే కవిత బాధను చూడలేక కేసీఆర్ ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారని అన్నారు.

## అసెంబ్లీ 'జీరో'అవర్

## పెండింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలి

### గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పకడ్బందీగా నిర్మించాలి

### జీరో అవర్‌లో ప్రభుత్వానికి పలువురు ఎమ్మెల్యేల విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** గత పాలనలో ప్రారంభించిన ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసిన ప్రజలకు అందుబాటులో ఉంచాలని శాసన సభలో పలువురు ఎమ్మెల్యేలు కోరారు. సోమవారం జీరోఅవర్‌లో తమ నియోజకవర్గంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సీసీ రోడ్లు, కాలనీలో హైటెన్షన్ వైర్ల తొలగించి, డ్రైనేజీ నిర్మాణాలు, తాగునీరు కోసం కొత్త పైపు లైన్లు వేయాలని పేర్కొన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెట్ వసతి ఉండేలా యార్డులు ఆధునీకరణ చేయాలని, అన్నదాతలు మోసం చేసే దళారుల పట్ల కఠిన నిర్ణయాలు ఉండాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వం కార్యాలయాలతో పాటు బడుల్లో సరిపడ్డ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, పెండింగ్ బిల్లులను త్వరగా విడుదల చేయాలని కోరారు. వాగుల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు చేపట్టి వరద జలాలు నిల్వ ఉండేలా చూడాలన్నారు.

**బిసి కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలి : యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

బీసీ కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలని, వారు ఒకే దగ్గర ఉండి సమస్యలు చర్చించేందుకు వేదికలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి నిర్మిస్తే బీసీ కులాలు కాంగ్రెస్‌ప్రభుత్వానికి అండగా ఉంటారని మహబూబ్‌నగర్‌ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

**కంటోన్మెంట్ జిహెచ్‌ఎంసిలో కలపాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్**

కంటోన్మెంట్‌నియోజకవర్గం జీహెచ్‌ఎంసీలో కలపాలని, ఆప్రాంతమంతా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండటంతో మోడీ సర్కార్‌నిధులు మంజూరు చేయకపోవడంతో రహదారులు అవస్థవ్యస్తంగా ఉన్నాయని, ద్విచక్ర వాహనాలు కూడా సక్రమంగా నడిచే పరిస్థితి లేదన్నారు. అక్కడ జరగాల్సిన బోర్డు ఎన్నికలు కూడా వాయిదా పడటంతో బోర్డు ఒక రూపాయ నిధులు ఇవ్వడంలేదని వాపోయారు. వెంటనే ప్రభుత్వం కంటోన్మెంట్‌నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరారు. మండల కేంద్రాల్లో ఉన్న ఆసుపత్రుల్లో సరిపడ వసతులు లేవని, పేదలు వైద్యం కోసం రాజధాని నగరానికి రావాల్సి వస్తుందని, ప్రాథమిక కేంద్రాల్లో ల్యాబ్ లు, ఎక్స్‌రే మిషన్లు మంజూరు చేస్తే వైద్య సేవలు అందుతాయని, నర్సులు, వైద్యులు కూడా తగిన విధంగా నియామించాలని ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, మేడిపల్లి సత్యం, ధనపాల్ సూర్యనారాయణ గుప్త, ఆది శ్రీనివాస్, రాంచందర్‌నాయక్, మురళీ నాయక్, మనోహర్ రెడ్డి, పటోళ్ల సంజీవ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. జడ్చర్ల నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌కేంద్రంగా చేయాలని, మరో రెండు మండలాలు ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సూచించారు.

**రామారావు మరణంపై సిట్ ఏర్పాటు చేయాలి : సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని**

ఖమ్మంలో ఇటీవల సీపీఎం నేత సామినేని రామారావు హత్యగావించారని ఇప్పటివరకు బాధ్యులు ఎవరో తేల్చలేదని, అతని మరణంపై మిస్టరీ వీడేందుకు ప్రభుత్వం సిట్‌ఏర్పాటు చేసిన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలం పాటు రాజకీయాల్లో ఉండి ఎందరికో ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.

**పదవీవిరమణ బెనిఫిట్స్‌త్వరగా ఇవ్వాలి : ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకట రమణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి**

రాష్ట్రంలో రెండేళ్ల నుంచి పదవి విరమణ చేసిన ఉద్యోగులకు బెనిఫిట్స్ ప్రభుత్వం చెల్లించడం లేదని, వారు నెల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి వచ్చిందని కాటేపల్లి వెంకరమణ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.13,500 కోట్ల వరకు పెండింగ్ ఉన్నాయని వాటిని ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులకు గతంలో 13 వేలు కార్డులు మంజూరు జరిగింది. ఈప్రభుత్వం వాటిని సగానికి తగ్గించడం సరికాదని, వెంటనే గతంలో ఉన్న విధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజక, నాయి బ్రాహ్మణ కులాలకు గతంలో ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేసింది. వాటిని ఇప్పటివరకు ఈప్రభుత్వం చెల్లించకపోవడంతో ఒక్కొక్కరికి రూ. 15 వేలకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని రేవంత్‌సర్కార్ మాఫీ చేయాలని పాయల శంకర్ కోరారు.

## మాలలకు జరుగుతున్న అన్యాయాలపై అసెంబ్లీలో సమీక్షించాలని డిమాండ్

### మీడియా సమావేశం అనంతరం మాలలు అరెస్టు

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఎసి నాయకులు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశాన్ని ముగించుకుని కిందకు రాగానే పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. తమ బాధలను ప్రభుత్వం దృష్టికి మీడియా ద్వారా తెలియజేయడానికి వస్తే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గు చేటని జెఎసి నాయకులు నిశితంగా విమర్శించారు. అంతకు ముందు జరిగిన మీడియా సమావేశంలో జెఎసి ఛైర్మన్ మందాల భాస్కర్, అధ్యక్షుడు చెరుకు రాంచందర్, గ్రేటర్ హైదరాబాద్ ఛైర్మన్ బేర బాలకిషన్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అణగారిన, అనగదొక్కబడిన మాలల హక్కుల కోసం ఏలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని లక్షలాది మంది మాలలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రస్తుతం జరుగు తున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర శాసన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామి, మాల ప్రజా ప్రతినిధులు చర్చించాలని డిమాండ్ చేశారు.మాలల సమస్యలను పరిష్క రించకుండా ప్రభుత్వం పెట్టుకుంటే తెలుగుదేశం ప్రభుతానికి పట్టినగతే కా ంగ్రెస్ పార్టీకి పడు తుందని, భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. తమ డిమాండ్లపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోగా ప్రభుత్వం నాయ్యం చేయకపోతే సిఎం ఇల్లును, అసెంబ్లీని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

## ఇద్దరు పిల్లలకు మించి సంతానంపై మండలిలో బిల్లు ఆమోదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 5:** పంచాయతీరాజ్ చట్టంలోని 21 వ సెక్షన్ సవరణ బిల్లును సోమవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శాసన మండలిలో ప్రవేశపెట్టారు. ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉంటే గ్రామీణ స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులు అన్న నిబంధనను తొలగిస్తూ సవరణ చేశారు. దీనికి సంబంధించి గతంలో ఆర్డినెన్స్ జారీ కాగా..శనివారం బిల్లును అసెంబ్లీ ఆమోదించగా.. సోమవారం శాసనమండలిలో మంత్రి సీతక్క ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. దీంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉన్న వారు పోటీ చేయవచ్చు. ఇటీవల వరకు ఆర్డినెన్స్ ఉన్న కారణంగా ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉన్న అభ్యర్థులు పోటీ చేశారు.

## సాహితీ ఇన్‌ఫ్రా స్కామ్ రూ.3 వేల కోట్లు

### చార్జ్‌షీట్ దాఖలు చేసిన సిసిఎస్ పోలీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 5:** రియల్ ఎస్టేట్ పేరిట భారీ మోసానికి పాల్పడ్డ సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) పోలీసులు నాలుగేళ్ల విచారణ అనంతరం మొత్తం రూ.3000 కోట్ల స్కామ్‌గా దీన్ని తేల్చారు.ఫ్రీ లాంచ్ ఆఫర్ పేరుతో అతి తక్కువ ధరకు ఫ్లాట్లు ఇస్తామంటూసాహితీ యాజమాన్యం వేలాది మంది కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసింది.ఈ కేసులో మొత్తం 64 కేసులు నమోదయ్యాయి.గి



కొటికలపూడి కృష్ణ కిశోర్, ఆశ(ఫైల్)

అమెరికాలో రోడ్డు ప్రమాదం

## పాలకొల్లు సాఫ్ట్‌వేర్ దంపతుల మృతి

**విజయవాడ,జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన దంపతులు మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన భార్యాభర్తలు కొటికలపూడి కృష్ణ కిశోర్ (టిన్ను) (45), ఆశ(40) వాషింగ్టన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో వారి కుమారుడు, కుమార్తె తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వారి కుటుంబసభ్యులకు సమాచారం అందింది. కృష్ణకిశోర్ దశాబ్ద కాలానికి పైగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆ దంపతులు 10రోజుల క్రితం పాలకొల్లు వచ్చి తిరిగి వెళ్లారు. మార్గం మధ్యలో దుబాయ్‌లో న్యూఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. వీరి మృతితో పాలకొల్లులో విషాదఛాయలు అలముకున్నాయి.

## విశ్రాంత ఉద్యోగుల చలో అసెంబ్లీ ఉద్రిక్తం.. అరెస్టులు

**హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:** ఏడాదిన్నరగా అపరిష్కృతంగా వున్న తమ డిమాండ్లల్ల సాధనకు వి శ్రాంత ఉద్యోగులు సోమవారం చేబట్టిన ఛలో అసెంబ్లీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన విశ్రాంత ఉద్యోగులు తమకు ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిల కోసం కదం తొక్కారు. పెద్ద సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు నాంపల్లి, బషీర్‌బాగ్‌ల నుంచి అసెంబ్లీ వైపుకు వచ్చేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆం దోళనకారులను పోలీసులు బలవతంగా పోలీసు వాహనాల్లో ఎక్కిం చారు. తమను అరెస్టు చేస్తున్న సమయంలో విశ్రాంత ఉద్యోగులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. తమ అరెస్టు అన్యాయమని, సర్కారు తమ ను మోసం చేసిందని వాపోయారు. 30 నుంచి 40 ఏళ్ల పాటు ప్రభుత్వంలో వివిధ విభాగాల్లో పనిచేసిన వారు పదవీ విరమణ చేశాక న్యాయం గా ప్రభుత్వం నుంచి రావా ల్సి న బకాయిలను ఇచ్చేం దుకు సర్కారు నిరాక రించడం దారుణమని ఆందోళనకారులు తెలి పారు. దీనిపై ఏడాదిన్నరగా అనేక రూపాల్లో పో రాటం చేసినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అసెంబ్లీని ముట్టడించాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. అనేక మంది విశ్రాంత ఉద్యోగులు అనారోగ్యం పాలైతే వైద్యం చేయించుకునేందుకు డ బ్బులు లేక నానా అవస్థలు పడుతున్నారని, ఇం దులో కొందరు చనిపోయారని ఆయన తెలిపారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని ఇప్పటికైనా విడనాడి, తమకు రావాలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల విషయంలో సర్కారు ఇదే విధం గా నిర్లక్ష్యం కొనసాగిస్తే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కాగా ఆందోళనకారులను పలు పోలీసు స్టేషన్లకు తరలించి రాత్రి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.





## తెలుగు భాష మంచి జీవన విధానాన్ని, సంస్కారాన్ని నేర్పుతుంది

**- ఆంధ్ర సారసత్వ పరిషత్ అధ్యక్షుడు డా. గజల్ శ్రీనివాస్**

**విజయవాడ,జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాష మంచి జీవన విధానాన్ని,సంస్కారాన్ని నేర్పుతుందని ఆంధ్ర సారసత్వ పరిషత్ అధ్యక్షుడు డా. గజల్ శ్రీనివాస్ అన్నారు.మానవీయ సంబంధాలు బలీయంగా నిలవాలంటే మాతృభాషను మరిచిపోకూడదన్నారు.తెలుగు ప్రతి ఒక్కరి శ్వాస కావాలన్నారు.మాతృభాష తరువాతనే ఇతర భాషలపై ఆసక్తి చూపాలన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు సభాధ్యక్షత వహించిన డా. గజల్ శ్రీనివాస్ తన అధ్యక్షోపన్యాసంలో తెలుగు భాష తోరణంలా రాష్ట్రాన్ని మార్చాలని, వ్యాపార బోర్డులు అన్నీ తెలుగులో తప్పనిసరి ఉండేలా చూడాలని కోరారు. 52 దేశాల నుంచి తెలుగు ప్రతినిధులు, కవులు, భాషా ప్రేమికులు వేలాది మంది పాల్గొన్నారని, 25 వేల మంది విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారని వివరించారు. ఇది ఒక అనురాగ సంగమంగా ఆయన అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, తెలంగాణ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ బులుసు శివశంకరరావు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు మహమ్మద్ నజీర్, జి.మాధవి, బి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

**- తిరుపతి ఎస్పీ లంకెల**

**తిరుపతి,జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** పలు రకాల సమస్యలతో బాధితులు,ప్రజలు తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంకు వచ్చి ఇచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో మీకోసం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు చేరుకున్నారు. వారందరి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సుబ్బరాయుడు ప్రతి ఒక్కరితో స్వయంగా మాట్లాడారు. ప్రజల ఫిర్యాదులు, సమస్యలపై పోలీసు అధికారులు ఆలస్యం చేయారాదని, దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు ఫిర్యాదులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. సోమవారం దాదాపు 101 ఫిర్యాదులు రావడంతో వాటిని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ సమస్యలపై విచారణ చేసి న్యాయం చేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, రామకృష్ణ, డి ఎస్పీలు జె.వెంకటనారాయణ(ఎస్‌బి), భక్త వత్సలం, రామకృష్ణమాచారి, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

## వెనెజులాపై అమెరికా దాడి దుర్మార్గం: సిపిఐ రామకృష్ణ

**విజయవాడ,జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** వెనుజులాపై అమెరికా దాడిని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఒక దేశంపై మరో దేశం దాడి చేయడం అత్యంత దుర్మార్గమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. వెనుజులాపై అర్ధరాత్రి సమయంలో అమానుషంగా దాడి చేయించి, అమాయకులను చంపడం, ఆ దేశాధ్యక్షుడు మదురోతో సహా అతని కుటుంబాన్ని కిడ్నాప్ చేయటం అనాగరిక చర్యగా అభివర్ణించారు. ట్రంప్ రెండో పర్యాయం అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం అందరినీ బెదిరించే స్థాయికి దిగజారారని, టారీఫ్‌లు పెంచుతున్నారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా వెనుజులా దేశంలో ఉన్న ఆయిల్ నిక్షేపాలపై కన్నేసిన ట్రంప్ వాటిని కొల్లగొట్టే దురుద్దేశంతోనే ఇటువంటి దురాక్రమణకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. వెనుజులాపై అమెరికా దాడిని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు తీవ్రంగా ఖండించాలని కోరారు. వెనుజులా దేశానికి మద్దతుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలంతా గళమెత్తాలని, ప్రధాని మోడీ ట్రంప్ దుశ్చర్యలను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం గత 18 నెలల కాలంలో విద్యుత్ భారాల రూపంలో దాదాపు రూ.24 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య తెలిపారు. రూ.8,274 కోట్ల మేర తప్పుడు ప్రతిపాదనలపై సమగ్ర విచారణ జరపాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని చంద్రబాబు ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం అదానితో చేసుకున్న అన్ని అక్రమ ఒప్పందాలనూ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలుగులో మాట్లాడితేనే భాషకు మనుగడ

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**విజయవాడ,జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగులోనే మాట్లాడతామని సంక్రాతికి ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేసుకోవాలి మానవ సంబంధాల్లో వ్యక్తీకరణ భాష అని, వీనుల విందైన సౌందర్యమైన తెలుగు భాష రామాయణ కాలం నుంచే ఉందని, తెలుగు వెలుగుకు అందరూ కృషి చేయాలని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు కోరారు. ఏటుకూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల సమాపనోత్సవ సభ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు జరిగింది. తెలుగు మాట్లాడకపోతే సంపూర్ణ మనుగడ ఉండదని, ప్రాణం వున్నా జీవం లేనట్లేనని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. తెలుగు వాడు తెలుగు మాట్లాడితే తెలుగు బతుకుతుందని ఆయన స్పష్టం చేశారు. పాలనా భాష తెలుగులోనే ఉండాలని, పథకాలకు తెలుగు పేర్లు పెట్టాలని ఆయన సూచించారు. అందమైన తెలుగు భాష ఆత్మ సింధువులాంటిదని అభివర్ణించారు. మాతృ దేశాన్ని, మాతృ భూమిని, మాతృ భాషను ప్రేమించకుంటే బతికివున్నా చనిపోయినట్లే అని ఆయన అన్నారు.

**- పరిపాలన భాష తెలుగులోనే ఉండాలి**
**- శుభలేఖలు తెలుగులోనే అచ్చు వేయించాలి**
**- తెలుగు వారు తెలుగులోనే మాట్లాడుకోవాలి**
**- పుష్ప గుచ్ఛాలు వద్దు పుస్తకం బహుమతిగా ఇవ్వండి**
**- కట్టు బొట్టు తెలుగు సంప్రదాయాలు కొనసాగించాలి**

తెలుగు పాఠశాల వీధి బడిలో చదువుకునే తాను ఉప రాష్ట్రపతి అయ్యానని, మాతృ భాషలో చదివిన వారే అత్యున్నత స్థానాల్లో ఉన్నారని, అందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ తాజా నిదర్శనమని వెంకయ్య నాయుడు వివరించారు. ఇంట్లో వీధిలో గుడిలో బడిలో అమ్మ భాష తెలుగు లోనే మాట్లాడుకోవాలని, భాష పోతే శ్వాస పోయినట్లేనని ఆయన చెప్పారు. భాష కోసం ఉద్యమించాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరు తెలుగు లోనే మాట్లాడితే భాషాభివృద్ధి జరుగుతుందన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం కవులు కళాకారులు కృషి చేయాలని, మాతృ భాషను గౌరవించాలని కోరారు. పరాయి భాషను ద్వేషించక్కర లేదని, ప్రభుత్వం ఉత్తర్వులు మాతృ భాషలోనే ఉండాల్సిన అవసరం ఉందన్నారు. డా. గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ సమాపనోత్సవ సభలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఎమ్మెల్యే రవి కుమార్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, బాలకోటయ్య, బిజెపి అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, నటుడు సాయి కుమార్, మా శర్మ, దవేజీ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు. బోధన్ కు చెందిన ఫాతిమా భగవద్గితను ఐదు భాషల్లోకి అనువదించగా ఆ గ్రంథాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. తెలుగుదేలయన్న దేశం తెలుగు అంటూ గుమ్మడి గోపాలకృష్ణ పద్యగానంతో ఉర్రూతలూగించారు. నటుడు సాయి కుమార్ ను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. రెడ్ క్రాస్ చైర్మన్ వై. డి. రామారావు, సోమంచి విజయ్ కుమార్ లను సత్కరించారు.

## మానవీయ విలువలు, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి

**- గోవా గవర్నర్ పూసపాటి అశోక గజపతి రాజు**




**విజయవాడ,జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** మానవీయ విలువలు, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని గోవా గవర్నర్ పూసపాటి అశోక గజపతి రాజు ప్రపంచ తెలుగు మహాసభల్లో మాట్లాడుతూ , భావి తరాలకు సరైన దిశలో అందించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాష పరి వ్యాప్తి, రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత గా భావించాలని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక యుగంలో కొత్తదనాన్ని స్వాగతిస్తూనే విలువలు సంప్రదాయాలు కాపాడుకోవాలని, ముందుకు తీసుకెళ్లాలని కోరారు. తెలుగు ఖ్యాతిని దేశవిదేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని కొనియాడారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ ద్వారానే సామాన్యులైన ఎంతోమంది రాజకీయాల్లోకి రాగలిగారని, 25 ఏళ్ల వయసులో తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి నేడు సభాపతి స్థానంలో కూర్చునేలా చేసింది ఎన్టీఆరేనని భావోద్వేగంతో పేర్కొన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసంలో మాతృభాష ఆవశ్యకతను ఉందన్నారు., మాతృభాషపై మమకారం అందరికి ఉండాలన్నారు,.ఇంగ్లీష్ కోసం తెలుగును వదులుకోవద్దన్నారు. మాతృభాషపై పట్టు ఉంటే ఏ భాషనైరా అర్థం చేసుకోవచ్చునన్నారు.ఆయనను సభావేదికపై సీఎం చంద్రబాబు,మహాసభల నిర్వాహకులు గజల్ శ్రీనివాస్,స్పీకరు అయ్యన్న పాత్రుడు ఘనంగా సత్కరించారు.

## తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణే మనందరి బాధ్యత

**- పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి కావాలి - అమ్మనాన్న పిలుపులోని మాధుర్యం మమ్మీ, డాడీలో ఉండదు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**విజయవాడ,జనవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాషను పరిరక్షి ంచుకోవడం, మన సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించడం ప్రతి తెలుగువాడి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. గుంటూరు వేదికగా మూడు రోజుల పాటు అట్టహాసంగా సాగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఈ మహాసభల వేదికకు స్వర్గీయ ఖినందమూరి తారక రామారావుఖి గారి పేరు పెట్టడంపై స్పీకర్ హర్షం వ్యక్తం చేశారు. విశ్వవ్యాప్తంగా తెలుగువాడి గొప్పతనాన్ని చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు గారి సమక్షంలోనూ తెలుగువారి ఆత్మగౌరవం విషయంలో ఎన్టీఆర్ రాజీపడలేదని, పార్టీ పేరులోనే ఖితెలుగుఖిను పెట్టుకున్న మహోన్నత వ్యక్తి అని స్పీకర్ గారు ప్రశంసించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పరభాషా వ్యామోహంలో పడి మాతృభాషకు దూరమవుతున్నారని స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు.అమ్మనాన్న అనే పిలుపులో ఉన్న మాధుర్యం, ఆప్యాయత.మమ్మీడాడీ అనే పిలుపుల్లో ఉండదని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. ఇంట్లో పిల్లలతో తెలుగులోనే మాట్లాడాలని, భోజన సమయంలో సెల్ ఫోన్లను పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో గడపాలని హితవు పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి వంటి పండుగల ప్రాభవం తగ్గుతుండడం, మన తెలుగు సంవత్సరాదిని మర్చిపోయి డిసెంబర్ 31 వేడుకలకు ప్రాధాన్యత ఇవ్వడం విచారకరమన్నారు. అలాగే కనుమరుగవుతున్న సత్యహరిశ్చంద్ర, రామాంజనేయ యుద్ధం వంటి పద్య నాటకాలను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, కాన్వెంట్ అనే తేడా లేకుండా ప్రతి పాఠశాలలో తెలుగు భాషను తప్పనిసరి పాఠ్యాంశం చేయాలని స్పీకర్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, యోగా, ఎన్.సి.సి, రెడ్ క్రాస్ వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సుమారు 35 - 40 దేశాల నుండి ప్రతినిధులను రప్పించి, ఈ మహాసభలను విజయవంతం చేసిన నిర్వాహకులు గజల్ శ్రీనివాస్, వారి బృందాన్ని స్పీకర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా అమరావతి గీతాలాపన నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.

# విద్యుదుత్పత్తిలో జెన్‌కో రికార్డు 6,009 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

## ఇంజినీర్లు, అధికారులకు సిఎం అభినందనలు



**విజయవాడ,జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థ ఏపీ జెన్‌కో ఉత్పత్తిలో చరిత్ర సృష్టించింది. రికార్డులను తిరగరాసిన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన కీలక సమాచారాన్ని వెల్లడించింది థర్మల్ ప్లాంట్ల ద్వారా 5,828 మెగావాట్లు, జల విద్యుత్ ద్వారా 181 మెగావాట్లు మొత్తం 6,009 మెగావాట్లను ఉత్పత్తి చేసింది. ఉత్పత్తి సామర్థం పెరగడం వల్ల గతంతో పోలిస్తే రోజుకు సుమారు 1,500 మెగావాట్ల విద్యుత్ థర్మల్ ప్లాంట్ల ద్వారా గ్రిడ్‌కు అదనంగా అందుతోందని అధికారులు తెలిపారు. నాణ్యమైన బొగ్గు వినియోగం ఫలితాలను ఇస్తోందన్నారు. ఏపీ జెన్‌కో, ఏపీ విద్యుత్ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (ఏపీపీడీసీఎల్)లకు విజయవాడ, కడప, నెల్లూరు జిల్లాల్లో 6,610 మెగావాట్ల స్థాపిత సామర్థం ఉన్న థర్మల్ యూనిట్లు ఉన్నాయి. వాటిద్వారా గతంలో 4 వేల మెగావాట్ల ఉత్పత్తే కష్టమయ్యేది. ప్రస్తుతం 5,828 మెగావాట్ల ఉత్పత్తి గ్రిడ్‌కు అందుతోంది. ప్లాంట్ల స్థాపిత సామర్థంలో సగటున 88.79 శాతం ఉత్పత్తి వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని కారణంగా జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం తక్కువ. ఈ పరిస్థితుల్లోనూ మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టు నుంచి 120 మెగావాట్లు, నాగార్జునసాగర్ కుడికాలువ పంప్ హౌస్ ద్వారా 40 మెగావాట్లు, హంపి పవర్ హౌస్ ద్వారా 14 మెగావాట్ల విద్యుత్ గ్రిడ్‌కు అందింది. జెన్‌కో థర్మల్ కేంద్రాల ఉత్పత్తి సామర్థం పెరగడం వల్ల సుమారు 50 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ అదనంగా డిస్కంలకు అందుబాటులోకి వస్తుందని అంచనా. ఆ మేరకు పీక్ డిమాండ్ వేళల్లో విద్యుత్ అందుబాటులోకి వస్తోంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లు తగ్గాయి. 2024 25లో బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.3 వేల కోట్ల విలువైన విద్యుత్‌ను డిస్కంలు అధిక ధరకు కొన్నాయి. విద్యుత్‌కు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి యూనిట్‌కు గరిష్ఠంగా రూ.10 చొప్పున ఖర్చు చేశాయి. ముందస్తు ఒప్పందాల ద్వారా యూనిట్‌ను సగటున రూ.15కు కొన్నాయి.

## తెలుగు భాషలో పరిపూర్ణ జ్ఞానం సాధిస్తే ఏ భాషనైనా సునాయాసంగా అభ్యసించవచ్చు

**- కేంద్రగ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**



**విజయవాడ, జనవరి5 ,ప్రభాతవార్తప్రతినిధి :** తెలుగు భాషలో పరిపూర్ణ జ్ఞానం సాధిస్తే ఏ భాషనైనా సునాయా సం అభ్యసించ వచ్చునని గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మాతృభాష మాత్రమే అన్ని భాషలపై ఆసక్తిని పెంచుతుందన్నారు.మాట్లాడటం వచ్చినప్పుడే అధ్యయనం సాధ్యమన్నారు.ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ సాంప్రదాయ సంగీత రూపాలను గ్రంథాలను తెలుసుకునేందుకు తెలుగు భాష తలుపులు ఎప్పుడూ తెరుచుకునే వుంటాయని, తెలుగును ఇంటి నుంచే కాపాడుకోవాలని కోరారు. అమెరికాలో వున్న తాను మూలాలను మరచిపోలేదు, భాషను మరచిపోలేదని చెప్పారు. ఎవరైనా తెలుగు భాషను మరచిపోవడం ముమ్మాటికీ తప్పు అని ఆయన అన్నారు. తల్లిదండ్రులు తొలి గురువులుగా తెలుగు భాష పిల్లలకు నేర్పించాలని సూచించారు. కంప్యూటర్ యుగంలో తెలుగు మరచిపోకుండా ఒక ఉద్యమం లా కృషి చేసి తెలుగు భాష వ్యాప్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తల్లి పాల భాషను ఎన్నటికి మరువకూడదన్నారు.,ప్రపంచం నలుగు చెరుగుల ఉన్న తెలుగువారిని గుంటూరుకు రప్పించిన గజల్ శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు.

# తిరుమల సమాచారం

## 15నుండి తిరుమల ఆలయంలో సుప్రభాతసేవ



**తిరుమల,జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ తెల్లవారుజామున 2.30గంటలకు దేవదేవుడిని నిద్రనుండి మేల్కొలిపేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే సుప్రభాతసేవ తిరిగి ఈనెల 15వతేదీ గురువారం నుండి పున:ప్రారంభంకానుంది. ధనుర్మాసం ఘడియలు 14వతేదీతో అర్ధరాత్రితో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో 15వతేదీ కనుమపర్వదినంనుండి ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యా ప్రవర్తతే"అనే నామం వినిపించనుంది. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభంతో వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు.

## 16న పార్వేట ఉత్సవం.. అడవిలో వేటకు వెంకన్న



**తిరుమల,జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ మరుసటిరోజు కనుమ పండుగనాడు సాంప్రదాయాలను పాటిస్తూ వడ్డీకాసుల శ్రీవేంకటేశ్వరస్వామి అడవిలో వేటాడటం ఆనవాయితీ. 16వతేదీ శుక్రవారం మధ్యాహ్నం నిత్యకైంకర్యాలు ముగించుకున్న తరువాత శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామివారు. శ్రీకృష్ణ స్వామి వేర్వేరు పల్లకీలపై ఛత్రచామర మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పార్వేటమండపం వెళతారు. అక్కడ ఆలయ అర్చకులు, అధికారులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆస్థానం నిర్వహిస్తారు. వైకుంఠం నుండి భూలోకానికి వచ్చిన శ్రీనివాసుడు కనుమపండుగ రోజు వేటాడటం పరిపాటి. ఈ సాంప్రదాయాన్ని టిటిడి అధికారులు పాటిస్తూ తిరుమలలో పార్వేటమండపం అటవీప్రాంతంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన అడవిజంతువుల ప్రతిమలను ఈటెలతో వేటాడటం ,అర్చకులు మూడుసార్లు ముందుకు వెళ్లి వెనక్కువచ్చి బాణాలు వేయడం కనువిందు చేస్తుంది.

## టిటిడి భూములు, స్థలాలు ఆస్తులపై ఖచ్చితమైన రికార్డులు

**- తిరువాభరణాల రిజిస్టర్లు డిజిటలైజ్ : టిటిడి ఇఒ ఎకె సింఘాల్**



**తిరుమల,జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంకు సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న భూములు, స్థలాలు, ఇతర ఆస్తులపై స్థిరమైన ,ఖచ్చితమైన రికార్డులు రూపొందించాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ అధికారులను ఆదేశించారు. ఇందుకు నిపుణుల సహకారం తీసుకోవాలని సూచించారు.తిరుమల ఆలయంతోబాటు టిటిడి ఆలయాల్లోని తిరువాభరణాల రిజిష్టర్లను డిజిటలైజ్ చేసి డాక్యుమెంట్లను రూపొందించాలన్నారు. దేశవ్యాప్తంగా టిటిడి కల్యాణమండపాలు ఆదరణలో ఉన్నవి ఎన్ని, ఆదరణలోలేనివి ఎన్ని అనే వివరాలతోబాటు ఆధునీకరించబడిన వాటి వివరాలను సిద్ధం చేయాలన్నారు. భక్తులు సౌకర్యవంతంగా వినియోగించుకోవడానికి సమగ్ర విధానాన్ని రూపొందించి టిటిడి బోర్డు సమావేశంలో నివేదించాలని తిరుపతి జెఇఒ వీరబ్రహ్మంను ఆదేశించారు. సోమవారం టిటిడి పరిపాలన భవనంలో జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిఇ టివి సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి,డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, డిప్యూటీ ఇఒలు తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ సింఘాల్ మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన టిటిడి కల్యాణమండపాల నిర్వహణపై సమగ్ర నివేదికను రూపొందించాలని ఆదేశించారు. టిటిడిలో అన్ని విభాగాల్లో మౌళిక వసతులకు సంబంధించి టూల్స్,ప్లానింగ్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. తిరుమల,తిరుపతిలోని వసతి గృహాలలో ఎఫ్ఎంఎస్ సేవలకు సంబంధించి ఇప్పటికే ఉన్న యాప్‌ను భక్తులకు మరింతగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. భక్తులు యాప్‌ను సులభంగా డౌన్‌లోడ్ చేసుకునేలా క్యూఆర్‌కోడ్‌ను ఏర్పాటుచేసి, తమ అభిప్రాయాలను స్వయంగా నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టిటిడి వసతి గృహాలలో ఫెసిలిటి మేనేజ్‌మెంట్ సేవలను మరింత మెరుగుపరచి,భక్తులలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. టిటిడి అనుబంధ ఆలయాల్లో భక్తులకు దర్శన టిక్కెట్లు, ఆర్జితసేవలల్లో పాల్గొనే భక్తుల బహుమానాల జారీకి టిక్కెట్ స్కానింగ్ సదుపాయం కల్పించాలన్నారు.ఇంజనీరింగ్ విభాగంలో గుత్తేదారులకు సకాలంలో చెల్లింపులు చేపట్టాలని, టిటిడి వేదపాఠశాలల్లో బోధన సిబ్బందిని భర్తీచేయాలని ఇఒ సింఘాల్ ఆదేశించారు.

# తెలుగు కమ్మదనాన్ని పరిమళించిన అక్షరాల ఝురి

**- ప్రపంచ తెలుగు మహాసభలో ఆకట్టుకున్న కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, కళా సాంస్కృతిక ప్రదర్శనలు**
**- ఆకట్టుకున్న కోకా విజయలక్ష్మి శిష్య బృందం ప్రదర్శించిన తెలుగు తల్లి నృత్య రూపకం**

### తెలుగుమహాసభల్లో కవితాగానం, సాహిత్య ప్రసంగాలు చేసిన కవయిత్రులు



**విజయవాడ,జనవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాషా ఔనతిని వివరిస్తూ, తెలుగు కమ్మదనాన్ని వివరిస్తూ గుంటూరు శ్రీసత్యసాయి నగరం మూడు రోజులుగా ఆంధ్రసారసత్వపరిష్ ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగుమహాసభలు జరుగుతున్నాయి.ఇక్కడ మూడు రోజులు కవితా అక్షర పరిమిళాల కవి ఝురి ప్రవహిస్తుంది. సుప్రసిద్ధ సాహితీవేత్త కలిమిశ్రీ.రచయిత్రులు త్సవటల్లి నీరజాచంద్రాన్ సమన్వయంలో కవి సమ్మేళనాలు జరుగుతున్నాయి.ప్రకృతి, వ్యక్తిత్వ వికాసం, సమాజ అసమానతలు, విద్య, మహిళల జీవితం, సనాతన ధర్మం, కాలుష్య పోకడలు ఇలా అన్ని రంగాలనూ స్పృశిస్తూ మనసులోని భావాలకు అక్షర రూపమిస్తూ సాహిత్యంలో యువ రక్తం పరవళ్లు తొక్కుతోంది. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలు వేదికగా యువ కవులు, కవయిత్రులు, కవిత్వాలు, రచయితలు తమ రచనలను చెప్పారు. ఈ సందర్భంగా కొందరు తమ భావాలను పంచుకున్నారు.విజయవాడ వాసి పుచ్చా చిన్మయి. ఇంటర్ రెండో ఏడాది చదువుతుంది. చిన్మయి తల్లిదండ్రులు చిన్నప్పటీ నుంచీ పుస్తకాల్ని చదివించేవారు. అలా తెలుగుపై ఇష్టం ఏర్పడేలా చేశారు. బాలభారతం, నీతికథలు ఎక్కువగా చదువుతుంది. కవిత్వం రాస్తుంది. 9వ తరగతిలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం బాలప్రతిభా పురస్కారం అందించింది. చేప జీవితాన్ని స్పృశిస్తూ రాసిన ˘గాజు గదిల్లో కవిత్వం చిన్మయికి మంచి గుర్తింపును తెచ్చింది. విద్యావ్యవస్థలోని లోపాలపై˘బాల ఖైద్తీ, కాలుష్యంపై˘ప్రకృతి బ్రహ్మ కవిత్వాలను రాసింది. ఆడపిల్ల జీవితంలోని ఒడుదొడుకులు, ఎంచుకున్న రంగంలో విజయం సాధించేందుకు పడే తపనపై నవల రాయాలనుకుంటుంది. ఇన్ఫోసిస్‌నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి జీవితం తనకు స్ఫూర్తి అని చెబుతోంది. శ్రీకాకుళం జిల్లా వాసి ఎచ్చెర్ల పి.హిమలక్ష్మి ్మ. కవయిత్రిగా తొలిసారి తెలుగు మహాసభల్లో పాల్గొంది. మొదటిసారి కవిత్వాన్ని వినిపించడం ఆనందాన్ని ఇచ్చిందని హర్షం వక్తం చేస్తుంది. ˘ప్రకృతి నా నేస్తం అన్తే కవిత్వాన్ని వినిపించింది. చిన్నతనం నుంచి తెలుగన్నా, ప్రకృతి అన్నా ఎంతో ఇష్టమని చెబుతోంది. ఇదే నన్ను సాహిత్యం వైపు నడిపించిందని హిమలక్ష్మి ్మ తెలిపింది. పరిసరాల్ని చూస్తూ ఆరాధిస్తూ కవితలు రాస్తోంది. ఇప్పటిదాకా 150 వచన కవిత్వాలు రాసింది. తిరుపతి వాసి కె.నవీన్ కుమార్, తిరుపతిలో నిర్వహించిన తెలుగు మహాసభలకు తొలిసారి విద్యార్థిగా హాజం˘య్యారు. అప్పుడే నవీన్ కుమార్‌కు కవి సమ్మేళనంలోని శ్రీశ్రీ కవిత్వం గురించి తెలిసింది. ఆయన రాసిన రచనలపై ఇష్టం ఏర్పడింది. మహాప్రస్థానమ్తి చదివాను. అందులోని ప్రతి పదమూ నా మనసుకు హత్తుకుంది. అప్పటి నుంచి సాహిత్యం వైపు అడుగులు వేశాను అని నవీన్ కుమార్ తెలిపారు. ఆలయాల గొప్పతనాన్ని వివరిస్తూ రాసిన ˘పంచాక్షర్తి కవిత్వంతో ఎంతో గుర్తింపు వచ్చింది. తెలుగు గొప్పతనాన్ని వివరిస్తూ˘అమ్మ నేర్పిన మొదటి అమ్మ తెలుగ్తు కవిత్వాన్ని చెప్పాను అని అన్నారు. చిర్యాలకు చెందిన కాపురపు రవికుమార్. ఎంబీఏ పూర్తి చేశారు.˘విరాగ్తి కలం పేరుతో రచనలు రాస్తున్నారు. పదో తరగతిలో తెలుగు మాస్టారు చెప్పిన గుర్రం జాషువా పద్యాలు సాహిత్యంపై ఇష్టాన్ని పెంచాయని చెబుతున్నారు.

## రాయలసీమ ద్రోహి జగన్ : మంత్రి నిమ్మల రామానాయుడు మండిపాటు



**విజయవాడ, జనవరి 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర చరిత్రలో రాయలసీమ ప్రాంతానికి ఏ ముఖ్యమంత్రి చేయని రీతిలో జగన్ ద్రోహం చేశారని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుఆరోపించారు .తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతలపై చేసిన వ్యాఖ్యలు ఏపీలో వేడెక్కాయి.రేవంత్ వ్యాఖ్యల్లో నిజం లేదని ఏపీ ప్రభుత్వం ఇదివరకే పేర్కొందని మంత్రి రామానాయుడు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ సీఎం జగన్ వల్లే రాయలసీమ ఎత్తిపోతల పథకంపై స్టే ఆర్డర్ వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని వినియోగించుకుంటున్నప్పుడు, దిగువన ఉన్న పోలవరం ప్రాజెక్టు నుండి ఆంధ్రప్రదేశ్ సైతం నీటిని వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. గోడవలు వద్దు.. మాకు నీళ్లే కావాలి.. అమరావతిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూని జాయితీకి, నిలకడకు, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం ఏపీ సీఎం చంద్రబాబు అని ఆయన కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మీడియా సంస్థల్లో ఎన్ని అబద్ధాలు అచ్చేసినా, రాష్ట్ర ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ నేతల వివాదాలను ఆంధ్రప్రదేశ్‌లోకి చొప్పించి, తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అవివేకమని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. గోదావరి నది నుండి ఏటా 3,000 టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలుస్తుంటే, అందులో 200 టీఎంసీల నీటిని వినియోగించుకుంటే అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు.




అలలకు భయపడితే ఎప్పటికీ నదిని దాటలేం... ప్రయత్నించే వాళ్ల ఎప్పుడూ విఫలం కాలేదు.... ఈ సామెతను జాస్మర్, పరమ్‌జీత్

# మహిళా ఉపాధిలో మేటి !

దంపతులు నిజమని నిరూపించారు. ఉపాధి కోసం శ్మశానంలో శవాలను దహనం చేసి ఈ జంట వర్మీ కంపోస్ట్ తయారుచేస్తూ ఏడాదికి రూ.50లక్షల టర్నోవర్ సాధిస్తున్నారు.

ఒక మహిళ తీసుకున్న చిన్న నిర్ణయం కూడా కొన్నిసార్లు పెద్ద మార్పునకు ఉంది కదా! అదే పరమ్‌జీత్ విషయంలో జరిగింది. తన కుటుంబం కోసం తీసుకున్న నిర్ణయం వారి జీవితాలతో పాటు తన గ్రామంలోని మహిళల జీవితాల్లోనూ మార్పు తీసుకొచ్చింది. పరమ్ జీత్, జాస్మర్ హరియాణాలోని కురుక్షేత్ర జిల్లాలో ఖాన్పూర్ రోరాన్ గ్రామం. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం. కడుపు నిండాలంటే కూలీకి వెళ్లాల్సిందే. పని దొరికితే ఆ పూటకి కడుపునిండు తుంది. లేదంటే పస్తులుండాల్సిందే. అందుకే పరమ్ జీత్ భర్త జాస్మర్ తోటపని దగ్గర నుంచి చెప్పులు కుట్టడం వరకూ అన్నీ చేశారు. చివరికి ఏ పని లేకపోవడంతో ఏడాదిపాటు శ్మశానంలో కాటికాపరిగా చేశాడు. భర్త కష్టాన్ని పంచుకోవాలనుకున్నది పరమ్‌జీత్, వ్యాపారం మొదలు పెట్టాలనుకున్నా అప్పుడే వర్మీకంపోస్ట్ తయారు చేయాలనుకున్నా. ఎందుకంటే మాకు పశువులున్నాయి. వాటిని మా ఊళ్లో భూస్వాములు ఉచితంగా తీసుకెళ్లేవారు. నేను దాన్నే నా ఆదాయంగా మార్చుకోవాలనుకున్నా. ఇందు కోసం మహారాష్ట్రలోని నేషనల్ డెయిరీ రీసర్చ్ శిక్షణ తీసుకున్నాను. తర్వాత కురుక్షేత్రలో మావారు, నేను కలిసి వర్మీ కంపోస్ట్ తయారీ మొదలు పెట్టాం. దీనివల్ల లాభం ఉండదు... అంటూ చుట్టుపక్కల వాళ్లు అనేవారు. గ్రామం మొత్తం మమ్మల్ని చూసి నవ్వింది. అయినా మేము వెనక్కి తగ్గలేదు. దాదాపు ఆరుసంవత్సరాలు ఆదాయం రాలేదు. ఓర్పుతో ఎదురు చూశాం. ఒకరోజు మా కష్టానికి ఫలితం దక్కింది. మొదటి ఆర్డర్ వచ్చింది. పదకొండేళ్ల క్రితం మొదలు పెట్టిన ఈ వ్యాపారం దాదాపు పది రాష్ట్రాల్లో విస్తరించింది. తయారీ పనులు నేను చూసుకుంటా. విక్రయాలు మావారు చూసుకుంటారు. ఇప్పుడు పదిమంది మహిళలకు ఉపాధి కల్పించగలుగుతున్నాం. కొంతమంది మా దగ్గర శిక్షణ తీసుకోవడానికి వస్తున్నారు అంటారీమె. □



# కళ్ల కింద నలుపా.. తగ్గిద్దామిలా!

సమస్య చిన్నదైనా, పెద్దదైనా పరే.. కాస్త ఆలోచించడం మొదలుపెడితే ఓ పట్టాన నిద్రరాదు. ఇలా ఒకటి రెండు రాత్రులు సరిగా విద్రపోకపోతే చాలు... కళ్ల కింద నల్లటి వలయాలు వస్తాయి. ఇదే కాదు, ఒక్కోసారి పోషకాహార లేమి కూడా దీనికి కారణం కావొచ్చు. కానీ, ఒకసారి వస్తే మాత్రం ఓ పట్టాన తగ్గుముఖం పట్టవు. ఇలాంటప్పుడు సులువుగా పోయే ఈ సహజ చిట్కాలు పాటించండి. మీ సమస్య పరిష్కారం కావొచ్చు.



**బాదం నూనె:** విటమిన్‌క ఎక్కువగా ఉండే బాదం నూనె యాంటిల్ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేసి కళ్లకింద వాపు తగ్గుతుంది. క్రమంగా చర్మ రంగునీ మెరుగుపర ుస్తుంది. అందుకే రోజూ నిద్రపోయే ముందు.... రెండు చుక్కలురాసి మృదువుగా రెండు మూడు నిమిషాలైనా మర్దన చేయండి చాలు. ఫలితం కనిపిస్తుంది.

**టొమాటో,** నల్లటి వలయాల్ని తగ్గించే గుణం టొమాటోలకు ఉంది. సమాన పరిమాణంలో నిమ్మరసం, టొమాటో గుజ్జుని తీసుకుని కలుపు కోవాలి. ఈ రసాన్ని కళ్లకింద రాసుకుంటే నల్లటి వలయాలు దూరమవు తాయి. ఇలా రోజుకి రెండు సార్లు చేయగలిగితే మంచి ఫలితం కనిపిస్తుంది

**బ్యాగులు:** వాడేసిన టీ బ్యాగులను మరోసారి గోరువెచ్చని నీళ్లలో ముంచి తీసి వాటిని మూసిన కళ్లపై ఉంచుకోవాలి. ఇలా చేయడం వల్ల వాపు తగ్గుతుంది. నల్లటి వలయాలు దూరమవుతాయి. హాయిగానూ నిద్రపోవచ్చు. ఇలానే కీరదోస ముక్కల్ని ఉంచుకున్నా ఇన్‌స్టంట్‌గా ఉపశమనం లభిస్తుంది. □

# తిరుప్పావై

## 22వ పాశురము



అంగణ్ మా జ్ఞాలత్తరశర్:
అభిమాన బంగమాయ్
వన్దు నిన్ పళ్ళిక్కట్టి ట్కీళే
శంగ మిరుప్పార్ పోల్ వద్దు
తలై ప్పెయిదోమ్
కింగిణివాయ్ చ్చెయ్
తామరైప్పూప్పోలే
శెంగణ్ శిఱిచ్చిఱిదే యేమ్మేల్
విళియావో తింగకు
మాదిత్తియను మెఱున్దాట్పోల్
అంగణిరండుంగొ ణ్ణంగళ్ మేల్
నొక్కుతియేల్
ఎంగళ్మేల్ శాబమిళిన్దేలో
రెమ్బావాయ్

సుందరమైన, విశాలమైన ప్రదేశములను ఏలు తున్న, ఎంతోమంది రాజులు తమకంటే గొప్పవారు లేరని అహంకారమును వీడి, తాము జయించిన సార్వభౌముని సింహాసనము క్రింద సమూహాములు చేరినట్లు, మేము కూడా నీ సింహాసనము క్రింద గుంపులు గుంపులుగా చేరి నాము. గోపికలు కృష్ణునితో అంటున్నారు. చిరుగంట ముఖ మువలె విడియున్న తామరపూలను పోలిన, వాత్సల్యముతో ఎర్రగానున్న, నీ కనులను మెలమెల్లగా విచ్చి మాపై ప్రసరిం పచేయుము.సూర్యచంద్రులు ఆకాశములో ఒకేసారి కనబడితే ఎంత ఆనందంలో, ఆ అండముగల నీ రెండు నేత్రములు మాపై పడినట్లు ఉండును. అప్పుడు ఏవైన శాపము లంటే అవి తొలగిపోతాయని వెలుపలి గోపికలు కృష్ణునితో చెపుతున్నారు.

ఫలం: "అహంకారం నశిస్తుంది"

# గుడ్లు ఉడికిన నీళ్లు పారబోస్తున్నారా?



గుడ్లు కుక్కర్లో అయితే రాళ్లలా అవుతాయి కనుక.. విడిగానే ఉడకబెడతాం. తర్వాత ఆ నీళ్లను పారబోస్తాం కదా కానీ అలా వృథా చేయొద్దంటున్నారు పరిశోధకులు.

ఎందుకంటే.. జిడ్డు పేరుకున్న వంటింటి గట్టు, గోడలను ఈ నీటితో శుభ్రం చేస్తే మకిలి త్వరగా వదులుతుంది. గుడ్డు పెంకులో క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ విస్తారంగా ఉంటాయి. అందువల్ల గుడ్లు ఉడికించిన నీళ్ల చల్లారాక.. మట్టిలో పోస్తే నేలవంట. ఈ నీళ్లతో మొక్కలు బలంగా పెరుగుతాయి. ఈ నీటిని తలకు పట్టించి అరగంట తలస్నానం చేస్తే కుదుళ్ల బలపడతాయి. జుట్టు రాలేదు. గుడ్డుతో పాటు డొల్ల కూడా మేలుచేస్తుందని తెలిశాక ఇక పడేయలేం కదా? టాగ్లు: వనరావాసం. సోషల్ మీడియా తెస్తో ప్రయత్నించాలి ప్రతర కుంగువాలుతో బాధ తల్లులు తన పిల్లలతో సంతోషంగా గడపలేకపోతున్నారు. □

# పిల్లలకు అతి పొగడ్త వద్దు..


**ఇంటికెవరైనా వస్తే చాలు. తన పిల్లలిద్దరినీ పొగడటం మొదలుపెట్టి ఆ వచ్చినవాళ్లకు బోర్కొట్టిస్తుంది రమ్య. ఇలా అతిగా పొగడటం మంచిది కాదంటున్నారు నిపుణులు. మన పొగడ్త పిల్లల భవిష్యత్తుకు ప్రయోజనకరంగా ఉంటే చాలంటున్నారు.**

పిల్లల ఆత్మగౌరవాన్ని పెంచి, వారిలో మంచి ప్రవర్తన రావడానికి ప్రోత్సహించేలా ప్రశంసించాలి. వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి ఉపయోగపడేలా పొగడ్త ఉండాలి. ఇది పరిమితంగా ఉంటేనే మంచిది. మంచి ప్రవర్తన, సమయాన్ని వృథా చేయకుండా వినియోగించు కోవడమెలాగో తెలుసుకున్నప్పుడు, స్వీయ క్రమశిక్షణ కనిపించినప్పుడు పిల్లలకు ప్రశంస అందించే తీరాలి. అలాగే సహాయగుణం, ఇతరులను చూసి జాలిపడటం వంటివి కూడా ప్రశంసాత్మకమైనవి. అంతేకాదు, తన పనిమాత్రమే కాకుండా ఇతరుల పని పూర్తి కావడానికి కూడా కృషి చేయడం వంటివి పిల్లల్లో కనిపించే మంచి లక్షణాలు, ఇటువంటి సందర్భాల్లో వాళ్లను పొగడ్తతో మరింత ప్రోత్సహించాలి. ఇవన్నీ వారిలో మరిన్ని మంచి లక్షణాలు నేర్చుకోవడానికి పురిగొల్పుతాయి. పిల్లలను పొగిడేటప్పుడు అందులో నిజాయతీ ఉండాలి. ప్రశంసించేటప్పుడు అది నిజమా కాదా అని పెద్దవాళ్ల బాడీ లాంగ్వేజ్ పిల్లలు గుర్తించగలరు. ఆ సమయంలో వాళ్లకు అపనమ్మకాన్ని కలిగించకూడదు. పిల్లల్లో ఆత్మగౌరవాన్ని నింపడం మాట అటుంచి, పూర్తిగా మంచి పనులు పాచేయడానికి అయిష్టతను పెంచినవాళ్లం అవుతాం. అలాగే వ్యంగ్యంగానూ పిల్లలను ప్రశంసించకూడదు. పిల్లలు సాధించే చిన్నచిన్న విజయాలను పొగుడుతూనే, భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలను చేరాలనే అభిలాషను తెలియ జేయాలి. అలాగే పొగుడుతూనే వారు సాదించగలిగే స్థాయిలో మాత్రమే ప్రోత్సహించాలి. లేదంటే భవిష్యత్తులో, తల్లిదండ్రుల ఆశయా లను అందుకోలే నప్పుడు పిల్లలు కుంగుబాటుకు లోనయ్యే ప్రమాదం ఉంది.

**మితంగా..** చిన్నారులు చేసే చిన్నచిన్న పనులను ప్రశంసించాలి. అలాగని అతిగానూ చేయకూడదు. దేనికైనా మితంగా పొగుడు తూనే వారిలో ఉత్సాహాన్ని నింపాలి. అలాగే తమ పనులను తాము పూర్తిచేసుకోవడమెలాగో నేర్చుకుంటున్న స్థాయిలోనే నిన్ను మించినవాడు లేడంటూ పొగిడితే అక్కడితోనే ఆగిపోతాడు. అలాగే మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడు పక్కవారికన్నా ఎక్కువ తెచ్చుకున్నందుకు అద్భుతం అంటూ ప్రశంసించకూడదు. □



ఎం. హారతి
మంగళంపాడు
నెల్లూరు జిల్లా



14 చుక్కలు 2 వరుసలు 2 వరకు సరి చుక్కల



**ముగ్గులకు ఆహ్వానం:** మా చిరునామా:
ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

# తెర

# 'నారీ నారీ నడుమ మురారి' నవ్వులు పూయిస్తుంది: -అనిల్ సుంకర



**సంక్రాంతికి గట్టి పోటీ ఉంది కదా? ముందు నుంచే సంక్రాంతి సినిమాగానే రూపొందించారా?**

సంక్రాంతికి సరిపడే మూవీగానే ˊనారీ నారీ నడుమ మురార్థిని రూపొందించాం. ఇదొక పండుగ మూవీ. సినిమాలకు సంక్రాంతి సీజన్ అనేది వర్కౌట్ అవుతుంది.

**నారీ నారీ నడుమ మురార్థి ఎలా ఉండబోతోంది?**

ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రమిది. థియేటర్లో కూర్చున్నంత సేపు ఆడియెన్స్‌ని నవ్విస్తాం. బాలయ్య గారితోనే మా టైటిల్‌ను ఓపెన్ చేయించాం.

**రిలీజ్ గురించి, డిస్ట్రిబ్యూషన్ గురించి చెప్పండి?**

మా మూవీని నైజాం, వైజాగ్‌లో దిల్ రాజు గారు రిలీజ్ చేస్తున్నారు. ఈస్ట్‌లో సొంతంగా చేస్తున్నాం. వెస్ట్, కృష్ణా, గుంటూరులో రాజా, సీడెడ్‌లో శోభన్ రిలీజ్ చేస్తున్నారు.

**సామజవరగమన్థ టైంలోనే డైరెక్టర్‌తో ఈ మూవీని కమిట్ అయ్యారా?**

ˊసామజవరగమన్థ చేసే టైంలోనే రామ్ అబ్బరాజుతో కమిట్ అయ్యాం. రామ్ అబ్బరాజు నెక్స్ట్ మూవీ కోసం మైత్రి వద్దకు పంపించాను.

**ప్రస్తుతం మీరు ఎలాంటి చిత్రాల్ని నిర్మించాలని అనుకుంటున్నారు?**

మేం ఎక్కువగా మహేష్ బాబు గారితో సినిమాలు చేశాం. నేను ప్రస్తుతం చిన్న, పెద్ద చిత్రాలు చేస్తున్నాం. సాయి ధరమ్ తేజ్ గారితోనూ ఓ ప్రాజెక్ట్ గురించి చర్చిస్తున్నాం. ప్రయోగాలు ఎందుకు?.. ఎంటర్టైన్మెంట్ జానర్‌లోనే సినిమాలు =చేయాలని నిర్ణయించుకున్నాను.

**సంక్రాంతి బరిలోకి చివరగా మీరే వస్తున్నారు కదా?**

మేం సంక్రాంతికి వస్తాం అని రెండు నెలల క్రితమే ప్రకటిం చాం. కానీ చాలా మంది నమ్మలేదు. చాలా మంది ఫోన్స్ చేసి అడిగారు. కానీ మేం చెప్పినట్టుగానే సంక్రాంతి కి వస్తున్నాం.

**సినిమాలో శర్వానంద్ కాకుండా శ్రీ విష్ణు పాత్ర ఎలా ఉండబోతోందో చెప్పండి?**

సినిమాలో ఓ మంచి పాత్ర పడింది. ఆ కారెక్టర్‌కి మాకు అందుబాటులో ఉండే హీరో శ్రీ విష్ణు కాబట్టి ఆయన్ను అడిగాం. ఆ పాత్ర వచ్చినప్పుడు థియేటర్లో అందరూ ఎంజాయ్ చేస్తారు

# 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



'మన శంకరవరప్రసాద్ గారు'. జనవరి 12న సెలబ్రేట్ చేసుకుందాం: ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి, మెగా స్వాగ్ అండ్ హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ 'మన శంకర వర ప్రసాద్ గారు' థియేట్రికల్ ట్రైలర్ గ్రాండ్ గా లాంచ్ మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ 'మన శంకర వరప్రసాద్ గారు'తో పండుగ ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఉత్సాహాన్ని మరింత పెంచుతూ విక్టరీ వెంకటేష్ కీలక పాత్రతో నటిస్తున్నారు. నయనతార సంప్ర దాయంగా, ఎంతో అందంగా కనిపిస్తూ, చిరంజీవితో ఆమె కెమిస్ట్రీ ఫ్యామిలీ ఆడియన్స్‌ను బాగా కనెక్ట్ చేస్తుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. తిరుపతి అంటే నాకు చాలా సెంటిమెంటు. ప్రతి సినిమా రిలీజ్‌కి ఇక్కడికి వస్తాను. స్వామి వారి ఆశీస్సులు తీసుకుంటాను. ఆయన దయవలన కెరీర్ చాలా హ్యాపీగా ఉంది. అలాంటి తిరుపతిలోనే ఈ ట్రైలర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత సాహుగారపాటి మాట్లాడుతూ..

'భర్త మహా శయు లకు విజ్ఞప్తి'

# రజనీ, కమల్ షూటింగ్ త్వరలో..



సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ తలైవర్ 173 షూటింగ్ త్వరలో ప్రారంభం పొంగల్ 2027 కి థియేటర్లలో రిలీజ్ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ తలైవర్173 మాగ్నమ్ ఓపస్‌కు దర్శకుడిని అనౌన్స్ చేసింది. సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో వచ్చే ఈ చిత్రానికి సిబి చక్రవర్తి దర్శకత్వం వహిస్తారు. ఇది నెక్స్ట్ లెవల్ సినిమాటిక్ గ్రాండియర్‌గా వుండబోతోంది. రజనీకాంత్ హీరోగా కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మాణంలో తలైవర్173 రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ లెగసీ ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోనుంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రం మాస్ అప్పీల్, ఎమోషన్, హై క్యాలిటీ మేకింగ్ తో ప్రేక్షకులని అలరించబోతోంది.ఈ సినిమా చిత్రీకరణ త్వరలో ప్రారంభమవుతుంది. త్వరలోనే తారాగణం, టెక్నికల్ టీం గురించి మరిన్ని వివరాలను రివిల్ చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు స్పెషల్ ట్రీట్ గా తలైవర్173, 2027 పొంగల్ సందర్భంగా థియేటర్లలో విడుదల కానుంది. సూపర్ స్టార్ పవర్, ఎంటర్టైన్మెంట్, అద్భుతమైన విజువల్స్‌తో ఈ చిత్రం పర్ఫెక్ట్ సినిమాటిక్ ఎక్స్ అందించనుంది.

# గ్యాంగ్‌స్టర్ స్టోరీ 'రిమ్‌జిమ్' మూవీ



అస్లీదమ్ అనే ట్యాగ్‌లైన్‌తో సినిమా నిజ సంఘటనల ఆధారంగా 'రిమ్‌జిమ్', నటించి పాటలు పాడిన రాహుల్ సిప్లిగంజ్, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు1990ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న సంఘటనల ఆధారంగా హేమ సుందర్ దర్శకత్వంలో, సచేతన్ రెడ్డి, డా. మానస, శ్రీనివాసరావు నిర్మాణంలో తెరకెక్కుతున్న మూవీ 'రిమ్‌జిమ్' ˊఅస్లీదమ్ అనే ట్యాగ్‌లైన్‌తో సినిమా రూపొందుతోంది. స్నేహం, ప్రేమ కథగా రూపొందిన ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ సందర్భంగా దర్శకుడు హేమ సుందర్ మాట్లాడుతూ, సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వచ్చిందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నా మని తెలిపారు. ఎ.వి. సినిమాస్ , సి విజువల్స్ బ్యానర్ల పై జి. సచేతన్ రెడ్డి, డాక్టర్ మానస, శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారుప్రధాన పాత్రలో అజయ్ వేద్, హీరోయిన్‌గా వ్రజన నటిస్తున్నారు. ఇతర ముఖ్య పాత్రల్లో బిత్తిరి సత్తి, రాజ్ తిరందాస్ కనిపించనున్నారు.

# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' 7న ట్రైలర్



7న ట్రైలర్ విడుదల మాస్ మహారాజా రవితేజ నుంచి వస్తోన్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ మూవీ 'భర్తమహాశయులకు విజ్ఞప్తి' కిశోర్ తిరుమల దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీని సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం సినిమాపై మరింత హైప్ పెంచింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను మేకర్స్ విడుదల చేశారు. ముఖ్యంగా రవితేజ ఇద్దరు భామల (ఆషికా రంగనాథ్, డింపుల్ హాయాతి) మధ్య నలిగిపోయే 'లవ్ ట్రయాంగిల్' సన్నివేశాలు నవ్వులు పూయించాయి. ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం భోగి పండుగ కానుకగా జనవరి 13న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాలో సునీల్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

# 30న 'గాంధీ టాక్స్' రిలీజ్







ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ నిర్మిస్తోన్న ప్రెస్టీజియస్ మూవీˊగాంధీ టాక్స్'కు సంబంధించి విడుదల తేదిని అధికారికంగా అనౌన్స్ చేసింది. ఈ మూవీ జనవరి 30న గ్రాండ్ రిలీజ్ అవుతుంది. ఇండియన్ సినిమాల్లో అరుదైన సైలెంట్ ఫిల్మ్‌గాˊగాంధీ టాక్స్ రూపొందింది. కథను వివరించటానికి మాటల కంటే నిశ్శబ్దం బలమైన అంశంగా నిలుస్తోంది. ఇది సినీ ప్రపంచంలో ధైర్యమైన, సృజనాత్మకమైన అడుగు.సినిమాను ఎంత గ్రాండియర్‌గా, ఎలాంటి సౌండ్‌తో రూపొందించారంటూ లెక్కలు వేసే నేటి రోజుల్లో గాంధీ టాక్స్ సినిమా తన సందేశాన్ని శాంతియుతంగా, ఎలాంటి శబ్దాలు లేకుండా, భావోద్వేగాలతో చెప్పబోతుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి వంటి స్టార్స్ ఈ సైలెంట్ ఫిల్మ్‌లో నటించటానికి ఒప్పుకున్నారంటే సినిమా అనేది నటన ఆధారిత సినిమా అని కూడా నిరూపించే ప్రయత్నం చేయటమే..సినిమాకు ఎ.ఆర్.రెహమాన్ సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆయన గాంధీ టాక్స్ చిత్రానికి ఎమోషనల్ వాయిస్‌గా నిలుస్తు న్నారు. మాటలు లేకుండా రూపొందుతోన్న ఈ సినిమాకు రెహమాన్ సంగీతం నెరేటర్‌గా మారుతూ సినిమాలోని డెప్త్‌ను ప్రేక్షకులకు తెలియజేస్తోంది.ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కిషోర్ బెలేకర్ మాట్లాడుతూ 'నిశ్శబ్దం అనే నమ్మి గాంధీ టాక్స్ సినిమా ను రూపొందించాం.' అన్నారు.

### ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్‌లో

# స్టాస్యకు రజతం



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక జూనియర్ నేషనల్ ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్ (జెఎన్ఇసి) 2025లో డ్రెస్సేజ్ టీమ్ ఈవెంట్‌లో యువ ముంబై ఈక్వెస్ట్రియన్ స్టాస్య పాండ్యా బలమైన ప్రదర్శన ఇచ్చి రజత పతకాన్ని గెలుచుకుంది. ఈ పోటీల్లో సర్జ్ స్టేబుల్స్‌కు చెందిన కిర్రి టావోంగాతో పోటీపడి 67.463 పాయింట్లు సాధించి తన జట్టు పోడియం ముగింపులో స్టాస్య కీలక పాత్ర పోషించింది. స్టాస్య జట్టు స్థిరమైన సమిష్టి కృషిని ప్రదర్శించింది.
ఫ్రిట్జ్ రైడింగ్ చేస్తున్న హరిప్రియ సింగ్ 71.243 స్కోరు చేయగా, కౌంట్ మీ ఇన్ డి గ్రేడింగ్‌లో ఆస్ట్రైడ్ అయిన అమరా సింగ్ 68.581 స్కోరు సాధించింది. ఇద్దరూ గుజరాత్‌లోని సీ హార్స్ ఈక్వెస్ట్రియన్‌కు ప్రాతినిధ్యం వహించారు. మీరట్‌లోని మోడీ ఈక్వెస్ట్రియన్‌కు చెందిన సెరానో రైడింగ్ చేస్తున్న దేవ్ హారీష్ కపూర్ 65.934 స్కోరు జోడించడంతో జట్టు మొత్తం 207.287 స్కోరుతో ముగిసింది. జూనియర్ నేషనల్ ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్ 2025లో స్టాస్య పాండ్యా రజత పతకం ఆమె యువ కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది.

### బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# అమిత్, సాగర్‌లు గెలుపు





**న్యూఢిల్లీ:** సీనియర్ జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో అమిత్ పంగల్, సాగర్ అద్భుత ప్రదర్శన చేశారు. ఎలైట్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ప్రారంభ రోజున మాజీ ఆసియా క్రీడల బంగారు పతక విజేత అమిత్ పంగల్, హెవీవెయిట్ పోటీదారు సాగర్ విజయాలతో తమ ప్రచారాలను ప్రారంభించారు. బాంటమ్ వెయిట్ విభాగంలో పోటీ పడిన ఎస్ఎస్‌సిబికి చెందిన పంగల్ తన ప్రత్యర్థి ఉస్మాన్ మొహమ్మద్ సుల్తాన్‌ను ఓడించాడు.
2018 ఆసియా క్రీడల ఛాంపియన్, ప్రారంభం నుండే బౌట్‌ను తన ఆధీనంలోకి తీసుకున్నాడు. పదునైన ఫుట్‌వర్క్, క్లీన్ కాంబినేషన్‌లను ఉపయోగించి ఎక్స్ఛేంజ్‌లపై ఆధిపత్యం చెలాయించి తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు. మరోపక్క హర్యానాకు చెందిన సాగర్ హెవీవెయిట్ విభాగంలో చాలా కఠినమైన సవాలును ఎదుర్కొన్నాడు. తన ప్రత్యర్థి అయిన ఎడ్విన్‌తో జరిగిన మ్యాచ్‌లో సాగర్ తీవ్రంగా పోరాడాడు. ఈ పోటీలో ఇద్దరు బాక్సర్లు ఒకరిపై ఒకరు ఆధిపత్యం సంపాదించేందుకు తీవ్రంగా పోరాడారు. సాగర్ తన అద్భుత ప్రదర్శనతో రాణించి ప్రత్యర్థిని మట్టికరిపించి తదుపరి దశకు చేరుకున్నాడు. బాంటమ్ వెయిట్ విభాగంలో మరో ముఖ్యమైన ఫలితం ఏమిటంటే, మిజోరాంకు చెందిన లాల్రాంబుట్ ఒడిశాకు చెందిన సంతోష్ కుమార్‌పై నిర్ణయాత్మక విజయం సాధించాడు.




### యూత్ కంటెండర్ ఛాంపియన్స్‌గా

# సింద్రెలా-సార్తక్, వివాన్-నైషా జంట

### సింగిల్స్‌లో సింద్రెలాకు టైటిల్

**న్యూఢిల్లీ:** యూత్ కంటెండర్ 2026లో భారత్ మిక్స్‌డ్ ప్లేయర్లు డబుల్ టైటిల్స్‌ను సాధించారు. సింద్రెలా దాస్- సార్థక్ ఆర్యతో కలసి అండర్19 మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను, వివాన్ దవే-నైషా రేవాస్కర్ ద్వయం అండర్15 మిక్స్‌డ్ డబుల్స్ టైటిళ్లను గెలుచుకున్నారు. ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటిటి) యూత్ కాంటెండర్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణి సింద్రెలా దాస్-సార్థక్ ఆర్యతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ కిరీటాన్ని కైవసం చేసుకోవడం ద్వారా రెండు రోజుల్లోనే తన రెండవ టైటిల్‌ను గెలుచుకుంది. అండర్19 మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో సింద్రెలా-సార్థక్ 11-3, 11-9, 11-3 తేడాతో అభినంద్ ప్రధివాధి-అనన్య మురళీధరన్‌ల టాప్ సీడ్ కాంబినేషన్‌పై ఆధిపత్యం చెలాయించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. అలాగే బాలికల అండర్17 సింగిల్స్ టైటిల్‌ను సింద్రెలా గెలుచుకుంది. అండర్15 మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను వివాన్ దవేనైషా రేవాస్కర్ 11-8, 11-8, 11-3తో రేయాన్ష్ జలాన్ తనిష్క కాలభైరవ్‌పై గెలిచారు. అంతకుముందు, అండర్ 11, అండర్ 15 మరియు అండర్ 19 బాలికలు, బాలురు గ్రూప్ దశలో పోటీ పడ్డారు. ప్రతి గ్రూప్ నుండి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్ళు నాకౌట్ దశకు అర్హత సాధించారు. బాలుర అండర్11 విభాగంలో, గ్రూప్ 1లో రెహాన్ష్ సింఘ్వి, గ్రూప్ 2లో రాజ్‌దీప్ బిశ్వాస్ తమ మూడు గ్రూప్ మ్యాచ్‌ల్లోనూ గెలిచి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. బాలికల అండర్11 విభాగంలో ఆద్య బహేటి, అన్షిక గుప్తా తమతమ గ్రూపులలో అగ్రస్థానంలో నిలిచి చివరి నాలుగు దశలకు చేరుకున్నారు.

### న్యూజిలాండ్ వన్డేకు టీమిండియాలో షాకింగ్

# అర్హత లేకున్నా రీ ఎంట్రీ!

### ప్లేయర్ల ఎంపిక వివాదాస్పదం




**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు సిద్ధమైంది. ఈ నెల 11 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్ కోసం సెలెక్టర్లు 15మంది ప్లేయర్లతో భారత జట్టును ఎంపిక చేసింది. ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా నియమించారు. గిల్ ప్రస్తుతం గాయం నుంచి కోలుకుంటున్నాడు. అయితే అతని పేరు పక్కన స్టార్ గుర్తు ఉంది. అంటే బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అతనికి ఇంకా గ్రీన్ సిగ్నల్ లభించలేదని అర్థం. వైద్య బృందం అనుమతి ఇస్తేనే అతడు మైదానంలోకి దిగుతాడు. అయితే ఈ టీమిండియా స్క్వాడ్‌లో ముగ్గురు ప్లేయర్ల ఎంపిక షాక్ ఇచ్చింది.
లెఫ్ట్ హ్యాండ్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను సెలెక్టర్లు వన్డే జట్టులోకి తీసుకున్నారు. అయితే, 2025 సంవత్సరంలో పంత్‌కు ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ఏడాది పొడవునా అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. ప్రస్తుత విజయ్ హాజారే ట్రోఫీ (2025-26)లో కూడా పంత్ పెద్దగా ప్రభావం చూపలేదు. 5 మ్యాచ్‌ల్లో కేవలం రెండు హాఫ్ సెంచరీలతో 188 పరుగులు మాత్రమే చేశాడు. అదే సమయంలో ధ్రువ్ జురెల్ (379), ఇషాన్ కిషన్ (2 మ్యాచ్‌ల్లో 146) అద్భుతంగా రాణిస్తున్నా బీసీసీఐ వారిని విస్మరించింది. అలాగే యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్‌కు కూడా టీమ్‌లో చోటు దక్కింది. కానీ అతని గత గణాంకాలు ఏమాత్రం ఆకట్టుకునేలా లేవు. ఇప్పటివరకు ఆడిన రెండు వన్డేల్లో నితీష్ కేవలం 27 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేదు. అతని ఎకానమీ రేటు కూడా 7.74 గా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హాజారే ట్రోఫీలో కూడా 5 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క అర్ధ సెంచరీ, 6 వికెట్లు మాత్రమే తీశాడు.
అయినప్పటికీ సెలెక్టర్లు అతనికి వన్డే క్యాప్ ఇచ్చేందుకు మొగ్గు చూపారు. ఇక ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణపై ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు కనిపిస్తోంది. ప్రసిద్ధ్ ఇప్పటి వరకు 21 వన్డేల్లో 37 వికెట్లు తీశాడు. అతని ఎకానమీ రేటు 6.02 గా ఉంది. విజయ్ హాజారే ట్రోఫీలో కర్ణాటక తరపున కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. మరోవైపు, ఇదే టోర్నమెంట్‌లో 5 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసి ఫామ్‌లో ఉన్న మొహమ్మద్ షమీని సెలెక్టర్లు పక్కన పెట్టి ప్రసిద్ధ్‌ను ఎంచుకోవడం వివాదాస్పదమైంది.



# ఆస్ట్రేలియా ఆధిపత్యం

### ట్రావిస్ హెడ్ విధ్వంసం..

### 218 రన్స్ వెనుకబడిన ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక యాషెస్ 2025-26 సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా ఆధిపత్యం చెలాయిస్తోంది. ట్రావిస్ హెడ్ (91) విధ్వంసకర బ్యాటింగ్‌తో రెండో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 34.1 ఓవర్లలో 2 వికెట్లకు 166 పరుగులు చేసింది. మరో ఓపెనర్ జేక్ వెదరాల్డ్ (21) నిరాశపర్చగా, మార్నస్ లబుషేన్ (48) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. మైఖేల్ నెజర్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ 2 వికెట్లు తీసాడు. ప్రస్తుతం ఆసీస్ 218 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు 211/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ జోరూట్ (160) భారీ శతకంతో చెలరేగగా, హ్యారీ బ్రూక్ (84) తృటిలో సెంచరీ, జెమీ స్మిత్ (46) హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నారు. కెప్టెన్ బెన్ స్టోక్స్(0) డకౌటయ్యాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైఖేల్ నెజర్(4/60) 4 వికెట్లు తీయగా, మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు, కామెరూన్ గ్రీన్, మార్నస్ లబుషేన్ తలో వికెట్ తీసారు. కాగా ఈ సిరీస్‌ను ఆసీస్ 31తో ఇప్పటికే కైవసం చేసుకుంది.
ఈ ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ఆసీస్ వరుసగా మూడు గెలవగా, ఇంగ్లండ్ నాలుగో టెస్ట్‌లో గెలిచి పరువు కాపాడుకుంది. ఆఖరి టెస్ట్‌లో ఇరు జట్లు సమంగా దూసుకెళ్తున్నాయి. ఇక మూడో రోజు ఆటలో మ్యాచ్ గమనం ఏంటో తేలిపోనుంది. ఆసీస్ త్వరగా ఆలౌటైతే ఇంగ్లండ్‌కు విజయవకాశాలు ఉంటాయి. క్రీజులో నిలదొక్కుకొని భారీ స్కోర్ చేస్తే ఆసీస్‌కు గెలుపు అవకాశాలు పెరుగుతాయి.

### వెండి, పసిడి

# మార్కెట్లు ర్యాలీ!

### ఎంసిఎక్స్ ఫ్యూచర్స్‌లోనూ దూకుడే



**ముంబయి, జనవరి 5:** అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడి మార్గాలవైపు పరుగులు పెడుతున్నారు. ముఖ్యంగా బంగారం వైపు పరుగులు తీస్తున్నారు. అమెరికా బలగాలు వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకోవడంతో పసిడి, వెండి ధరలు ఒక్కసారిగా భగ్గు మన్నాయి. ఈ పరిణామంతో పెరిగిన సేఫ్ హెవెన్ డిమాండ్ బులియన్ మార్కెట్‌కు రెక్కలు తొడిగింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో ఫిబ్రవరి నెల గోల్డ్ ఫ్యూచర్స్ 1.47 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1,37,750 వద్ద ట్రేడ్ అయింది. ఇక మార్చి నెల వెండి ఫ్యూచర్స్ ఏకంగా 2.92 శాతం లాభపడి కిలోకు రూ. 2,43,223కి చేరింది. అయితే, 2025 డిసెంబర్ నాటి రికార్డు గరిష్ఠ స్థాయిల కంటే ఈ ధరలు ఇంకా తక్కువగానే ఉన్నాయి. వెనెజులా పరిణామాలకు తోడు, రష్యాఉక్రెయిన్ శాంతి చర్చల్లో నెలకొన్న అనిశ్చితి, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు పసిడి పెరుగుదలకు దోహదపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం దేశీయంగా ధరల పెరుగుదలకు మద్దతుగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 1.5 శాతం పెరిగి 4,395 డాలర్లకు చేరింది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ధరలు తగ్గినా, సురక్షితమైన పెట్టుబడి రూపంలో కొనుగోళ్ల మద్దతు లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.
బంగారానికి రూ. 1,35,550 వద్ద మద్దతు, రూ. 1,38,150 వద్ద నిరోధం ఉండగలదని అంచనా. అమెరికా నుంచి వెలువడనున్న ఉపాధి గణాంకాలు, తయారీ రంగ డేటా వంటి కీలక నివేదికల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు.
ఈ నివేదికలు ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయంపై ప్రభావం చూపనున్నాయి. 2025 కేలండర్ సంవత్సరంలో బంగారం ధర ఏకంగా 66 శాతం పెరగ్గా, వెండి 171 శాతం వృద్ధితో దానిని మించిపోయింది. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు భారీగా కొనుగోళ్లు జరపడం, పారిశ్రామిక కొరత వంటివి ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.



### పిఎల్ఐ స్కీంతో

# రికార్డు స్థాయిలో ఐఫోన్ సేల్స్!

**న్యూఢిల్లీ, జనవరి 5:** అమెరికా టెక్ దిగ్గజం యాపిల్, భారత ప్రభుత్వ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకంతో రికార్డులు నమోదుచేసింది. 2025 డిసెంబర్ నాటికి భారత్‌లో తయారైన ఐఫోన్ల ఎగుమతులు 50 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 4.15 లక్షల కోట్లు మార్కును అధిగమించాయి. యాపిల్ ఐదేళ్ల పీఎల్ఐ గడువు ముగియడానికి ఇంకా మూడు నెలలు మిగిలి ఉండగానే ఈ ఘనత సాధించింది. పరిశ్రమ వర్గాల గణాంకాల ప్రకారం 2026 ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లోనే ఏప్రిల్‌డిసెంబర్ 2025 దాదాపు 16 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను యాపిల్ ఎగుమతి చేసింది. ఇదే పథకం కింద ఐదేళ్లలో శాంసంగ్ సంస్థ సుమారు 17 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను మాత్రమే ఎగుమతి చేయడంతో పోలిస్తే, యాపిల్ వృద్ధి ఎంత వేగంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.
ప్రధానంగా ఐఫోన్ల వల్లే భారత్ నుంచి స్మార్ట్‌ఫోన్లు అతిపెద్ద ఎగుమతి విభాగంగా అవతరించాయి. మొత్తం స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో దాదాపు 75 శాతం వాటా ఐఫోన్లదే. ఈ వృద్ధితో మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా నిలిచింది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న 99 శాతానికి పైగా ఫోన్లు మేడ్ ఇన్ ఇండియా కావడం గమనార్హం. ప్రస్తుతం దేశంలో టాటా గ్రూప్‌కు చెందిన మూడు, ఫాక్స్‌కాన్‌కు చెందిన రెండు ప్లాంట్లతో కలిపి మొత్తం ఐదు అసెంబ్లీ కేంద్రాల్లో ఐఫోన్లు తయారవుతున్నాయి.
వీటికి అనుబంధంగా సుమారు 45 కంపెనీలు విడిభాగాలను సరఫరా చేస్తున్నాయి. మరోవైపు దేశీయ మార్కెట్లోనూ యాపిల్ హవా కొనసాగుతోంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం 2025 తొలి 11 నెలల్లోనే దాదాపు 65 లక్షల ఐఫోన్ 16 యూనిట్లను విక్రయించి, దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న స్మార్ట్‌ఫోన్‌గా నిలిచింది. ఆండ్రాయిడ్ ఫోన్లను అధిగమించడమే కాకుండా ఐఫోన్ 15 కూడా టాప్5 జాబితాలో చోటు దక్కించుకుంది. ప్రస్తుత స్మార్ట్‌ఫోన్ పీఎల్ఐ పథకం మార్చి 2026తో ముగియనుండగా, ప్రభుత్వం మద్దతును పొడిగించే మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది.

# 27న బ్యాంకుల సమ్మెతో నాలుగు రోజులు సెలవులు!

**న్యూఢిల్లీ, జనవరి 5:** బ్యాంకు ఉద్యోగులసంఘాలు ఈనెల 27వ తేదీ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. వారానికి ఐదు రోజుల పని విధానం వెంటనే అమలుచేయాలని కోరుతూ ఈనెల 4వ తేదీనే అఖిలభారత బ్యాంకు అధికారుల సమాఖ్య నోటీసులు ఇచ్చింది. దీనితో ఈనెలలోనే బ్యాంకులు ఐదురోజులు సెలవులు తప్పవని తెలుస్తోంది. ప్రభుత్వానికి ఎన్నిసార్లు నివేదించినా ఇప్పటికీ తమ డిమాండ్ పరిష్కరించలేదని వేతన రివిజన్ ఒప్పందం సమయంలోనే వారానికి ఐదురోజుల పనివిధానాన్ని అంగీకరించినా అమలుకాలేదని బ్యాంకు అధికారుల సంఘం చెపుతోంది.




2024 మార్చిలోనే వేతన సవరణ ఒప్పందం జరిగిందని ఐబిఎకు, బ్యాంకు యూనియన్లమధ్య జరిగిన ఈ ఒప్పందంలోనే వారానికి ఐదురోజులపనివిదానం కూడా కోరినట్లు ఎఐబిఒసి తన సర్క్యులర్‌లో వెల్లడించింది. ఇతర కేంద్రప్రభుత్వసంస్థలతో సమానంగానే వారానికి ఐదురోజుల పనివిధానం అమలుచేయాలని డిమాండ్‌చేస్తున్నారు. అలాగే ఇపుడున్న రెండు,నాలుగోశనివారాలు మాత్రమే అమలవుతున్నాయని, నిరాఘాటంగా ఐదురోజులపనివిధానం అమలుకు తీసుకురావాలనికోరుతున్నారు. ఇందుకోసం బ్యాంకు ఉద్యోగులు 40 నిమిషాలు అదనంగాపనిచేసేందుకు కూడా అంగీకరించారాన్నరు. ఆర్బీఐ, ఎల్ఐసి, జిఐసి, స్టాక్ ఎక్ఛేంజిలు, మనీ మార్కెట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికే ఐదురోజుల పనివిధానం అమలుచేస్తున్నాయని బ్యాంకులకు కూడా వర్తింపచేయాలని వారు డిమాండ్‌చేసారు. ఇప్పటికే సోషల్‌మీడియా ప్రచారం ముమ్మరంచేసిన ఎఐబిఒసి 18.8 లక్షల మందిని ఆకట్టుకుంది. మూడులక్షల పోస్టులు కూడా వచ్చాయి. సమ్మెకారణంగా 27న మంగళవారం బ్యాంకు లావాదేవీలు నిలిచిపోతాయి. బ్యాంకు కార్యకలాపాలు, చెక్కు క్లియరెన్సులు, నగదు లావాదేవీలు, కస్టమర్‌షేవలు అన్నీ నిలిచిపోతాయి. దీనికితోడు ఆన్‌లైన్, ఎటిఎం సేవలకు కూడా అంతరాయం కలుగుతుంది. 24వ తేదీ శనివారం, 25వ తేదీ ఆదివారం, 26వ తేదీ సోమవారం గణతంత్ర దినోత్సవాలు వచ్చాయి. ఇపుడు సమ్మె తోడయితే 27న కూడా నిలిచిపోతాయి. మొత్తంగా ఈనెలలో నాలుగురోజులుపాటు బ్యాంకు సెలవులతో కస్టమర్లు ఇబ్బందులుపడే ప్రమాదం ఉంది.




### స్వల్ప నష్టాలతో ముగిసిన

# సెన్సెక్స్, నిఫ్టీ

### వెనిజులాపై అమెరికా సైనికచర్య ఎఫెక్ట్

**ముంబయి, జనవరి 5:** దేశీయ స్టాక్ సూచీలు వారం ప్రారంభంలోనే స్వల్ప నష్టాలతోముగిసాయి. ఆద్యంతం ఊగిసలాటతో నడిచిన సూచీలకు భౌగోళిక ఉద్రిక్తతలు ప్రభావంచూపించాయి. అమెరికా వెనిజులాపై సైనిక చర్య, అధ్యక్షుని అరెస్టు ప్రభావం ఎక్కువ ఉంది. సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ కూడా చిన్నపాటి లాభనష్టాల్లోనే ముగిసాయి. ఇన్వెస్టర్లు ఆద్యంతం అప్రమత్తంగానే వ్యవహరించారు. నిఫ్టీ చివరకు 26,250వద్ద స్థిరపడింది. ఎంపికచేసిన భారీ స్టాక్స్‌లో మాత్రమే దూకుడు కనిపించింది. ఐటి, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు ఒత్తిడికి లోనయితే ఎఫ్ఎంసిజి, కన్స్యూమర్ డ్యూరబుల్స్ కొంతమెరుగయ్యాయి. మొత్తంగాచూస్తే సెంటిమెంట్ బలంగా కనిపించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 322.39 పాయింట్లు నష్టపోయి 85,439.62 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 78.25 పాయింట్లు క్షీణించి 26,250.30వద్ద స్థిరపడింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.25, ఇన్ఫోసిస్ 2.09, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.94శాతంచొప్పున క్షీణించాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.05శాతం పెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.07శాతం లాభపడింది. మార్కెట్ల తీరు మొత్తం ప్రతికూలంగా కనిపించింది. బిఎస్ఇలో 1723 కంపెనీలషేర్లు పెరిగితే 2544 షేర్లు క్షీణించాయి. 203 కంపెనీలషేర్లు యధావిధిగా కొనసాగాయి. ఇక భారత్ విదేశ ఈకరెన్సీ నిల్వలు 3.29 బిలియన్ డాలర్లు పెరిగి 696,61 బిలియన్ డాలర్లకు పెరిగాయి. విదేశీ ఆస్తులు 559.61 బిలియన్ డాలర్లుగా ఉంటే పసిడి నిల్వలు 2.96 బిలియన్ డాలర్లు పెరిగి 113.32 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
భారత్ ఐఎంఎఫ్‌వద్ద స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 60 మిలియన్ డాల్లుపెరిగి 18.80 బిలియన్ డాలర్లకు చేరితే ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి 93 మిలియన్ డాలర్లుపెరిగి 4.88 బిలియన్ డాలర్లుగా నిలిచింది. బ్రెంట్‌ముడిచమురు మార్చి సెటిల్‌మెంట్లకుగాను 7 సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 60.82 డాలర్లుగా నిలిచింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 90.2750గా నిలిచింది.

# ఎయిరిండియాకు కొత్త సిఇఒ కోసం అన్వేషణ




**ముంబయి, జనవరి 5:** టాటాగ్రూప్ ఎయిర్ ఇండియాకు కొత్త సిఇఒకోసం అన్వేషణ మొదలుపెట్టింది. ప్రస్తుత సిఇఒ కాంప్‌బెల్ విల్సన్ పదవీకాలం వచ్చే ఏడాదితోముగుస్తుండటంతో కొత్తసిఇఒకోసం కసరత్తులుప్రారంభించింది. అలాగే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు కూడా సిఇఒను అన్వేషిస్తోంది. ప్రస్తుత సిఇఒ అలోక్‌సింగ్ పదవీకాలం కూడా 2027లో ముగుస్తుంది. ఇప్పటి నుంచే ఈ రెండుపదవులకు అర్హులైన వారికోసం కసరత్తులు ముమ్మరం చేసింది.
క్యాంప్‌బెల్ కానీ, టాటాగ్రూప్‌గాని పదవీలో కొనసాగేందుకు సుముఖంగా లేరు. ఈ రెండు కసరత్తులతో కనీసం మూడు నుంచి ఆరునెలలపాటు వ్యవధి తీసుకుంటుందని, అర్హులైన అనుభవజ్ఞులైన వారికోసం టాటాగ్రూప్ తీవ్రస్తాయిలో అన్వేషణ చేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే జూన్‌లోనే ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 కులిపోయిన సంఘటనకు సంబంధించిన తుదినివేదిక జూన్‌లో వెలువడనున్నది. ఈ సమావేశంకోసమే సిఇఒ విల్సన్ టాటాహౌస్‌కు సోమవారం వచ్చారు. 2022 జులై మధ్యస్థంలో ఎయిర్ ఇండియాకకు సిఇఒగా కాంప్‌బెల్ నియమితులయ్యారు. టర్కిష్ ఎయిర్‌లైన్‌స మాజీ ఛైర్మన్ ఇల్కర్ ఐసీ ఎయిరిండియాకు వచ్చేందుకు ఇష్టపడకపోవడంతో క్యాంప్‌బెల్‌ను టాటాగ్రూప్ నియమించింది. 2022 జనవరిలోనే టాటాగ్రూప్ ఎయిర్‌ఇండియాను ప్రభుత్వంనుంచి కొనుగోలుచేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.